# లోకానికి నేనే వెలుగు



## ఆధ్యాత్మిక యాత్ర
## గురువుల ఆదర్శ జాడ

సంపుటి - 42 | జూలై - సెప్టెంబర్ 2019 | సంచిక - 3

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

## ప్రచురణ

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.

## సంపాదక వర్గం

ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్
ఫాదర్ పిల్లి అంతోని దాస్
ఫాదర్ దాసి సురేష్ కుమార్
ఫాదర్ కురుమ తామస్

## గురువిద్యార్థుల బృందం

బ్రదర్ అల్లం సాగర్ మనోజ్ కుమార్
బ్రదర్ మానూరి మార్కో
బ్రదర్ కల్లేపల్లి యేసుబాబు
బ్రదర్ సిగినం ప్రకాశ్
బ్రదర్ యానాద్రి బాలయేసు
బ్రదర్ కొప్పర డేవిడ్
బ్రదర్ గోన పీటర్
బ్రదర్ కంకిపాటి అనిల్
బ్రదర్ బొమ్ము మత్తయి
బ్రదర్ కదిరేపోగు జయన్న
బ్రదర్ రామంచ శరత్ కుమార్

## చందా వివరములు

సంవత్సరానికి మీ చందాను రూ. 100/- యం.ఓ., డి.డి..ల ద్వారా
St. John's Regional Seminary Society, Hyderabad
పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు
మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్ :

**St. John's Regional Seminary**
Ramanthapur, Hyderabad - 500 013.
Ph : 040-27201427, 27200370, Fax : 27209505
e-mail : stjohnshyd2@gmail.com

Printed at : holycrossprinters 9848145417

# లోకానికి నేనే వెలుగు

సంపుటి-42 జూలై - సెప్టెంబర్ 2019 సంచిక-3

## ఆధ్యాత్మిక యాత్ర
## గురువుల ఆదర్శ జాడ

**ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్**

**ప్రధాన సంపాదకులు**
**మరియు**
**సంచిక సంపాదకులు**

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ : 040-27201427, 27200370
e-mail : stjohnshyd2@gmail.com
website : stjohnseminaryhyd.org

# విషయసూచిక


సంపాదకీయం

**1.** **శ్రీసభ ఆధ్యాత్మిక అభివృద్ధిలో**
**పునీత అస్సిసీపురి ఫ్రాన్సిస్ వారి పాత్ర .................................. 09**
*– బ్రదర్ కొండాల కిషోర్*

**2.** **పునీత లయోలపూరి ఇన్యాసివారి ఆధ్యాత్మికత మరియు**
**ప్రస్తుత గురుత్వ జీవితంలో దాని ప్రాముఖ్యత .......................... 50**
*– బ్రదర్ సూరిపోగుల రవి*

**3.** **ప్రజలను దేవుని సేవయందు తరింపచేయుటలో**
**గురు జీవితమందు ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ............................. 76**
*– బ్రదర్ వడ్లపాటి మరియదాస్*

# సంపాదకీయం



"దైవకటాక్షం మీద పూర్తి నమ్మకాన్ని పెట్టుకున్నపుడు, జీవితం యెడల మనకున్న దృక్పథం పూర్తిస్థాయిలో మార్పు చెందుతుంది. తెలియని ప్రాంతానికి – అది భౌతికమైన లేక ఆధ్యాత్మికమైన యాత్రకానివ్వండి, అది మనకు సవాలుగాను, అనిశ్చితిగాను ఉంటుంది, మరీ ముఖ్యంగ బానిసత్వం నుండి స్వేచ్ఛాపూరితమైన యాత్ర చేసేటపుడు మనకు చాలా ధైర్యం కావాలి" అని ఫాదర్ ప్రతాప్ సమద్ (ఎస్.జె.) అంటారు. ఇలా తమ ఆధ్యాత్మిక జీవితంలో యాత్రను మొదలుపెట్టి అనేక ఒడుదొడుకులు ఉన్నా, విజయవంతంగ ముగించుకున్న పునీతులు కోటానుకోట్లమంది ఉన్నారు. అందులో శ్రీసభ గుర్తించిన పునీతులు ఉన్నారు. హతసాక్షులు, మతసాక్షులు, శ్రీసభ పండితులు, జగద్గురువులు, పీఠాధిపతులు, యాజకులు, డీకన్లు, సన్యాసులు, కన్యలు, మఠాధిపతులు, దైవభక్తులు, దైవాంకితులు, ఇంకను అనేక స్థాయిల్లో తమ తమ యాత్రలను దేవునికి ఇష్టమైన తీరులో చక్కగ ముగించారు. క్రైస్తవులకు మార్గచూపరులైనారు. అట్టివారిలో పునీత అస్సిసీపురి ఫ్రాన్సిస్‌గారి జీవితం, పునీత లయోలపురి జీవితం మనకు ఆదర్శప్రాయంగ ఉంటుందని, మన యాత్ర కూడ అంతో ఇంతో అలా ఉండాలని రచయితలు తెలియజేస్తున్నారు. అలానే క్రైస్తవ సంఘాలను, దైవ ప్రజలను నడిపించే గురువుల ఆధ్యాత్మిక జీవితం దైవ సేవయందు తరించాలని చెబుతు, అపుడే క్రైస్తవుల యాత్ర పరిపూర్ణంగ ముగుస్తుందని వ్యాసకర్తలు తెలియపరుస్తున్నారు. ఈ మూడు పత్రాల ద్వారా మనకు ఆధ్యాత్మిక విషయాలు తెలిసివచ్చి, ఇద్దరి జీవిత ఆదర్శాన్ని అందుకుని గురువుల నడిపింపులో మనం ముందుకు పయణించగలమన్న ధైర్యాన్ని చేకూరుస్తాయి.

ఆనవాయితీ ప్రకారం ఈ సంచికలో తెలుగు కతోలిక దైవశాస్త్ర విభాగంవారు ఏటేటా జరిపించే సదస్సు నుండి ఉపన్యసితులు నివేదించిన పత్రాలనే పాఠకులకు అందిస్తుండేవారం. అయితే ఈ సంవత్సరం వారు ఆలస్యంగ సదస్సును నిర్వహించారు. అందుమూలంగ వారి వ్యాసాలు సకాలానికి అందలేదు. సంచిక మీ చేతులలోకి రావటం మరీ ఆలస్యమౌతుందేమోనని త్వరపడి ఈ సంచికను మీకు అందజేస్తున్నాం. ఆధ్యాత్మిక విషయాలు గనుక చదువరులకు ఒంటబట్టగలవని ఆశిస్తున్నాం. దైవశాస్త్ర అధ్యయనంలో భాగంగా కాంక్షితాల పాక్షిక పరిపూర్తి నిమిత్తం (Papers submitted in partial fulfillment of the requirements for the Theological Studies) పునీత యోహాను ప్రాంతీయ గురు విద్యాలయానికి చెందిన ముగ్గురు విద్యార్థులు (మొదటిసారిగా) తెలుగులో నా నడిపింపులో శాస్త్రీయ పత్రాలను (Scientific Papers) వ్రాసారు. వాటినే ఈ సంచికలో అందజేస్తున్నాము.

మొదటి పత్రం – "శ్రీసభ ఆధ్యాత్మిక అభివృద్ధిలో పునీత అస్సీసీపురి ఫ్రాన్సిస్‌వారి పాత్ర" గురించి వ్రాస్తు, బ్రదర్ కొండాల కిషోర్ 12వ శతాబ్దంలో సన్నగిల్లుతున్న శ్రీసభ ఆధ్యాత్మిక విలువలను తన జీవితం ద్వారా బలపరచారని, పునీతుని జీవిత చరిత్ర ఆధారంగా వివరించాడు. పశువుల పాకకు ఆధ్యుడుగా, పంచగాయాల యోధుడుగా, తొలి కన్యల మఠస్థాపకుడుగా, ప్రకృతి ప్రేమికుడుగా, సంఘసంస్కర్తగా పునీతుని అభివర్ణించాడు. విశేషించి, గురుత్వం మీద పునీతునికున్న అపారమైన గౌరవ ప్రపత్తులకు అద్దంపట్టాడు. పునీతుని ఆదర్శం అందరికి, ముఖ్యంగ గురువులకు శిరోధార్యమని ఉద్ఘాటించాడు. తన వ్యాసంలో భాషయెడల, శైలి గురించి మరికాస్త శ్రద్ధ వహించి ఉంటే పాఠకులకు సజావుగా ఉండేది.

రెండవ పత్రం – "పునీత లయోలపురి ఇన్యాసివారి ఆధ్యాత్మికత మరియు ప్రస్తుత గురుత్వ జీవితంలో దాని ప్రాముఖ్యత" గురించి ప్రస్తావిస్తు, బ్రదర్ సూరిపోగుల రవి 15–16 శతాబ్దాలలోని పరిస్థితుల ప్రభావం ఏవిధంగ పునీత

ఇగ్నేషియస్‌వారి జీవితం మీద పనిచేసి, అతనిలో పరివర్తన తీసికొచ్చాయో, మరీ ముఖ్యంగా మంచం పట్టిన దశలో పరిశుద్ధ గ్రంథం, క్రీస్తు అనుసరణ పుస్తకం చదవటం వలన అతనిలో ఎంతటి ఆధ్యాత్మిక మార్పు వచ్చిందోనని విశదపరచాడు. కలలు కూడ తోడ్పడిన విధానాన్ని సమకూర్చాడు. ఆధ్యాత్మిక జీవితంలో గుడ్డిభక్తితో సాగకుండ, నిర్దిష్టమైన పథకంతో సాగుతు, ఇతరులను నడిపిస్తు, దేవుని పిలుపుకు పునీతుడు స్పందించిన తీరు, ఆలోచన చేయలేనిది హృదయం చేస్తుందన్న విషయం, మనో స్వేచ్ఛ రాణించు విధానం, సర్వపరిశోధనా ఫలం వంటి విషయాలను పూసగుచ్చాడు. ఇవన్నీ ఏవిధంగ ఈనాటి గురుత్వం మీద ప్రభావం చూపగలవోనని సప్త సవాచకాల ఆధారంగ చర్చించాడు. శైలిలోను, పదజాల ప్రయోగంలోను మరింత పట్టును చూపగలిగితే చదువరులకూ లెస్సగా ఉండేది.

మూడవ పత్రం – "ప్రజలను దేవుని సేవయందు తరింప చేయుటలో గురు జీవితమందు ఆధ్యాత్మిక ప్రాముఖ్యత" గురించి లిఖిస్తూ, బ్రదర్ వడ్లపాటి మరియదాస్ నేటి సమాజంలో గురువులు తమ బాధ్యతలను ఎలా తలకెత్తు కోవాలనో విపులీకరించాడు. దేవునితో గురువుయొక్క ఆధ్యాత్మిక సంబంధం ఏర్పడడానికి గురువు యేసుని యాజకత్వాన్ని సరిగా అర్థంచేసికొని, క్రీస్తుతో స్నేహంగ ఉంటు సిలువను అంటిపెట్టుకొని, ప్రార్థనాపరుడై ఉండాలని తేటతెల్లం చేశాడు. గురువు ఆధ్యాత్మిక సుగుణాలయిన విధేయత, బ్రహ్మచర్యం, పేదరికం మీద దృష్టిని ఆనించాలని కోరాడు. గురువు తన వ్యక్తిగత జీవితంలో ప్రార్థన, పవిత్రాత్మతో సాన్నిహిత్యం, ప్రాయశ్చిత్తం, మరియమాత మీద భక్తి, దైవశక్తి – అనుగ్రహస్థితి, సమస్యలను అధిగమించుట వంటి విషయాలను స్పృశించాడు. గురువులకు సరియైన ఆదర్శ గురువు పునీత జాన్ మరియ వియాన్నినే అని ఉద్ఘాటించాడు. సమాజంలో గురువు ప్రజల కోసం – అన్ని పనులయందు అందరివాడని, వరాలను పంచేవాడని, ఆత్మల కాపరి – విశ్వాసుల పోషకుడని వివరిస్తు, అందుకోసం గురువు సన్యాసిగ, నాయకుడుగ, ప్రవక్తగ మెలగాలని ఆశించాడు.

ఈ విధంగా ఈ సంచిక "ఆధ్యాత్మిక యాత్ర – గురువుల ఆదర్శ జాడ"ను వెలువరించడానికి సహకరించిన రచయిత గురువిద్యార్థులకు వందనాలు. సహకరించిన తోటి సంపాదకులకు నమస్సుమాంజలులు. ప్రతులను పంపిణీ చేయుటలో ఉపయుక్తంగా సాయమందించిన విద్యార్థి బృందానికి మా హృదయపూర్వక సన్నుతులు. హోలిక్రాస్ ప్రింటర్స్‌కు, సహకరించిన వారందరకు, ముఖ్యంగ మా ప్రియ పాఠకులకు ప్రశంసలను అందిస్తున్నాం.

ఇట్లు ప్రభు సేవలో...
**ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్**
సంచిక సంపాదకులు

# 1. శ్రీసభ ఆధ్యాత్మిక అభివృద్ధిలో పునీత అస్సిసీపురి ఫ్రాన్సిస్ వారి పాత్ర

– బ్రదర్ కొండాల కిషోర్



**ఉపోద్ఘాతం**

ప్రస్తుత కాలంలో మానవుడు దేవుడిచ్చిన జ్ఞానముతో సమస్తాన్ని జయించగలుగుతున్నాడు కాని, తన ఆత్మను కోల్పోతున్నాడు. తన భూత భవిష్యత్ కాలాలను ఊహించి చెప్పగలుగు తున్నాడుకానీ, తన చివర గమ్యమేమిటో గ్రహించలేక పోతున్నాడు. ఆకాశంలో ఏముందో భూమిలోపల ఏముందో సోధిస్తున్నాడు, కాని తన మనస్సులోని అశాంతికి, దు:ఖానికి కారణాన్ని కనుగొనలేక సతమతవుతున్నాడు. ఈ ఆధునీకరణ అభివృద్ధితో ఎక్కడోవున్న వారితో సంబంధాన్ని పెంచుకోవడమే గొప్ప తనమని సంబరపడుతున్నాడే కానీ ప్రక్కనున్న తనతోటి వారి గురించి పట్టించుకోలేక పోతున్నాడు. ఇలాంటి తరుణంలో వీటన్నింటిసీ జయించాలంటే ఆధ్మాత్మిక అభివృద్ధి ఉండాలని నా అభిప్రాయం. ఈ ఆధ్మాత్మిక అభివృద్ధికి ఇంత ప్రాముఖ్యత ఉన్నది కాబట్టే ప్రతి మతంలో దీనికి ప్రత్యేకమైన స్థానముంటుంది. దీనిని పొందాలంటే తప్పని సరిగా కొన్ని నియమ నిబంధనలను అలవరుచుకోవాలి.

ఏ మతంలో భక్తజనులు తమ ఆధ్యాత్మిక నియమాలను నిష్ఠ గా పాటిస్తూ ఉంటారో, ఆ మత ప్రభావమే సమజం మీద గాఢంగా ఉంటుంది. మరో మాటలో చెప్పాలంటే బలమైన ఆధ్యాత్మికత గల మతమే ప్రజలను ప్రభావితం చేయగలుగుతుంది, పదికాలాల పాటు వర్ధిల్లగలుగుతుంది. అందుకే ప్రతి మతం వారు తమ భక్త జనులను తమ అనుయాయులను ఆధ్యాత్మికంగ తీర్చిదిద్దడానికి

ప్రత్యేక శ్రద్ధ చూపుతుంటారు, పలు రకాల శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉంటారు. ఇలా నిరంతరమూ కొనసాగే ఆధ్యాత్మిక శిక్షణ వలన ఆయా మతాల ఆధ్యాత్మికత విస్తృతమవుతుంది, వికాసవంతమవుతుంది. అది ఆయా మతాల విశ్వాసులు భక్తి మార్గంలో ముక్తి మార్గంలో ముందంజ వేయడానికి తోడ్పడుతుంది.

అందుకే క్రైస్తవ మతంలో ప్రతి ఒక్కరూ ప్రభు క్రీస్తు చూపిన ఆధ్యాత్మిక మార్గంలో భక్తి మార్గంలో ముక్తి మార్గంలో జీవించడానికి కృషి చేస్తారు. ప్రభువు చిత్తాన్ని నెరవేర్చడానికీ, ఆయన అప్పగించిన జీవిన బాధ్యతలను సమర్ధవంతంగా సంపూర్ణంగా నెరవేర్చడానికి త్రికరణ శుద్ధిగా ప్రయత్నిస్తూంటారు. అంతేకాదు, యేసు ప్రభువు తన పన్నెండు మంది శిష్యులను ఆదేశించినట్లు ప్రతి క్రైస్తవుడు ప్రభువు కోసం ప్రపంచంలోని సమస్తాన్ని త్యజించడానికి సిద్ధంగా ఉండాలి, ప్రభువు కోసమే జీవించాలి, అవసరమైతే ప్రభువు కోసం మరణించడానికి కూడా వెనుకాడకూడదు.

ఆవిధంగా క్రీస్తు ప్రభువును విశ్వసించి, ఆయన అడుగు జాడల్లో నడిచి చిత్తశుద్ధితో సత్య సువార్తను పాటించి బోధించిన పునీతులలో పునీత అస్సీసీ పుర ఫ్రాన్సిస్ వారు ఒకరు. ఈయన 12 వ శతాబ్దంలో సన్నగిల్లుతున్న శ్రీసభ ఆధ్యాత్మిక విలువలను తన జీవితం ద్వారా బలపరిచారు. ఆయన పాటించిన సుగుణాలు, ఆధ్యాత్మిక జీవితము ద్వారా శ్రీసభకు అందించిన సేవలను స్మరించుకుంటూ అవి ఇప్పుడు కూడా క్రీస్తును అనుసరిస్తున్న, అనుసరించాలనుకున్న ప్రతి ఒక్కరికీ, మార్గ దర్శంగా ఉంటాయని భావించి ఈ నా మూడవ సంవత్సర వేదాంత శాస్త్ర పరిపూర్తి చేయడం కోసం ఈ వ్యాసాన్ని ఎన్నుకున్నాను. దీనిని నేను మూడు అధ్యాయులుగా విభజించి, మొదటి అధ్యాయంలో ఫ్రాన్సిస్ వారి కాల పరిస్థితులను, వారి బాల్యము నుండి యుక్త వయస్సులో యుద్ధానికి వెళ్ళడానికి సిద్ధమైన సంధర్బము వరుకు వివరించాను. రెండవ అధ్యాయంలో ఆయన ఏ విధంగా పరివర్తన చెంది తన జీవితములో క్రీస్తును అనుసరించారో వివరించాను. ఇక చివరిగా మూడవ అధ్యాయంలో ఆయన ఆధ్యాత్మిక జీవితం ద్వారా మనము నేర్చుకోవలసిన అంశాలను, క్రీస్తులో మనం ఎదగడానికి కావలసిన సుగుణాలను, మరియు శ్రీసభలో తన జీవితం ద్వారా అందించిన సేవలను పేర్కొన్నాను.

# 1. ఆనాటి ప్రపంచం, ఫ్రాన్సీస్ వారి జీవిత చరిత్ర

## 1.1. ఆనాటి ప్రపంచం

ఆనాడు ప్రపంచమంటే కేవలం ఐరోపా, ఉత్తర ఆఫ్రికా, మరికొన్ని తూర్పు ప్రాంతాలు మాత్రమే. ఆ పరిజ్ఞానమైన మతయుద్ధాలు వల్ల వ్యాపార సంబంధాల వల్లా కలిగినదే. అంతేకాదు భౌగోళికంగా, చారిత్రకంగా, రాజకీయ, సామాజిక రంగాల్లో చూచినా నాటి ప్రపంచానికీ నేటి మానవ సమాజానికీ పోలికలు బహు తక్కువ. ఉదాహరణకు – ఈ నాటి భూభాగంతో పోల్చితే నాటి ఫ్రాన్సుదేశం సగం మాత్రమే వుండేది. స్పెయిన్ దేశంలో కొంత భాగం మూరుల చేతుల్లో వుండేది. నార్మండి, బ్రిటన్, అక్విటైలు ఇంగ్లాండు, ఆధిపత్యంలో వుండేవి. ఇక పోతే జర్మనీ, ఆస్ట్రియా, స్విట్జర్లాండు బొహెమియా రాజ్యాలతోపాటు వలూన్స్ లొరైయిన్, బుర్గుండి ప్రోవెన్సు కూడా రోమాన్ సామ్రాజ్యం భాగాలుగా వుండేవి. జగద్గురువు ఆధిపత్యంలో ఉన్న ప్రాంతాలు మినహా ఇటలీ కూడా రోమనుల పాలనలోనే వుండేది.

## 1.2. రాజకీయ పరిస్థితులు

ఇటలీ భూభాగంలో తరుచూ తిరుగుబాటులు జరిగేవి. వాటిని అణచడానికి చక్రవర్తులు నానా తంటాలు పడవలసివచ్చేది. రోమన్ చక్రవర్తులు తమ అధికారాన్ని కాపాడుకోవడానికి జమిందార్లమీద ఆధారపడేవారు. జమిందార్లకు న్యాయాధికారాన్ని కూడా ఇచ్చి వాళ్లను చెప్పుచేతల్లో ఉంచుకునేవారు. ఈ జమిందారి వర్గంతో పాటు వీరులు, భూస్వాములు, ఆ నాటి సమాజంలో ఉన్నతశ్రేణి పౌరులుగా చలామని అయ్యేవారు. వీళ్ల చేతుల్లోనే, రక్షక దళాలుండేవి. వీళ్లకు, అధికారం వంశపారంపర్యంగా సిద్ధం చేసేది. వీళ్లందరూ చక్రవర్తి ఆదేశాలకు బద్ధులై ఉండేవారు. మిగతా ప్రజలంతా సామాన్యులు. సామాన్యుల్లో రెండు వర్గాల ప్రజలుండేవారు, వ్యవసాయ కూలీలు వృత్తి పనులు చేసేవారు. వ్యాపారులు ఒక వర్గానికి చెందిన వాళ్లయితే, మరో వర్గంవాళ్ళు బానిసలు. బానిసలకు ఏ మాత్రం స్వేచ్ఛ ఉండేదుకాదు. కనుక వీళ్ళు పౌరుల లెక్కల్లోకి రారు. పై వర్గం సామాన్యుల్లోనయినా కొందరికి మాత్రమే పౌరసత్యం ఉండేది. సొంత ఇల్లు కొంత పరిమాణంలో ఆస్తిపాస్తులు ఉన్నవాళ్ళకు మాత్రమే పౌరసత్యం దక్కేది.

ఈ రాజకీయ పరిస్తితులు కేవలం సామాన్య ప్రజలకే కాకుండా చివరకు జగద్గురువు పదవి వరకు ప్రభావితం చేసాయి. 1వ ఒట్టో జర్మనీ రాజైన నాటి నుండి 13వ శాతాబ్దం వరకు ప్రజలలో వారికి ఇష్టమొచ్చిన వారిని తమ నాయకులగా ఏన్నుకోవలని పురికొల్పాయి. వీరు మరి కొంతమంది జగద్గురువును కూడా హెచ్చరించారు. మరి కొంతమందినైతే జైలు పాలు చేశారు. సామాన్య క్రైస్తవలను జగద్గురువుగా ఎన్నుకొన్న పరిస్థితులు కూడా ఉన్నాయి. అవసరమైతే నిర్ణీత కాలంలో గురుత్వం పీఠాధిపతులు అభిషేకము కూడా ఇచ్చేవారు. నాలుగవ హెన్రీ రాజు ఏడవ గ్రేగొరి జగద్గురువు గారికి వ్యతిరేకంగా చేసిన నినాదాలకు జగద్గురువు రోము పట్టణము వదలి పారిపోయారు. ఇదే సమయంలో రాజు పీఠాధిపతి పదవిని వేలం పాటలో పెట్టి అర్హత లేనివారు ఆ పదవిని పొందడంవలన సమాజంలో గురువు, పీఠాధిపతి, విలువ తగ్గిపోయి, గురువు, పీఠాధిపతి ఈ లోక వ్యామోహాలకు, వస్తువులకు, ముగ్దులు అనే భావన ప్రజలలో కలిగింది.

ఇలాంటి దుష్ట పరిస్థితులలో సమాజాన్ని సక్రమమైన మర్గంలో పెట్టడానికి, శ్రీసభ యెక్క విలువలు నిలబెట్టడానికి, ఆ ప్రజలకు బోధించడానికి శీసభ అధికారమునకు చాల కష్టతరమైంది. ఇది ఇలా ఉండగా ఒక వేల ఏ యుద్ధమో లేక ప్రకృతి వైపరీత్యాలో వస్తే గురువుల పరిస్థితి దయానీయంగా ఉండేది. గురువులు మంచి కుటుంబము నుంచి వచ్చి మంచి ఆదర్శ జీవితం జీవిస్తే అదే శ్రీసభకు ఒక గొప్ప ఆస్తిగా భావించే వారు. దేవుడు తన కృపావరాలను దయచేసిన వారి తర్పీదు ఎలా ఉన్నా అతడు గురువుగా ఉన్నప్పుడు ఎలాంటి అభిప్రాయన్ని కనపరిచాడో ఆదే చివరివరకు ఉండిపోయేది. ఇంకొన్ని సమయాలలో సామాన్య ప్రజలు వారు ఏ విధంగా జీవించినా గురువులను మాత్రము చిన్న తప్పులకు సూటిగా వ్యతిరేకించేవారు.

## 1.3. సామాజిక పరిస్థితులు

మత యుద్ధాల ప్రభావం వలన ప్రజల యొక్క సామాజిక పరిస్థితులు తారుమారు అయ్యేవి. కొత్త కొత్త వ్యాపార కేంద్రాలు ఏర్పడి కొత్త కొత్త రవాణా మార్గాలను కనుగొనడంతో దేశ విదేశాలకు వాణిజ్యం విస్తరించి అనతి కాలంలోనే వ్యాపారులు

అధిక ధనార్జన చేయగలిగారు. అలాగే చేతి వృత్తులవారుకు కూడా మంచి రోజులు వచ్చినాయి. వీళ్లు ఎప్పటిలాగే ప్రభుత్వానికి అధిక శాతం పన్నులు చెల్లించగా వచ్చిన ధనబలం వలన వాళ్లు ప్రభుత్వంలోనూ, చట్టసభల్లోనూ, ఉన్నత స్థాయిలను పొందగలిగారు. ఈ విధంగా వృత్తినిపుణులతో కొందరు ఉన్నత శ్రేణి పౌరులుగా మారారు. ఈ తరహా సరిక్రొత్త సామాజిక సంబంధాలతో కమ్యున్లు అనే మండలాలు ఏర్పడినాయి.

అయితే ఈ మార్పుల వలన బానిసలకు మాత్రము ఏలాంటి ప్రయోజనం చేకూరలేదు. వాళ్ళకు స్వంత ఆస్తిపాస్తులు లేవు గనుక వారికి స్వేచ్ఛగాని పౌరసత్వంగాని లభ్యం కాలేదు. వీళ్ళు ఊరికి దూరంగా నివసిస్తూ యజమానుల చెప్పుచేతల్లో నిస్సహాయులుగా బతకవలసి వచ్చేది. ఈ కమ్యున్లు వేటికవి స్వతంత్రంగా వ్యవహరించటం వలన తరుచూ వీటి మధ్య తగువులు చెలరేగి యుద్ధాలకు కూడా దారి తీసేవి. పొరుగు కమ్యూన్లు కు చెందిన వాహనాలను తమ కమ్యూను గుండా వెళ్లేటప్పుడు అధిక పన్నులు వేయడం వంటి చిన్న చిన్న విషయాలే విధ్వంస కాండకు కారణాలయ్యేవి. నగరాలు, గ్రామాలు నాశనమయ్యేవి, పైరుపంటలు బుగ్గిపాలు అయ్యేవి. ప్రజల ప్రాణాలకు భద్రత కరవయ్యేది. బతికి బయట పడ్డవాళ్ళు కారాగారాల పాలై చిత్రహింసలను అనుభవించేవారు. ఈ వివాదాల వల్ల ఏ కమ్యున్లలోనూ ప్రజలకు మనశ్శాంతి ఉండేదికాదు. బాంధవ్యాలు సాంఘిక సంబంధాలు తీవ్రంగా దెబ్బ తిని, జనజీవం అస్తవ్యస్తమయింది. ఈ విషాద ఛాయల్లోనే అస్సిసీపురం కూడా చిక్కుబడి ఉంది. యుద్ధభీభత్సాలు, శ్రమ దోపిడీ, పరపీడన వంటి మాయని మచ్చలు ఎన్నో ఉన్నాయి.

## 1.4. సాంస్కృతిక పరిస్థితులు

ఆ కాలంలో అస్సిసీలోని పరిస్థితులు, ఆచారాలు గమనిస్తే వివిధ రచయితలు వివిధ అభిప్రాయాలు వ్యక్తంచేసారు. చెలానో తోమస్ అనే రచయిత మాటలను బట్టి చూస్తే ఫ్రాన్సిస్ ఉగ్గు పాలతోనే పాపాన్ని సేవించాడా అన్నభయం కలుగుతుంది. ఎందుకంటే నాటి తల్లిదండ్రులు పిల్లలను చేజేతులా పాడు చేసే వారని తోమస్ రాసాడు. మాటలను నేర్చే పిల్లలకు తల్లిదండ్రులు బూతులు

నేర్పేవారట అశ్లీలంగా ప్రవర్తిస్తే ఆనందించేవారట. పిల్లలు ఎంత అపమార్గంలో పడితే తల్లిదండ్రులు అంత సంబరపడేవాళ్ళట. దీనివలన పిల్లలు నైతిక ధౌర్బల్యంలో ఎదిగి నేరస్తులుగా మారేవారిని తోమస్ వివరించాడు. కానీ ఈ అభిప్రాయంతో మనం ఎకీభవించలేము. ఇంకోవిధంగా చూస్తే ఆ కాలంలో అస్సిసీలోని యువకులు ముఠాలు ముఠాలుగా ఏర్పడి వినోధవిహారాల్లో గడిపేవారు. వీళ్లలోని అధికభాగం ధనికుల పిల్లలే ఉండేవారు. వీళ్లలోని కొందరు మధ్య తరగతి కుర్రవాళ్లు కలిసేవారు. వాళ్లు ప్రతిరోజు విందులు చేసుకొనేవాళ్లు. కవిత్వం చదువుతూ ప్రేమ గీతాలు పాడూతూ రాత్రి వేళల్లో వీధుల వెంట తిరిగేవాళ్లు. అల్లరి చేసేవాళ్లు, అదుపు తప్పేవాళ్లు, కొన్నిసార్లు వ్యభిచారానికి సైతం పాల్పడే వాళ్లు. వీళ్లు ఆగడాల్ని అరికట్టడానికి కొన్నిసార్లు రక్షక భటులు కలుగచేసికోవలసి వచ్చేది.

## 1.5. ఆధ్యాత్మిక పరిస్థితులు

అస్సిసీపురాన్ని ఉంబ్రియన్లు నిర్మించారు. అయితే వీళ్ళను ఏట్రుస్కనులు జయించారు. క్రీస్తు పూర్వం మూడవ శాతాబ్దంలో ఏట్రుస్కనులు రోమన్లు ఒడించి అస్సిసీని రోమను మున్సిపాలిటిగా మార్చారు. ఈ విధంగా వీరికి క్రైస్తవత్వం ప్రారంభమై ఉంటుదని ఆలోచన. ఖచ్చితంగా చెప్పాలంటే క్రీ.శ. 50 ప్రాంతంలో క్రిస్పోల్డో ఈ అస్సిసీ పురంలో సువార్త ప్రచారం చేసాడు. ఈయన పునీత పేతురు శిష్యుడు. అయితే పట్టణ ప్రజల్లి క్రైస్తవులుగా మార్చి సుస్థిర క్రైస్తవ సంఘాన్ని స్థాపించింది మాత్రం పునీత రూఫినో గారు. క్రిస్పోల్డో తర్వాత రెండువందల సంవత్సరాలకు వచ్చిన రూఫినో క్రైస్తవ మత ప్రచారం చేసినందుకుగాను మరణ శిక్షకు గురయ్యారు. మొదట ఆయన భౌతిక కాయాన్ని దయానా ఆలయ ప్రాంగణంలో భూస్థాపితం చేసినా, 412 లో తిరిగి నగరానికి తెచ్చి సగౌరవంగా ఖననం చేశారు. దురదృష్టవశాత్తు వీరందరు పేరుకే క్రైస్తవులు కాని క్రైస్తవ సారాంశాన్ని గ్రహించలేదు. వీరి హృదయాలు, కోపము, క్రోధము అసూయ పగవంటి వాటితో రగులుతుండేవి. సహనము క్షమించడం, వినయము. ఉదార స్వభావము అనే సుగుణాలు వీరికి అసలే తెలియదు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తమ శత్రువులను ద్వేషించడం వీలైతే హిసంచడం కూడా నేర్పించేవారు. ఇది ఇలా ఉండగా వారు యవ్వనంలో అడుగు పెట్టగానే ప్రతీ బలహీనతకీ దాసులై,

పాపంలో పడి కొట్టుకుపోతారు. పైగా పాపాలను గర్వకారణాలుగా చెప్పుకుంటూ తిరుగుతారు. మర్యాదగా మెలగడం వీళ్ల దృష్టిలో నేరం. ఇలాంటి విషాద ఛాయలలో అస్సిసీపురం చిక్కుబడి ఉంది.

నాటికీ, నేటికీ అస్సిసీపురంలో మాత్రం పెద్దమార్పులేవీ కనిపించక పోవటం విశేషం. మొత్తం మీద నాటి ప్రపంచంలోని ప్రజాజీవనం దయనీయంగా ఉన్నదనవచ్చు. ప్రజావైద్యశాలలుండ వచ్చును, అనాధాశ్రమాలు నడుస్తూ ఉండవచ్చును, దేవాలయాలల్లో గురువులు భక్తజనులు దిక్కులు పిక్కటిల్లేలా భగవత్ స్తుతి చేస్తుండవచ్చును, వితంతువులు దీనజనుల రక్షణకు యుద్ధవీరులు, దీక్షపూని ఉండవచ్చును. కానీ, ఇవేవీ సమాజంలో పాదుకొనిపోయిన పరపీడనను, నయవంచనను, నైతిక దౌర్భగ్యాన్నీ ఆధ్యాత్మిక అంధకారాన్ని కలిగించలేక పోయాయి.

ఇదిగో– ఈలాంటి సామాజిక నేపథ్యంలోనే పుట్టాడు ఫ్రాన్సిస్. ఆయన పుట్టిన తేది స్పష్టంగా తెలియదు. కానీ 1181 చివరిలోనో 1182 ప్రారంభంలోనో ఆయన అస్సిసీపురంలో జన్మించి ఉండవచ్చునని భావించడానికి ఆధారాలు ఉన్నాయి.

## 2. ఫ్రాన్సిస్ వారి జీవిత చరిత్ర

ఇటలీ దేశములో, అస్సిసీ పట్టణంలో కొన్ని సంవత్సరాల క్రితం మనలాగే పుట్టి పెరిగిన మామూలు మనిషి ఫ్రాన్సిస్. ప్రభుక్రీస్తు పిలుపును అలకించి పిలుపువెనుకగల సవాళ్ళను సంతోషంగా స్వీకరిస్తూ, ప్రభువుకు సంపూర్ణ విధేయులుగా జీవితానికే సరికొత్త నిర్వచనాన్నిచ్చారు. ఇప్పుడు ఆయన జీవితంలోని కొన్ని ముఖ్య ఘట్టాలను చూద్దాం.

### 2.1. ఫ్రాన్సిస్ బాల్యం

ఇది వరకే చూసిన విధంగా అస్సిసీ పట్టణంలో జీవనం సాగిస్తున్న పీటర్ బెర్నార్డిన్ పీక దంపతులకు క్రీ.శ. 1182లో ఫ్రాన్సిస్ జన్మించినాడు. తండ్రి బెర్నార్డిన్ పెద్ద బట్టల వ్యాపారి. వ్యాపారార్థం తరచూ ఫ్రాన్సుదేశానికి వెళ్ళి వస్తూ

ఉండేవాడు. అలా ఆయన విదేశీపర్యటనలో ఉన్న సమయంలోనే అస్సిసీలో ఫ్రాన్సిస్ పుట్టాడు. సాన్ రూఫినో దేవాలయంలో కొడుకుకు పీక బాప్తిస్మం ఇప్పించి “జాన్” అని పేరు పెట్టించేవరకు తండ్రి తిరిగి రాలేదు. మరి ఈ జాన్, ఫ్రాన్సిస్ ఎలా అయ్యాడో స్పష్టంగా తెలియదు. తరువాత పేరు మారి ఉండవచ్చునని కొందరు అంటారు. కానీ “ముగ్గురు సహచరులు” అనే గ్రంథంలో మాత్రం ఫ్రాన్సు నుంచి తిరిగివచ్చాక తండ్రే కొడుకు పేరు మార్చాడని ఉంది. ఒక వేళ అలాగే చేసి ఉంటే అందుకు కారణం తనకు వ్యాపారంలో లాభాలు ఆర్జించి పెడుతోన్న ఫ్రాన్సు మీద గల అభిమానమే అందుకు కారణమా, లేక మరేదైన కారణం ఉందా? తెలియదు. ఈ “ముగ్గురు సహచరులు” గ్రంథాన్ని ప్రమాణంగా భావించని వాళ్ళు మాత్రం ఫ్రెంచి ధారాళంగా మాట్లాడుతూ, ఎప్పుడూ ఫ్రెంచి గీతాలు పాడుతూ తిరిగే జానుకు ప్రజలే “ఫ్రాన్సెస్కో” అనే మారు పేరు పెట్టి ఉండ వచ్చునన్నారు. ఇదీ సమంజసంగానే తోస్తుంది. ఎందుకంటే ఫ్రాన్సిస్కు ఫ్రెంచి భాష కొట్టిన పిండి అనడం నిజం. నాడు వ్యాపార రంగంలో అందరూ మాట్లాడే ఫ్రెంచి భాషను స్వయంగా తండ్రే ఫ్రాన్సిసుకు నేర్పించి ఉండవచ్చును. ఫ్రాన్సిస్ గారు తమ చిన్నతనంలో తండ్రి చేతిక్రింద పనిచేసేవారు. మంచి తెలివిగలవాడు. జ్ఞాపక శక్తి మెండు. చలాకీగా కలుపుగోలుతనంగా వ్యాపారంలో తోడ్పడేవారు. కాని ఫ్రాన్సిస్ గారు విందులకు వినోదాలకు అధికంగా ఖర్చు చేసేవారు. అందువలన తల్లిదండ్రులు తరచూ ఫ్రాన్సిస్ను మందలించేవారు ‘‘నువ్వేమైన రాజుకుమారిడివా, డబ్బును మంచినీళ్లలా ధారపోయడానికి, పరాన్నభుక్కుల్ని మేపుతూ జులాయిలా తిరగడానికి? కానీ అమిత ప్రేమ వలన అతని తప్పుల్ని చూసి చూడనట్లు ఊరకుండేవారు. తెలివితేటలు అందచందాలు వున్న కొడుకుని చూసి తల్లిదండ్రులు గర్వపడుతూ ఉండేవారు. తన కొడుకు గొప్పవాళ్ళ పిల్లలతో స్నేహం చేయడం పీటర్ బెర్నార్డోనుకు ఆనందం కలిగించేది.

## 2.2. విధ్యాభ్యాసం

ఫ్రాన్సిస్ అంతగా చదువుకున్నవాడు కాదు అని అతని జీవిత చరిత్ర రాసిన పలువురు పేర్కొన్నారు. ఫ్రాన్సిస్‌కు నిజంగానే ఏ శాస్త్రములోను పాండిత్యం లేదు. అవును ఇటు మతవిద్య లోను, అటు లౌకిక విద్యలోనూ ఫ్రాన్సిస్కు ప్రావీణ్యం

లేదు. అతని మతపరమైన జ్ఞానం సత్యోపదేశానికి, ఇతర విషయ పరిజ్ఞానం ప్రాథమిక స్థాయికి పరిమితమవుతుంది. అయితే ఫ్రాన్సిస్కు గల దివ్య జ్ఞానం దైవదత్తమని, ప్రాపంచిక జ్ఞానం సంస్కృతి ద్వారా సిద్ధించినదని భావించారు.

ఫ్రాన్సిస్ వాళ్ళ ఇంటికి దగ్గరలోనే సాన్ జార్జియా దేవాలయం వుంది. దానికి అనుబంధంగా నడిచే పాఠశాలలోనే ఫ్రాన్సిస్ ప్రాథమిక విద్యాభ్యాసం సాగింది. సాధారణంగా ఆ రోజుల్లో ప్రాథమిక స్థాయి నుంచే లాటిను భాష నేర్పించేవారు. కానీ ఫ్రాన్సిస్ కు ఆ భాష అంతగా పట్టుబడినట్లు లేదు. అరుదుగా కనిపించే ఫ్రాన్సిస్ సంతకాలను లాటిను రాత ప్రతుల్ని చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. సాధారణంగా ఫ్రాన్సిస్ చెబుతుంటే బ్రదర్ లియో రాసేవారు. ఫ్రాన్సిస్ సంతకం ఇంగ్లీష్‌లో అక్షరం 'T' ఆకారంలో సిలువ గుర్తు మాదిరిగా ఉండేది.

పాఠశాల విద్య అంతంత మాత్రమే ఐన, నాటి జన సామాన్యంలో బహుళ ప్రాచుర్యం పొందిన వీరగాధల్ని ఫ్రాన్సిస్ అపారమైన జ్ఞానాన్ని ఆర్జించాడనడం సమంజసమే ననిపిస్తుంది. ఆయన జీవితాన్ని నిశితంగా పరిశీలించి చూస్తే ఈ జానపద సాహిత్య ఛాయలు స్పష్టంగా కనిపిస్తాయి. ఆయనే కవిత్వం రాసి, గానం చేసేవారు. వయోల్ వాయిద్యం మీద దైవస్తుతి గీతాలు ఆలపించేవారు. వీరగాధల్లోని వివిధ ఘట్టాలు ఫ్రాన్సిస్ నాలుక మీద నడయాడుతుండేవి. తన భావాల వ్యక్తీకరణ తరచూ ఆ గీత పాదాలనే వాహికలుగా ఉపయోగించేవారు.

## 2.3. ఫ్రాన్సిస్ వ్యక్తిత్వం

ప్రాన్సిస్ వారి వ్యక్తిత్వమును తెలుసుకొనుటకు ముందు ఆయన కుటుంబములోని వ్యక్తుల స్నేహితుల వ్యక్తిత్వాన్ని తెలుసుకుందాం. అప్పుడే ఫ్రాన్సిస్ యొక్క వ్యక్తిత్వాన్ని పూర్తిగా అర్థం చేసుకోగలము. ముందుగా ఆయన తల్లి యొక్క స్వభావమును పరిశీలించుదాం.

### 2.3.1. తల్లి వ్యక్తిత్వం

ఫ్రాన్సిస్ తల్లి పీక ఇటలీ వనిత అయినా ఫ్రాన్సు దేశపు ఉన్నత వంశీయురాలై సాదు-శీల అని మాత్రం ఖచ్చితంగా చెప్పుకోవచ్చును. ఆమె అన్ని

వేళలా భర్తకు అనుకూలవతిగా ఉన్నప్పటికీ కీలకమైన విషయాల్లో భర్తను ప్రశ్నించేది, ఎదిరించి నిలిచేది. ఫ్రాన్సిస్ తల్లి గురించి వివిధ రచయితలు రాస్తూ ఆమె నిరంతరం మంచితోనే సహవాసం చేసేదని తన కొడుకును సమర్థిస్తూ ఏదో ఒక రోజు వాడు దైవ పుత్రుడుగా మారతాడు, చూస్తూండండి. అనే వారని వివరించారు.

### 2.3.2. తండ్రి వ్యక్తిత్వం

ఫ్రాన్సిస్ వారి జీవిత చరిత్రలో అందరూ ఆయన తండ్రి వ్యక్తిత్వాన్ని వ్యతిరేకంగా వర్ణిస్తారు. కాని నిజానికి చేతికందివచ్చిన తనయుడు తన ఆశయాలను అడియాశలు చేస్తూ వెళ్తుంటే ఎవరు మాత్రం భరించగలరు. అందుకే పునీత బొనవెంతూరుగారు ఈవిధంగా అంటారు. “ఫ్రాన్సిస్ తండ్రి ధనాశాపరుడైనా దుష్టుడు కాడని భావింపవచ్చును. వ్యాపారం ద్వారా తాను సిరిసంపదలన్నీ కీర్తి ప్రతిష్ఠల్ని ఆర్జించాలని సంఘంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకొని ఉండవచ్చును. అలాగే ఆయన భక్తిపరుడైన క్రైస్తవుడు కాకపోవచ్చును. అంతమాత్రం చేత కొడుకును చేజేతులా చెడుమార్గానికి నెడతాడా. లేదు లేదు. తనలాగె తన కుమారుడు కుడా వ్యాపారంలో రాణించాలని తనకంటే ఉన్నతంగా బతకాలనీ కోరుకొని ఉంటాడు. అంతే కాని కొడుకు పతనాన్ని కోరుకోడు కదా”.

### 2.3.3. ఫ్రాన్సిస్ సహోదరుడు

ఫ్రాన్సిస్ కు ఒక సోదరుడు ఉన్నాడని చాలమంది రచయితలు అంటారు. ఆయన పేరు ఆంజెలో. ఆంజెలోకు ఇద్దరు కుమారులు-పిక్కార్డో, జియావాన్ని. ఒకానొక సమయంలో ఫ్రాన్సిస్ సోదరుడు ఆంజెలో తన స్నేహితునితో ఫ్రాన్సిస్‌ను సందర్శించాడు. అప్పుడు చలికాలం కావడం చేత చిరిగిన అంగీలో ఉన్న ఫ్రాన్సిస్‌ను చూసి వ్యంగ్యంగా ఫ్రాన్సిస్ అంగీ చాలా బాగుంది. దానిని ఎంతకు అమ్ముతాడో అడుగు అని తన స్నేహితునితో అన్నప్పుడు ఫ్రాన్సిస్ నవ్వుతూ దీనికి నీకంటే ఎక్కవ వెల ఇచ్చేవాడు ఉన్నాడు ఆయన కోసమే ఉంచానని అనడంతో తన సోదరుడు ఎంతో సిగ్గుపడ్డాడు అని ఒక రచయిత వ్రాసాడు. ఈ సందర్భానికి మించి ఆధారాలు ప్రస్తావించలేదు. దీని ద్వారా ఫ్రాన్సిస్ సోదరుడు తన కంటే

తక్కువ వారిని చులకనగా చూసే వాడని మరియు తన సోదరుడు చేసే సేవ తనకు  ఇష్టం లేదని భావించవచ్చును.

## 2.3.4. ఫ్రాన్సిస్ స్నేహితుల వ్యక్తిత్వం

ఫ్రాన్సిస్ చిన్నతనము నుండి చురుకుగా, చలాకీగా, కలుపుగోలు తనంగా ఉండేవాడు కావున ఆయనకు ఎక్కువ మంది స్నేహితులుండేవారు. వీళ్ళందరూ ఉన్నత వర్గానికి చెందిన వారిగా పరగణించవచ్చు. ఎందుకంటే అస్సీసీలోని యువకులు ముఠాలుగా ఏర్పడి వినోద విహారాల్లో గడిపేది ధనికుల పిల్లలే, ఎందుకంటే ఫ్రాన్సిస్ తల్లిదండ్రులు ఆయనను మందలించేటప్పుడు నువ్వేమైన రాజకుమారుడివా, డబ్బును మంచినీళ్ళలా దారపోయడానికి, మరో సందర్భంలో తన కొడుకు గొప్పవాళ్ల పిల్లలతో స్నేహం చేయటం పీటర్ బెర్నార్డోనెకు ఆనందం కలిగించేది. దీనిని బట్టి మనకు రూఢిగా వీరందరూ ధనికుల పిల్లలని తెలుస్తుంది. ఫ్రాన్సిస్ మధ్యతరగతి కుంటుంబమునకు చెందిన వాడైనప్పటికీ ఆయనతో స్నేహం చేయటం వలన ఫ్రాన్సిస్ అంటే వారికి ఎంతో ఇష్టమని తెలుస్తుంది. కాని విందులు వినోదాల వల్ల వారందరూ చెడ్డవారిని పరగణించడం సమంజసంకాదు. ఎందుకంటే ఆనాటి సంస్కృతి అలా ఉండేది. అయినా ఒక వేళ వారు చెడు పనులకు పాల్పడినా ఎన్నడూ ఫ్రాన్సిసును మాత్రము చెడు పనులకు ప్రోత్సహించినట్లు ఆధారాలు లేవు. వారు ఎన్నడూ ఫ్రాన్సిస్ నిర్ణయాలను ప్రోత్సహించారే కానీ అడ్డు పడేవారు కాదు. ఇంకా చెప్పాలంటే కొంతమంది ఫ్రాన్సిస్ అనుచరులుగా కూడా మారారు.

## 2.3.5. ఫ్రాన్సిస్ వ్యక్తిత్వం

ఫ్రాన్సిస్ స్వాభావికంగా సున్నిత మనస్కుడు "మొదటి నుంచీ పేదల పట్ల ఆయనకు సానుభూతి మెండు" అని రాశారు పునీత బొనవెంతూరు. అంతేకాదు దేవుని పట్ల భయభక్తులు కూడా ఫ్రాన్సిసుకు చిన్ననాడే అలవడినాయని అనుకోడానికి కూడా ఆధారాలున్నాయి. దైవభక్తి దివ్య సత్ప్రసాదం పట్ల ఆరాధనా భావం గల ఫ్రెంచి ప్రజలంటే తనకెంతో ఇష్టమని స్వయంగా ఫ్రాన్సిసే చెప్పేవారట. ఊళ్ళో ఉండగా ఫ్రాన్సిస్ బట్టల దుకాణంలో కూర్చునేవాడు. అవసరమైనపుడు

తండ్రితో పాటు సరుకును తీసుకుని చాంపేనుకో, ప్రోవెన్స్ కో వెళ్ళివస్తూ ఉండేవాడు. వ్యాపార రంగంలో కూడా అందరి మెప్పుపొందే విధంగా వ్యవహరించే వాడు. అయితే ధనం మీద విపరీతమైన వ్యామోహం ఏదీ ఉండేదికాదు మరియు అడిగిన వాళ్ళకు లేదనకుండా ఇచ్చేవాడు, పేదలెవరు అర్థించినా దానం చేసేవాడు. ఒక సారి బట్టలు అమ్ముతూవుండగా ఒక బిక్షగాడు వచ్చి ధర్మం చేయమన్నాడు. పనివత్తిడిలో ఉండి "లేదు పోమ్మన్నాడు. కాని తర్వాత అతణ్ణి నా మిత్రుడెవరైనా పంపినట్లయితే లేదనే వాణ్ణేనా? లేదు గదామరి. రాజాధిరాజు ఆ దేవుడే పంపిన ఆదీనుణ్ణి తిరస్కరించానే" అని ఎంతో బాధపడ్డారట. వెంటనే లేచి అతణ్ణి స్వయంగా పిలిచి మరీ సహాయం చేసి పంపించారట. కాని ఫ్రాన్సిస్ గారు విందులు వినోదాలకు అధికంగా ఖర్చుచేసేవారు. ఈ విధంగా యువజనంలో నాయకుడుగా చలామణి అయ్యేవారు. ఎంత తిరుగుబోతు అయినా చెడ్డమాటలు మాట్లాడదు, స్త్రీ లంటే ఎనలేని గౌరవం. ధాన ధర్మాలకు వెనుదీసే వారుకాదు. తల్లి ప్రభావం వారిపై బాగా ఉండేది.

## 2.4. ఫ్రాన్సిస్ వారి ఆశలు ఆశయాలు

ఫ్రాన్సిస్ 20 సం. ల ప్రాయం వరకు జీవించిన జీవితాన్ని బట్టి చాలా మంది ఆయనను ఒక విటుడిగానే చిత్రిస్తారు. "ఆయనతో సాన్నిహిత్యం ఉన్న తొమ్మిదవ గ్రెగోరి జగద్గురువు కూడా 1238 లో రాసిన ఒక లేఖలో "లౌకిక వ్యామోహాల్లో కొట్టుకొని పోయిన ఫ్రాన్సిస్ తిరిగి ప్రభువు సన్నిధికి చేరి పవిత్రుడు కావడం విశేషం" అని అభినందించారు. "ఇంకో సందర్భములో షటోరా పీఠానికి చెందిన కార్డినల్ యూడ్సు "మొదట్లో ఫ్రాన్సిస్ ఘోరపాపి. కాని లౌకిక సుఖాలతో మొఖం మొత్తి పవిత్రతా మార్గం పట్టాడు" అని బహిరంగంగా ఒక ప్రకటనే చేశాడు. ఇలాంటి వదంతులు ఎన్నో ఉన్నాయి కాని వీటినన్నింటినీ తుడిచి వేస్తూ పునీత బొనవెంతూరు, ఒక ఖచ్చితమైన అభిప్రాయాన్ని ప్రకటించారు. "ఆయనలో కొన్ని బలహీనతలు ఉన్నప్పటికీ వాటిని స్పష్టంగా చెప్పటం సాధ్యం కాదు. ఇంకా ఫ్రాన్సిస్ ఒక యువతిని ప్రేమించాడన్న వదంతి కూడా ఒకటి ఉంది. ఆవిడ ఎవరో, పేరేమిటో కూడా తెలియదు. అందులో నిజానిజాలు ఖచ్చితంగా తెలియవు. ఒక వేళ ఫ్రాన్సిసు ఎవరినైనా ప్రేమించినా ఒక యోధునిలా ప్రేమించి ఉంటాడు తప్ప శరీర వ్యామోహానికి లొంగి కాదు."

ఈ బలహీనతల్ని ప్రక్కన పెడితే ఫ్రాన్సిసు ఒక కరుణా మూర్తిగా అసామాన్యుడుగా, ఉదాత్తమైన ఆశాయాలు గల ఉత్తముడుగా కనిపిస్తారు. ఎవరినీ నొప్పించకుండా మాట్లాడేవారు. ఎవరైనా పరుషంగా మాట్లాడితే వాళ్లకు జవాబివ్వకుండా మౌనంవహించేవారు. "ఈ సుగుణాలే" ఆయన్ని అందరికీ ప్రియమైన వాణ్ణి చేశాయి. ఆయన గంభీర ప్రవర్తనని చూచి అందరూ ఆయన ఉన్నత కుటుంబానికి చెందినవాడని భావించేవారు. "ఈయన ఏదో ఉన్నత లక్ష్యాన్ని సాధించి గొప్పవాడవుతాడని" చాలా మంది జోస్యం చేప్పేవారు. "ఒకాయనయితే ఫ్రాన్సిసు కనబడగానే టోపి తీసి వేసి, పై వస్త్రాన్ని విప్పి ఆయన పాదాల ముందు పరచి నేను ఈ బెర్నర్దోనో పుత్రుణ్ణి గౌరవించడం ద్వారా భవిష్యత్తులో ఈయన పొందబోవు అపార గౌరవ మర్యాదల్ని సూచిస్తున్నాను అని ప్రకటించేవాడు. ఫ్రాన్సిస్ గురించి పునీత బొనావెంతురు గారు వివరించిన సంగటన ఇది. ఫ్రాన్సిస్ ఆశలు ఆశయాలు బట్టలు వ్యాపారానికి, విందులు వినోదాలకు పరిమితం కాలేదు తాను ఖచ్చితంగా గొప్పవాడవుతాడనే నమ్మకం ఫ్రాన్సిస్ కు ఉండేది. ఆయన ఆశయాలు ఎంత గొప్పవంటే ఆయన ఒక ఖైధిగా ఉన్న కూడా ఆయన ఆశయాల్లో మార్పు రాకుండా ధైర్యసాహాసాలు పెంచి ఆయన ఆశయాలను ఇంకా బలపరిచాయి. అసలు నిజానికి ఫ్రాన్సిస్ యుద్ధవతావరణంలో పెరిగాడు కాబట్టి యోధుడై యుద్ధాల్లో విజయుడై కీర్తిప్రతిష్టలార్జించాలని ఫ్రాన్సిస్ ఆశయం.

## 2.5. సమరయోధుడుగ

ఆనాడు ఎవరైన గొప్పవాళ్ళు కావాలనుకొంటే యుద్ధాల్లో పాల్గోనాలి. వీరులుగా ఖ్యాతి గడించాలి. అందులో ఫ్రాన్సిస్ యుద్దవతావరణంలో పెరిగారు. స్వాతంత్రము కొరకు అస్సిసీ ప్రజలు ముప్పయి ఏళ్ళు పాటు పోరడవలసి వచ్చింది. 1174 లో అస్సిస్సీలోని వ్యాపరులంతా కలసి సామ్రాజ్యాధికారాన్ని ధిక్కరించారు. కాని శత్రువు బలమైన వాడు కావడంలో ఓడిపోయారు. నాటి నుండి అస్సిసీ లోను చుట్టుప్రక్కల ప్రాంతాల్లోను, ఫ్యూడల్ ప్రభువులు తిరిగి పెత్తనం చెలాయించడం మొదలు పెట్టారు. మధ్య తరగతి ప్రజలకు వ్యాపరులకు గల హక్కులను పదవీ హెూదాలను రద్దు చేసి వారి నుంచి అధిక శాతం పన్నులు వసూలు చేసేవారు. వీటినన్నిటిని గమనించిన ఫ్రాన్సిస్ ఎప్పటికైన సరైన యోధుడై

కీర్తి గడించాలని, మరీ ముఖ్యముగా తమ ప్రజలకు స్వతంత్ర్యం సంపాదించాలని తనకు ఊహ తెలిసినప్పటినుండీ అనుకుండేవారు. అనుకున్నదే తడువుగా 1202 లో పెరుజియాలకు అస్సిసియాలకు జరిగిన పొంత్ సాన్ జియోవాని యుద్ధంలో ఫ్రాన్సిస్ కూడా పాల్గున్నారు. కానీ దురదుష్టవశాతూ అస్సిస్సీ యోధులు ఒడిపొయి శత్రువుల చేతికి చిక్కారు. యుద్ధఖైదీగా ఫ్రాన్సిస్ 1202 నవంబరు వరకు సంవత్సరం పాటు  పెరుజియాలో వుండవలసి వచ్చింది. ఖైదీగా వున్న ఫ్రాన్సిస్ ఆలోచనలలో, ఆశయాలలో మార్పు రాలేదు. ఆయన ధైర్య సాహసాలు చెక్కు చెదరలేదు.  ఆయనలో సహజంగా ఉట్టిపడే అనందం ఆదరభావం ఆలాగే వున్నాయి. పెరుజియాలో జైలు నుండి బయటపడగానే మల్లి యధావిధిగా వ్యాపరంలో ప్రవేశించారు. తన అశ ఇంకా నెరవేరలేదు. కనుక ఆయన ఇంకా దండయాత్ర గురించి  విజయ పరంపరం గురించి  మల్లీ కలలు కనడం ప్రారంబించారు. ఆకాలంలో రాజు వంశాలకు చెందిన వాళ్ళే కాదు, మధ్య తరగతి ప్రజలు కూడా యోధులు కావచ్చు.అయితే తమయుద్ధ దుస్తుల్ని, ఆభరణాల్లి, ఆయుధాల్ని వాళ్ళే సమకూర్చుకోవాలి.ఆలాంటి వాళ్ళకు యోధుడనే బిరుదు నామంతో పాటు సమాజంలో సముచితమైన గౌరవం దక్కుతుంది.

యోధుడు కాదలచిన వ్యక్తి తన అయుధాలను ధరించి దేవాలయంలో బలిపీఠం ముందు ఒకరాత్రంతా జాగరణ చేయాలి. ఉదయాన్నే దివ్యబలి పూజలో పాల్గొని తన ఖడ్గాన్ని దైవ సేవకోసం పీడితుల రక్షణ కోసం మాత్రమే ఉ పయోగిస్తానని, ప్రమాణం చేయాలి. తరువాత ఆ యోధుడు పోసించే వ్యాక్తి. అతను మెడను సంప్రదాయకంగా సామాజిక గౌరవాన్ని ఆపాదిస్తాడు. తరువాత యోధున్ని కౌగలించుకొని దేవుని నామమున పునీతులు జార్జి మిఖాయేలు పేరున నిన్ను యోధున్ని చేస్తూన్నాను. ధైర్య సాహసాలతో వర్ధిల్లు అని దీవిస్తాడు. ఈవిధంగా అపూలియ యుద్ధంలో జగద్గురువుకి సహాయం చేయడానికి అస్సిస్సీ సైన్యం వెడుతుందని గ్రహించి అస్సిసీ సైన్యంతో పాటూ తాను కూడా వెళ్ళాలని  ఫ్రాన్సిస్ నిశ్చయించుకున్నారు.

## ఫ్రాన్సిస్ వారి పరివర్తనకు – క్రీస్తు నందు జీవితమునకు తోడ్పడిన అంశాలు

### 3.1. ఫ్రాన్సిస్ వారి పరివర్తన

ఇప్పటి వరకు ఫ్రాన్సిస్ వారు చెడు మార్గాలలో అల్లరి చిల్లరిగా తిరగడానికి ఆయన నివసించిన పరిస్థితులు, ఆయనతో సహవాసం చేసే వారే అన్న సత్యం ఎంత నిజమో ఆయన పరివర్తనకు కూడా అవే ప్రధాన కారణాలనడం ఎంతైనా సమంజసమే. 'ఆయన చుట్టూ ఉన్నవారు యుద్ధాల వలన పడే ఇబ్బందులను చూసి, ఆయన హృదయం ద్రవించేది. ఇలాంటి పరిస్థితుల నుండి వారందరకీ స్వతంత్రయమును తేవాలని ఎటువంటి చీకుచింత లేకుండా అందరూ ప్రశాంతముగా వారి జీవితములను గడపాలని ఆయన ఆశించేవారు. ఇలాంటి భావాలతోనే యుద్ధానికి బయలు దేరారు.'

### 3.2. జర్మను యుద్ధము

"జర్మను రాజైన ఆరవ హెన్రీ మరణించాక ఆయన భార్య తన కొడుకు సంరక్షణ భారాన్ని వహించ వలసిందిగా మూడవ ఇన్నోసెంట్ జగద్గురువును కోరింది. అయితే రాజకుమారుడు జగద్గురువు అధీనంలో ఉంటే తన దేశ సంపదకే ముప్పు వాటిల్లుతుందన్నభయంతో జర్మను రాజవంశీయులు మార్క్ వాల్డ్ నాయకత్వంలో ఎదురు తిరిగారు. ఈ మార్క్ వాల్డ్ ఆరవ హెన్రీ వద్ద సైన్యాధికారిగా ఉండేవాడు. చక్రవర్తి రాకుమారుణ్ణి తన సంరక్షణలో దాచమన్నాడని వాదిస్తూ మార్క్ వాల్డ్ ఒక నకిలీ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించి చూపించాడు. ఈ వివాదమే చిలికి చిలికి గాలి వానగా మారి యుద్ధానికి దారి తీసింది." 'ఈ యుద్ధానికి వివిధ ప్రాంతాల నుండి సైనికులు, యోధులు జగద్గురువుగారి సహాయార్థం యుద్ధ రంగానికి వెళ్తున్నారు. అస్సిసీ పాలకుల కంటే ఉన్నతుడు సంపన్నుడు కాక పోయినప్పటికీ ఉన్నత లక్ష్యంతో యుద్ధ రంగానికి వెళ్లాలనుకున్నారు ఫ్రాన్సిస్. మిగతా సైనికులు తాము యుద్ధంలో దోచుకోబోయే సొమ్ము గురించి ఆలోచిస్తూ పోతుంటే తాను మాత్రం సాధించబోయే ఘన విజయం గురించి కలలు కంటూ యుద్ధానికి సన్నద్ధుడు అవుతున్నారు.'

### 3.3. ఉదార స్వభావము

'ఈ విధంగా అస్సిసీ నుండి బయలు దేరిన యోధులు రాత్రి కావడం వలన స్పోలేతో వద్ద వారి మొదట బస చేసినారు. ఈ సమయంలోనే రోగపీడితుడై దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న పేరూజియాకు సంబంధించిన ఒక మాజీ వీరుడు తారసపడ్డాడు. అతడు చాలా తెలివైన, ప్రఖ్యాతిగాంచిన వీరుడు తనకున్న ఆస్తులను, భూమిని కోల్పోయినప్పటికీ రక్షణదాయకమైన పాత డాలును ధరించి జగద్గురువుగారి తరుపున యుద్ధము చేయాడానికి వస్తున్నాడు. ఆయన అంకిత భావమును చూసి క్రొత్త డాలుతో ఉన్న ఫ్రాన్సిస్ కి  సిగ్గుగా అనిపించి, అతను అర్థించాడో, లేక తానే జాలి పడ్డాడో గాని ఫ్రాన్సిస్ తాను వేసుకున్న ఖరీదైన డాలును, బట్టల్నిఇచ్చివేసాడు. అతని పాత డాలును తీసుకున్నాడు. ఈ సందర్భము గురించే చెలానో తామస్ అనే రచియిత ఫ్రాన్సిస్ పునీత మార్టిన్ ఆఫ్ టూర్సులా ప్రవర్తించాడంటారు. మార్టిన్ లాగే కలలో ఒక అద్భుత ద ృశ్యాన్ని చూసాడు, అంటే ఆయన చేసిన ఈ సహాయానికి ప్రతి ఫలంగా ఆ దేవాది దేవుడే ఆ కలను ప్రసాదించాడంటారు. ఈ సన్నివేశాన్ని ఫ్రాన్సిస్ ఎప్పటికీ మరచిపోలేదంటారు.

### 3.4. దివ్య స్వరమును ఆలకించుట

దేవుడు తన అనుచరులుగా ఏన్నుకున్నవారిని ఏప్పుడు ఏవిధంగా పిలుస్తారో ఏవరూ ఊహించలేరు. కొంతమందిని  తన స్వరము ద్వారా, ఇంకొంతమందిని తన దర్శనం ద్వారా పిలుస్తారు. కాని ఫ్రాన్సిసుకు మాత్రము ఈ రెండింటినీ ఒకేసారి పొందే భాగ్యం దయచేసాడు.

#### 3.4.1. మొదట సారి ఆలకించుట

ఈ సంఘటన తరువాత ఏదో తెలియని, ఆనందము అంతలోనే బాధ కలిగింది, అయినా ఎప్పటిలాగే ఫ్రాన్సిస్ నిద్రలోకి జారుకున్నారు. ఆ రాత్రి ఫ్రాన్సిస్ ఒక కల గన్నాడు. 'ఆ కలలో తన ఇల్లు ఒక రాజభవనమైపోయింది. దాని నిండా ఆయుధాలు ఉన్నాయి. బట్టల బేళ్ళ స్థానంలో గుర్రపు జీనులు,  యుద్ధ సామాగ్రి కుప్పలు పోసి ఉన్నాయి. ఒక  గదిలో ఒక అందమైన పెళ్ళికూతురు అలంకరించుకుని పెళ్ళి కొడుకు కోసం ఎదురుచూస్తోంది. ఇంతలో ఒక స్వరం

" ఆ ఆయుధాలు, ఆ నవ వధువు నీ కోసమే" అని చెప్పింది. ఫ్రాన్సిస్ ఆనందానికి అవధుల్లేవు. యుద్ధంలో తను పొందబోయే విజయానికి ఇది శుభ సూచక మనుకున్నాడు. కాని ఆ కలకు నిజమైన అర్థం అది కాదని, మరేదో ఉందని తరువాత గాని తెలియలేదు.' ఆ కల వల్ల కలిగిన ఆనందం అట్టే సేపు నిలువలేదు. మళ్ళీ ఏదో నిస్సత్తువ, నిర్వేదం ఫ్రాన్సిస్ ను ఆవరించాయి. కారణం స్పష్టంగా తెలియడంలేదు. కాని ఏదో కలత కమ్మేస్తూన్నా అనేక ప్రశ్నలతో యుద్ధానికి బయులుదేరాడు.

### 3.4.2. రెండవ సారి ఆలకించుట

అస్సిసీ నుండి స్పోలేతో చేరుకొనే సరికి చీకటి పడింది. ఆ రాత్రికి అక్కడే ఉండాల్సి వచ్చింది. ఆ రాత్రి ఫ్రాన్సిస్ జీవితంలో మరుపురాని రాత్రి ఆయన జీవితమును మలుపు తిప్పిన రాత్రి. ఆ రాత్రి కలలో మళ్ళీ అదే స్వరం విన్పించింది. "ఫ్రాన్సిస్ ఎక్కడికి వెళ్తున్నావు?" అని ప్రశ్నించిందాస్వరం. " అపూలియా యుద్ధానికి అని జవాబిచ్చాడు ఫ్రాన్సిస్. నీకు ఎవరు ఉత్తమ బహుమానం ఇవ్వగలరు యాజమానుడా? సేవకుడా? ''తప్పకుండా యాజమానుడే! మరి యజమానుణ్ణి అనుసరించకుండా సేవకుణ్ణి అనుసరిస్తావేం? "ప్రభూ! నన్నేంచేయమంటారు? "తిరిగి నీ దేశానికి వెళ్ళు. నువ్వు ఏం చేయాలో తెలుస్తుంది. ఈ దర్శనానికి నిజమైన అర్థమేమిటో కూడా స్పష్టమవుతుంది." అని వివరించింది. ఆ రాత్రాంతా ఆ దర్శనం గూరించి ఆలోచిస్తూ ఉండిపోయాడు ఫ్రాన్సిస్. ఉదయమే లేచి అస్సిసీకి తిరుగు ప్రయాణమయ్యాడు.

### 3.5. స్నేహితుల ప్రభావము

యుద్ధం నుండి తిరిగి వస్తున్న ఫ్రాన్సిస్ ను చూచి బంధుమిత్రులు ఆశ్చర్యపోయారు. కాని తాను తిరిగి వస్తున్నందుకు ఫ్రాన్సిస్ ముఖంలో ఏ మాత్రం విచారంలేదు. "నేను యుద్ధం చేయక పోయినా గొప్పవాణ్ణివుతాను, మీరే చూస్తారుగా" అని నవ్వుతూ జవాబిచ్చాడు. కాని ఫ్రాన్సిసులో వచ్చిన మార్పును స్నేహితులు పసిగట్టారు. నువ్వు యుద్ధం చేయక పోయినా మాకు నువ్వు రాజువే, యువరాజువే అంటూ ఒక రాజదండం వంటి దానిని ఫ్రాన్సిస్ కిచ్చారు. మిత్రుల

మనస్సు పసిగట్టిన ఫ్రాన్సిస్ వాళ్ళకోసం ఒకవిందు ఏర్పాటు చేశాడు. అందరూ తినీ త్రాగీ పాటలు పాడుకుంటూ వీధుల్లో తిరగడం మొదలుపెట్టారు. ఫ్రాన్సిస్ మాత్రం వాళ్ల దుచ్చేష్టలకి దూరంగా ఉన్నాడు. వాళ్లు చిందులు వేస్తూ ముందు పోతుంటే తను ఒక్కడే మౌనంగా ప్రార్థంచుకుంటూ వెనుక వస్తున్నాడు. అప్పుడే ఫ్రాన్సిస్ కు దివ్యానుభూతి కలిగింది. ఆయన హ ృదయం ప్రేమతోనూ, అనిర్వచనీయమైన ఆనందంతోనూ నిండిపోయింది. ఫ్రాన్సిస్ ను వెతుక్కొంటూ వెనక్కి వచ్చిన స్నేహితులు ఆయన ముఖ కవళికల్లో వచ్చిన మార్పును గమనించి ఆశ్చర్యపోయారు. ఇంతకు ముందెప్పుడూ ఫ్రాన్సిస్ ఆవిధంగా కనిపించలేదు వారికి అంతా అయోమయంగా ఉంది. ఫ్రాన్సిస్ పరివర్తనకు దేవుని ప్రణాళికో లేక స్నేహితుల ప్రోత్సాహక సూచికోమరి, ఆవిందే తనకు తన స్నేహితులకు చివరి విందైయింది.

"ఫ్రాన్సిస్ అంతరంగములో ఏదో మార్పు జరుగుతుంది. కలలో ఆ దివ్యస్వరం చూపిస్తానన్న జీవన మార్గమేమిటో స్పష్టం కాలేదు. ఫ్రాన్సిస్ తనలోతాను సతమతమౌతూ ఆ మార్గాన్ని చూపించుమని దేవున్ని ప్రార్థించాడు. ఇలాంటి సందర్భములోనే తన అంతరంగమేమిటో ఒక మిత్రుడికి వివరించి చెప్పాడు. అతనూ ఫ్రాన్సిస్ వయస్సు వాడే. ఫ్రాన్సిస్ మనస్తత్వం అతనికి బాగా తెలుసు. ఇద్దరూ కలసి పట్టణానికి దగ్గరలో ఉన్న ఒక గుహలోనికి వెళ్ళి ప్రార్థించేవారు. మిత్రుడు బయటుంటే ఫ్రాన్సిస్ ఒంటరిగా లోనికి వెళ్ళి ప్రార్థించేవాడు. ఆ సమయంలో రకరకాల భావాలతో అతని హృదయం వికలమయ్యేది. గతం గుర్తుకు వచ్చి పశ్చాత్తాపంతో విలపించేవాడు. క్షమించి తనకు దారి చూపుమని దేవున్ని అర్థించేవారు. అయినా మనస్సుకు శాంతి లభించేది కాదు. చివరికి ఒకరోజు దేవుడు ఫ్రాన్సిస్ మనోక్లేశాలనన్నింటినీ తొలగించి దివ్య జ్ఞానాన్ని ప్రసాదించాడు. ఆక్షణాలలోనే ఫ్రాన్సిస్ సంశయాలన్నీ పటాపంచలైనాయి. ఆయన ముఖం తేజోవంతమైంది. నాటి నుంచే ఫ్రాన్సిస్ చేతల్లో చెప్పుకోదగిన మార్పు కనిపిస్తోంది.'

## 3.6. సేవా గుణం

క్రీస్తు అనుచరులుగా ఉండవలసిన అతి ప్రధాన లక్షణం సేవా గుణం దీనిని సాక్షాత్తు క్రీస్తుప్రభువే పాటించి ప్రకటించాడు. అందుకే ఫ్రాన్సిస్ కూడా చిన్నప్పటి నుండే దీనిని తన జీవితంలో అలవరుచుకున్నాడు.

### 3.6.1. పేదల ఆదరణ

ఫ్రాన్సిస్ పేదలకు విపరీతంగా ధానం చేసేవాడు. తన దగ్గరున్న డబ్బును, దుస్తుల్ని, ఆభరణాల్ని అన్నింటినీ పేదలకు పంచి ఇచ్చేవాడు. తండ్రి ఇంట్లో లేని సమయంలో పేదవాళ్ల కోసం అదనంగా భోజనం తయారు చేయించి అన్నార్తుల ఆకలి తీర్చేవారు. ఈ విషయం తల్లికి తెలిసినా ఫ్రాన్సిస్ పట్ల గల అమిత ప్రేమ వలన గట్టిగా వారించేది కాదు. అందరూ "మన ఫ్రాన్సిస్ కు పేదలపట్ల సంఘ బహిష్కృతుల పట్ల అభిమానం ఎలా పెరిగి పోయిందో చూడండి" అనుకునేవారు. కానీ నిజానికి ఫ్రాన్సిస్ ప్రేమ కేవలం పేదల మీదకాదు, అంతకుమించి పేదరికం మీద. ఆయన పేదరికాన్ని ప్రేమించారు. పేదలతో కలసి ఉంటూ నిరుపేదగా బతకటం ఫ్రాన్సిస్ ధ్యేయం. పేదల లేమిని పంచుకోవడమే ఫ్రాన్సిస్ దానధర్మాల పరమార్థం.

'అస్సీసీలో గూని ఉన్న ఒక ముసలావిడ ఉండేది. చూపులకు భయకరంగా కనిపించేది. ఆవిడంటే ఫ్రాన్సిసుకు విపరీతమైన జుగుప్స. ఈ పేదరికంలో బతికితే నాకూ గూని పెరిగి వికృతంగా తయారవుతానేమోనని భయపడుతూ ఉండేవాడు. ఈ ఆలోచన ఒక శోధన, దీనిని జయించటం ఫ్రాన్సిస్ కు చాలా కాలం కష్టంగా తోచింది. ఒక రోజు ప్రార్థన సమయంలో ఫ్రాన్సిస్ నన్ను కనుగొనాలంటే ప్రాపంచిక వ్యామోహాలన్నిటినీ వదలుకోవాలి. ఆనందానికి బదులు దు:ఖాన్ని కోరుకోవాలి. అప్పుడే నీకు జ్ఞానోదయం అవుతుంది అని చెప్పాడు. ఆ ఆదేశాన్ని ఫ్రాన్సిస్ అక్షరాల తలదాల్చాడు.'

### 3.6.2. కుష్ఠ రోగుల ఆదరణ

'ఆ రోజుల్లో కుష్టు రోగులంటే అందరికీ విపరీతమైన భయం. వాళ్ళు ఎదురైతే ప్రజలు భయంతో తప్పించుకుపోయేవాళ్ళు. ఇదే భయం ఫ్రాన్సిస్ లో కూడ ఉండేది. కుష్టు రోగి ఎదురుపడగానే గుర్రాన్ని పక్కకు మళ్ళించుకు పోయేవాడు. కానీ ఒక రోజు హఠాత్తుగా ఒక కుష్టురోగి ఫ్రాన్సిసుకు ఎదురుపడ్డాడు. వెంటనే తత్తరపడిన ఫ్రాన్సిస్ అలవాటు ప్రకారం గుర్రాన్ని దారి మళ్లించాలను కున్నాడు. కాని ఎందుకో వెంటనే ఆ ఆలోచనకు స్వస్తి చెప్పి, దిఢీలున గుర్రం

దిగి, ఆ అభాగ్యున్ని ప్రేమతో కౌగలించుకున్నాడు. తన దగ్గరున్న ధనాన్ని కూడ ఆప్యాయంగా అతని చేతిలో ఉంచి ఇంటికి వెళ్ళాడు. ఆనాటి నుంచి ఫ్రాన్సిస్ మనసులో అనిర్వచనీయమైన ఆనందం చోటు చేసుకుంది. అందువలన రెండో రోజు కూడా సాన్ లాజరోడి ఆర్స్ అనే కుష్టు రోగుల గ్రామానికి స్వయంగా వెళ్ళాడు. అందరినీ సమావేశపరచి అప్పటి వరకూ వాళ్ళ గురించి అమానుషంగా ఆలోచించినందుకు, అవమానించినందుకు క్షమాపణలు కోరాడు. వాళ్ళతో కలసి చాలాసేపు గడిపాడు. వచ్చేటప్పుడు తన దగ్గరవున్న డబ్బులను అందరికీ పంచి ఇచ్చి అందరినీ అప్యాయంగా కౌగలించుకొని, ప్రేమగా పెదవుల మీద ముద్దాడి మరీ వచ్చాడు. ఫ్రాన్సిస్ నడవబోతున్న ప్రేమ మార్గం ఎలాంటిదో వివరించడానికి ఈ సంఘటన ఒక్కటి చాలు.'

## 3.7. రోము నగర తీర్థయాత్ర

'ఈ యొక్క సమయంలోనే ఫ్రాన్సిస్ ఒక సారి రోము నగరానికి కూడా వెళ్లాడు. తనకు ఆధ్యాత్మిక సలహాలు ఇచ్చే గురువు ఆదేశం ప్రకారమే, అపోస్తులుల సమాధులు దర్శించాలనే  కోరికతోనే ఆ యాత్రకు వెళ్ళాడు. అక్కడ పునీత పేతురు సమాధిని దర్శించి ప్రార్థనలు చేశాడు. అయితే కానుకల విషయంలో యాత్రికులు పిసిని గొట్టులుగా ఉండటం చూసి ఫ్రాన్సిస్ బాధపడ్డాడు. శ్రీ సభకు సారధ్యం వహించిన పునీతుడికి చేస్తోన్న అవమానంగా తోచింది. వెంటనే తన దగ్గరున్న బంగారు నాణాల మూటను బలిపీఠం ముందుకు విసిరేసాడు. నాణాలు దేవాలయంలో చెల్లా చెదురుగా పడ్డాయి. ఆ దృశ్యాన్ని చూచిన యాత్రికులంతా ఫ్రాన్సిస్ వితరణ శీలానికి, తమ లోభి తనానికిగల తేడా ఏమిటో తెలుసుకో గలిగారు.'

'తరువాత ఫ్రాన్సిస్ పునీత పేతురు దేవాలయం ఎదుట మూగిన భిక్షకుల దగ్గరికి వెళ్ళాడు. వాళ్లలో ఒకడికి తన బట్టలు ఇచ్చివేసి, అతని బట్టలు తాను వేసుకున్నాడు. అంతేకాదు వాళ్ళతో పాటు తానూ భిక్షమెత్తాడు. వాళ్ళతో కలిసి భోజనాలు చేసాడు. వాళ్ళల్లో ఒకడై, బతకడంలోగల అనిర్వచనీయమైన ఆనందాన్ని చవిచూశాడు. ఈ హఠాత్పరిణామానికి తన తల్లిదండ్రులు చిన్నబోతారేమోనన్న సంశయం లేకపోతె అక్కడికక్కడే ఫ్రాన్సిస్ భిక్షగాడిగా మారిపోయేవాడు. అస్సీసికి

తిరిగి వచ్చాక ఫ్రాన్సిస్ మరింత ఎక్కువ కాలాన్ని ప్రార్థనలో గడపసాగాడు. తన మార్గమేదో స్పష్టం చేసి ముందుకు నడుపమని దేవునికి మనవి చేసేవాడు.'

### 3.8. సిలువధారి సంభాషణ

'అస్సిసీకి దిగువన సుమారు ఒక మైలు దూరంలో, శిధిలావస్థలో సాన దమియానో దేవాలయం ఉంది. చుట్టూ గోదుమ పొలాలు, సైప్రస్ వృక్షాలు నాడు నేడూ కూడా ఉన్నాయి. చిన్న కొండ మీద ఉన్న దేవాలయంలో ఆనాడు ఒక్క గురువు మాత్రం బిక్కు బిక్కు మంటూ ఉండేవాడు. ఒక రోజు ఫ్రాన్సిస్ ఆ దారిన వెళ్తూ దేవాలయం దగ్గర ఆగాడు. లోపలికి వెళ్లి, గోడకు వేళ్ళాడుతున్న కొయ్య సిలువ ముందు మోకరిల్లి ప్రార్థన చేయసాగాడు, వెంటనే సిలువ మీద యేసు స్వరూపం పెదవులు విప్పి ఇలా అంది. "ఫ్రాన్సిస్ నా ఇంటిని బాగు చెయ్యి" ఆ మాటలు విన్న ఫ్రాన్సిస్ ఎలాంటి అనుభూతిని పొందిఉంటాడో వర్ణించడం సాధ్యం కాదు. ఆ అనుభవాన్ని వర్ణించడానికి మాటలు చాలవని ఫ్రాన్సిస్ తరువాత తన అశక్తతను వ్యక్తం చేసాడు. అయితే సిలువపై వేళ్లాడే యేసు ప్రభువు ఆనాడే ఫ్రాన్సిస్ హృదయం మీద తమ పంచాగాయాల్ని ముద్రించారని, అవే తరువాత బహిర్గత మైనాయని ఎవరైనా ఊహించవచ్చును. అంతేకాదు ఫ్రాన్సిస్ ఆ దేవాలయంలో ఎంతటి భక్తిప్రపత్తులతో ప్రార్థించి ఉంటాడో కూడా ఉహించవచ్చును.'

### 3.9. ఆలయపునరుద్ధరణ

'ఆనాడు యుద్ధ వీరులు తమ దిగ్విజయయాత్రల్లో చేసిన పాపాల పరిహారార్థం దేవాలయాలు నిర్మించటం ఆనవాయితీ. అందులో సాన్ దమియానో దేవాలయాన్ని పునరుద్ధరించడమే యేసు ఉద్దేశమని ఫ్రాన్సిస్ భావించాడు. ఇంటిని బాగు చెయ్యడమంటే దేవాలయాన్ని పునరుద్ధరించడమే అనుకున్నాడు. నిజానికి ప్రభువు శ్రీ సభను ఉద్ధరించమంటున్నారని గ్రహించ లేక పోయాడు. కనుక తక్షణమే సాన్ దమియానో దేవాలయాన్ని బాగు చేయించాలని నిశ్చయించుకున్నాడు. ముందుగా సిలువ స్వరూపం ముందు వెలిగించడానికి ఓ దీపాన్ని, చమురును కొనడానికి కొంత పైకాన్ని గురువుకిచ్చాడు. ఇక దేవాలయాన్ని

బాగు చేయించడానికి డబ్బు కావాలి కాబట్టి ఆలోచనలో పడ్డాడు ఫ్రాన్సిస్. వెంటనే ఇంటి దగ్గరున్న బట్టల బేళ్లూ తన గుఱ్ఱమూ కళ్ళలో మెదిలాయి. అనుకున్నదే తడవుగా వాటినన్నింటినీ అమ్మి డబ్బుతో సాన్ దమియానో దేవాలయానికి తిరిగి వచ్చాడు. ఫ్రాన్సిస్ ఎన్ని విధాలుగా నచ్చ చెప్పినా గురువు మాత్రము ఆ డబ్బును తీసుకోలేదు, కానీ తన తండ్రికి తనకు వైర్యాన్ని కలిగించి ఫ్రాన్సిస్ గమ్యమేమిటో చూపించింది. అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని, దేవాలయ పునరుద్ధరణకు కావలసిన సామాగ్రిని దానం చేయుమని చివరికి ప్రజలను అర్థించాలని నిశ్చయించుకున్నాడు. అలాగే వీధి వీధికి తిరిగి ప్రజలకు విజ్ఞప్తి చేశాడు.' "నాకు ఒక్క రాయి దానం చేసిన వాళ్లకు ఒక వరాన్ని, రెండు రాళ్లు దానం చేస్తే రెండు వరాల్ని మూడు రాళ్ళూ దానం చేస్తే మూడు వరాల్ని ప్రభువు అనుగ్రహిస్తాడు, అంటూ ఇంటింటికి వెళ్లి యాచించేవాడు. మధ్య మధ్యలో యాచన ఆపి దైవస్తుతి గీతాలు పాడేవాడు." ఇదంతా చూసి కొందరు ఫ్రాన్సిసును పిచ్చివాడుగానే పరిగణించేవారు. అయినా ఫ్రాన్సిస్ దీక్షలో మాత్రం రవ్వంత కూడా మార్పు రాలేదు. తానే స్వయంగా రాళ్లు మోసాడు దేవాలయ నిర్మాణంలో సాయం చేయుమని ప్రతివారినీ ఆహ్వానించేవాడు ఫలితంగా కొందరు కట్టడాల పనివాళ్ళు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఆలయానిర్మాణానికి పూనుకొని వారి సహాయం అందించారు. ఈ విధంగా ఎన్నో అవరోధాలను దాటుకొని ఆలయ పునరుద్ధరణను ఫ్రాన్సిస్ పూర్తిచేశాడు.

### 3.10. తండ్రి నిరాధరణ

ఫ్రాన్సిస్ చేసే పనులు తండ్రికి నచ్చేవికాదు. ఎన్నోసార్లు ఆయనను మందలించినా ఫలితం లేదని భావించాడు. వీటన్నింటికంటే ఫొలిగ్నోలో బట్టలమ్మిన సంఘటన ఆయనను ఉద్వేగానికి గురిచేసింది. అప్పటికే విపరీతమైన కోపంతో ఉన్న పీటర్ బెర్నార్డోనె ఎలాగైనా ఫ్రాన్సిస్ నుండి బట్టలమ్మిన డబ్బును తిరిగి రాబట్టి పట్టణం నుండి బహిష్కరించాలని అస్సిసీ కమ్యూను న్యాయస్థానంలో పిర్యాదు చేశాడు. కానీ, ఫ్రాన్సిస్ వెళ్ళడానికి నిరాకరించాడు. "నేను దైవసేవకు అంకితమయ్యాను గనుక తానిక న్యాయం పరిధిలోనికి రాను" అని చెప్పి పంపించాడు. దానితో న్యాయమూర్తులు తమ అశక్తతను తెలియజేసారు. ఫ్రాన్సిస్

తండ్రి పీటర్ బెర్నార్డోనె ఇక చేసేది లేక శ్రీసభ పీఠాదిపతులకు విన్నవించాడు. ఈ ఫిర్యాదు విని ఆయన ఫ్రాన్సిసుకు నచ్చచెప్పాడు. దేవుని సేవ చేయదలచు కున్నప్పటికీ, ఇలా అక్రమంగా డబ్బు సంపాదించి నీ దగ్గర ఉంచుకోవడం సమంజసం కాదు. కనుక ఆ ధనాన్ని మీ తండ్రికి తిరిగి ఇచ్చివేయి" అన్నారు అందుకు ఫ్రాన్సిస్ ఆనందంగా అంగీకరించాడు. అలాగే, ఆయనకు సంబంధించినవన్నీ ఇచ్చివేస్తానంటూ ఫ్రాన్సిస్ ఫిఠాధిపతి భవనంలోకి వెళ్ళి తను వేసుకున్న బట్టల్నికూడా విప్పి అర్ధనగ్నంగా ప్రజల మధ్యకు వచ్చాడు. ప్రజలందరి వైపు చూస్తూ ఇలా అన్నాడు, అందరూ వినండి ఇప్పటి వరుకు పీటర్ బెర్నార్డోనె గారు నా త్రండి. కానీ ఈ క్షణం నుంచి నేను దైవ సేవకు అంకితమవుతున్నాను. కనుక, నా తండ్రి ధనాన్నీ, ఆయన డబ్బుతో కొన్న దుస్తుల్నీ కూడా ఆయనకే తిరిగి ఇచ్చేస్తూన్నాను అంటూ డబ్బునూ బట్టల్నీ నేలమీదికి విసరివేశాడు." ఈ క్షణం నుంచి పరలోకంలో ఉన్న తండ్రే నాకు తండ్రి" అని మరోసారి ప్రకటించాడు.

## 4. క్రీస్తునందు జీవితం ప్రారంభం

ఫ్రాన్సిస్ వారికి ఊహ తెలిసినప్పటి నుండి పేదలకు ధానం చేయాలన్నా నిస్సహాయకులకు సహాయం చేయాలన్నా రహస్యంగా చేయవలసి వచ్చేది. ఎందుకంటే తన తండ్రికి ఇవన్నీ ఇష్టముండేవి కావు. తన ఆస్తినంతా ధానధర్మాల రూపంలో స్వాహా చేస్తూన్నాడని మందలించేవాడు ఇంకా కొన్నిసారులైతే చెయ్యి చేసుకొనేవాడు. అయినా ఫ్రాన్సిస్ ముందుకు అడుగు వేస్తునే కొనసాగాడు. తన తండ్రి పిర్యాదు ఫిఠాదిపతుల ముందు పెట్టిన తర్వాతే ఫ్రాన్సిస్ ఆశయాలకు మార్గం దొరకి తన జీవితంలో నిజమైన అనుసరణ ప్రారంభమైంది.

### 4.1. నిరాడంబర జీవితం

'ఫ్రాన్సిస్ పీఠాధిపతుల సమక్షంలో పలికిన పలుకులను బట్టి మనం అర్థం చేసుకోవచ్చు: ఆయన ఎలాంటి జీవితాన్ని ఎన్నుకుంటున్నాడోనని. ఈ సంఘటన చూస్తున్న గ్విదో పీఠాధిపతి ఫ్రాన్సిస్ సంకల్పానికి ముగ్దులై ఆప్యాయంగా ఆలింగనం చేసుకొని అభినందించారు. ఇక ప్రజలైతే అయన తపోనిష్ఠకు చలించిపోయారు. ఇంకా ఆయన నిరాడంబర జీవితం ఏవిధంగా

అనుసరించాలో గ్రహించాలంటే ఈ ఉదాహరణే నిదర్శనం. ఈ పీఠాధిపతితో కలసిన తరువాత సాన్ దమియానో దేవాలయానికి వెళ్తుండగా కొంత మంది దొంగలు అడ్డగించారు కానీ ఆయన దగ్గర ఏమీ దొరకకపోవడంతో కోపంతో కొట్టి ఒక గోతిలో పడవేసి వెళ్లిపోయారు కొంతసేపటికి ఫ్రాన్సిస్ ఆ బురదలోంచి పైకి లేచి బిగ్గరగా దైవ స్తుతి గీతాలు పాడుకుంటూ వెళ్ళిపోయాడు. అలా ఒక మఠం దగ్గరకు వెళ్లి ఏదైనా పని చెప్పి బట్టలు దయచేయమని అడిగాడు. ఆ మతవాదులు ఫ్రాన్సిస్ కు వంట గదిలో పని చెప్పారు. కానీ ఫ్రాన్సిస్ కోరినట్టు బట్టలేమి ఇవ్వలేదు కదా, సరే కనీసం సరైన భోజనం కూడా పెట్టక పాచిపోయిన భోజనం పెట్టేవారు. 'ఫ్రాన్సిస్ ఎవడో ఒక అమాయకుడు అనుకున్నారు వాళ్ళు. తరువాత ఆయన గురించి తెలుసుకొని, తమ ప్రవర్తనకు క్షమాపణలు కోరారు. అందుకు ఫ్రాన్సిస్ తానేమి బాధపడలేదని ఆ వంట గదిలో పనిచేయడం ఒక కొత్త అనుభవంగా మిగిలి పోయిందని చెప్పి వారిని పంపివేసాడు.'

## 4.2. బిక్షాటన

'ఫ్రాన్సిస్ సాన్ దమియనోలో ఉన్న గురువుతో ఉండే వాడు. అక్కడ గురువు ఫ్రాన్సిస్ ను చూచి ఎంతో జాలిపడేవాడు. ఎందుకంటే అల్లారు ముద్దుగా పెరిగిన ఫ్రాన్సిస్ ఇలా జీవించడం ఆయనకు ఎంతో బాధకలిగించేది. ఎన్నోసార్లు ఫ్రాన్సిస్ కు నచ్చ చెప్పడానికి ప్రయత్నించేవాడు, కానీ ఫ్రాన్సిస్ మాత్రం వినేవాడు కాదు. అందుకనే ఉన్నదానిలోనే ఆయనకు కాస్త మంచి భోజనం తయారు చేసి పెట్టడానికి ప్రయత్నం చేసేవాడు. అందుకు ఫ్రాన్సిస్ మొదట్లో అభ్యంతరం చెప్పలేదు. కాని కొన్ని రోజులకు అలోచించి ఫ్రాన్సిస్ ప్రతి చోటా నీకు వండి పెట్టడానికి ఒక గురువు ఉండాలని కోరుకుంటున్నావా? ఇలాంటి జీవితాన్నేనా నువ్వు ఎంచుకున్నది? నీవూ బిక్షకుల్లానే బతకాలి. క్రీస్తు పేదరికంలోనే పుట్టాడు, పెరిగాడు, చివరికి ఆయనను భూస్థాపితం చేసిన సమాధి కూడా ఆయనది కాదు. ఆ ప్రభువు మీద ప్రేమే ఉంటే నువ్వు కూడా నిరుపేదగానే బతుకు. ఇంటింటికీ వెళ్లి భిక్ష మెత్తుకుంటూ జీవనం సాగించు, అని తనను తానే ప్రశ్నించుకొని తనలో తానే తర్కించుకొని, ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చాడు. వెంటనే ఒక పాత్ర తీసుకొని ఇంటింటికీ తిరిగి, వాళ్ళు ఇచ్చిన ఆహారాన్ని

కృతజ్ఞతతో స్వీకరించి తెచ్చాడు. దానిని తినబోయే సరికి ఫ్రాన్సిసుకు వొళ్ళు తిరిగినట్లయింది. అయినా, బలవంతాన తిన్నాడు. అప్పుడు ఆయనకు అనిర్వచనీయమైన ఆనందం కలిగింది. ఇంటి దగ్గర పంచభక్ష్య పరమాన్నాలు భోంచేసినపుడు కూడా ఈ ఆనందం కలుగలేదు. దేవునికి కృతజ్ఞతలు తెలిపాడు నాటి నుంచి మరెన్నడూ గురువును తనకోసం వంట చేయనీయలేదు.'

## 4.3. పిలుపులోని పరమార్థాన్ని గ్రహించడం

'ఒకరోజు దివ్యపూజలో పాల్గొంటూ ఉండగా ఫ్రాన్సిసుకు తన భవిష్యత్కార్యక్రమాలు బోధపడ్డాయి. బహుశా అది 1208 ఫిబ్రవరి 24వ తేదీ కావచ్చు. ఆ రోజు పునీత మత్తాయసు గారి పండుగ. ఆనాటి సువార్త పఠనమే ఫ్రాన్సిస్ పాలిటి దైవాదేశం అయింది. భవిష్యత్తు మార్గాన్ని చూపింది. "మీరు వెళ్లి దైవరాజ్యం సమీపించినదని బోధించండి మీరు ఉచితంగా పొందారు, కాబట్టి ఉచితంగానే ఇవ్వండి. వెండి బంగారాన్ని ఏ విధమైన ధనాన్ని మీతో ఉంచుకోవద్దు. చివరికి జాలె కూడా మీ దగ్గర ఉండడానికి వీలులేదు. రెండు అంగీలు గానీ, పాదరక్షలు గానీ ఊతకఱ్ఱకాని మీకు అవసరం లేదు. సేవకుడు భత్యానికి మాత్రమే అర్హుడు. ఏదైనా పట్టణానికి గాని గ్రామానికి కాని వెళ్ళినప్పుడు అక్కడ యోగ్యమైన వాళ్లెవరో వాళ్ళ ఇంటిలో తిరిగి వచ్చేవరకు ఉండండి. ఆ ఇంటిలో ప్రవేశించినప్పుడు ఈ ఇల్లు శాంతి సమాధానాలతో వర్ధిల్లుగాక, అని దీవిస్తూ ప్రవేశించండి." క్రీస్తు తన శిష్యులకిచ్చిన ఈ ఆదేశం ఫ్రాన్సిసులో కొత్త శక్తిని నింపింది. తన మనస్సును కమ్ముకున్న చీకటి తెర తొలగినట్లు అయింది. ఈ సందేశం అర్థం ఏమిటో నిర్ధారించుకోవడానికి ఫ్రాన్సిస్ అక్కడి గురువునే వివరణ అడిగాడు. క్రీస్తుప్రభువు సత్య సువార్తను బోధించమని తన శిష్యులను ఆదేశించారని, ప్రభు శిష్యులు సర్వదా ప్రభువునే నమ్ముతూ ముందుకు సాగాలని, లౌకిక సంపదలను వారు ఆశించరాదనీ, తమతో వుంచుకోరాదనీ గురువు వివరించాడు ఈ మాటలు విన్నాక ఫ్రాన్సిసుకు పట్టరాని ఆనందం కలిగింది, "ఇదే నేను కోరుకున్నది, ఈ మార్గం కోసమే నేను చిరకాలంగ అన్వేషిస్తున్నాను ఇక హృదయపూర్వకంగ దీనిని అనుసరిస్తాను" అంటూ ఆ క్షణంలోనే తన చేతి కర్రను, పాదరక్షల్ని, పై అంగీని అవతలకు విసిరివేసి, ఒక చౌకబారు వస్త్రంతో

చేసిన అంగీని ధరించాడు. అది ఫ్రాన్సిస్ జీవిత యాత్రలో కీలకమైన మలుపు తిరిగిన రోజుతనను దేవుడు పిలిచింది దేవాలయాన్ని బాగుచేయడానికి కాదనీ, శ్రీసభ పునర్నిర్మాణానికి తోడ్పడానికి అని అప్పటికి గ్రహించాడు ఆలస్యం చేయకుండా సువార్త ప్రబోధానికి పూనుకున్నాడు.

## 4.4. తొలి అనుచరులు

'ఫ్రాన్సిస్ చేసే ప్రభోదం అందరిని ముగ్ధుల్ని చేసేంది. సువార్త సందేశాన్ని సరళమైన భాషలో సూటిగా స్పష్టంగా బోధించేవాడు. ఫ్రాన్సిస్ మాటలు వింటుంటే సాక్షాత్తు క్రీస్తు నోటినుండి విన్నట్లుగనే తోచేవి. ఈ ప్రచారకుడు ప్రభువునకు సజీవ ప్రతీకగా ప్రజల ముందు నిలిచాడు, వాళ్ళ విశ్వాసాన్ని దృఢతరం చేసాడు. ఈ విధంగా కొందరు ఫ్రాన్సిసుకు శిష్యులై ఆయనను అనుసరించడానికి ముందుకు వచ్చారు. కొన్ని నెలల కాలంలోనే ఫ్రాన్సిస్ ను అనుసరించడానికి పదకొండుమంది వచ్చారు. మొట్టమొదట వ్యక్తి పేరు మనకు తెలియరాలేదు, కానీ అతడు అస్సిసీ పురానికి చెందిన వాడని, సహృదయుడని మాత్రం తెలుస్తుంది. రెండో వ్యక్తి క్విన్తవాల్ బెర్నార్డ్, మూడో వ్యక్తి పీటర్ కథాయిని, న్యాయశాస్త్ర ప్రవీణుడు, నాలుగో వ్యక్తి గైల్స్, మిగతా వాళ్ళు మొరికో, బర్బాలో, సబ్బతీనో, బెర్నార్డ్ విజిలంతె, సాన్ కొస్తాంజో జాన్, ఆంజేలోతంక్రేది, ఫిలిప్, జోవాన్నిడెల్లాకపీల్లా, వీళ్ళలో మొరికో సాన్ సాళ్వతోరే కుష్ఠరోగుల ఆసుపత్రికి చెందిన వాడు. ఆంజేలోతంక్రేది యోధుడు, ఫిలిప్ పరిశుద్ధగ్రంథ వ్యాఖ్యానంలో అద్భుత ప్రావీణ్యం గలవాడు. ఇక జోవాన్నిడెల్లాకపీల్లా యేసు శిష్యుల్లో యూదావంటి వాడు. మఠంలో చేరి ఫ్రాన్సిస్ సిద్ధాంతాలను వ్యతిరేకించి చివరికి ఉరిపోసుకు చనిపోయాడని, చెబుతారు. ఇతను ప్రతి విషయాన్నీ దుయ్యబడుతూ, అవిధేయతగా ఉండేవాడట. అందరూ తలమీద ముసుగులు వేసుకుంటుంటే జోవాన్ని మాత్రం టోపీలేనిదే బయటకు వెళ్ళేవాడు కాదట. చివరికి అత్యంత దయనీయంగా మరణించాడు.'

## 4.5. ప్రేషిత కార్యం

'వీరి ప్రేషితకార్యం, వీధుల కూడళ్లలో దైవస్తుతి గీతాలు పాడటం, ఆసక్తిగల కొద్దిమందికి దైవోపదేశం చేయడమే వాళ్ళ కార్యక్రమమైంది. మిగతా

అన్నింటికంటే మిన్నగా దేవుని ప్రేమించాలని పాపాలకు పశ్చత్తాపపడి మారు మనస్సు పొందాలని ఫ్రాన్సిస్ భోధించేవాడు. నలుగురిలో మాట్లాడే అలవాటు లేని గైల్సు మాత్రం మౌనంగా ఉండేవాడు. అప్పుడప్పుడు ఫ్రాన్సిస్ సందేశం యదార్థమైందని పునరుద్ఘాటిస్తూ ఉండేవాడు. ఫ్రాన్సిస్ గారు ఉపదేశించిన ప్రకారం జీవించండి. వీరు పలికిన ప్రతి మాట అక్షర సత్యం ఇంతకంటే మేలైన సందేశాన్ని మరెవ్వరు ఇవ్వలేరు నన్ను నమ్మండి, అనేవాడు గైల్సు. మొదట్లో ఫ్రాన్సిస్ ఒక్కడే భిక్షాటనకు వెళ్ళేవాడు. మిగతావాళ్ళు ఆశ్రమంలోనే ఉండేవారు. కానీ ఇది వాళ్లలో సిగ్గు బిడియాన్ని పెంచుతోందని గ్రహించిన ఫ్రాన్సిస్ వాళ్ళందరిని సమావేశ పరచి ఇలా అన్నాడు. మీరు కూడా భిక్షాటన చేయడానికి సంసిద్ధులు కావాలి. యేసు ప్రభువు, మరియమాతని ఆదర్శంగా తీసుకుని మనం ఈ పేదరికాన్ని అనుభవించడానికి సిద్ధపడ్డాం. కనుక దీనిని అవమాన కరంగా భావించరాదు. మీరు చేయవలసిందల్లా దేవుని పట్ల ప్రేమతో దానం చేయండి అని అర్థించడమే. మీకు దానం చేసే ప్రతి వారికీ నూరింతలు ప్రతిఫలం లభిస్తుంది. కనుక ఏ మాత్రం జంకు లేకుండా ఆనందంగా వెళ్ళండి అని చెప్పి పంపించాడు.'

## 4.6. ప్రజల నిరాధరణ

'ఫ్రాన్సిస్ చుట్టూ చేరే వాళ్ళ సంఖ్యను చూచి అస్సిసీ ప్రజలు ఆందోళన చెందారు. ఆరోగ్యాంగా ఉన్న వీళ్లంతా ఊరి మీద పడి ముష్టెత్తు కోవటమేమిటని ఆక్షేపించారు. ఫ్రాన్సిస్ అనుచరులు తమ పేదరిక ధర్మాన్ని బట్టి భిక్ష అడిగినపుడు వీళ్లకు తిట్లు శాపనార్థాలూ ఎదురయ్యేవి. వీళ్ల వేషధారణ చూచి పాటలూ, మాటలు విని ప్రజలు వీళ్ళను వెర్రివాళ్ళు అన్నారు. యువతులు వీళ్ళ కళ్ళల్లో పడితే దృష్టి దోషం తగులుతోందని భయపడ్డారు. వీళ్ళు పిచ్చివాల్లో పునీతులో ఎవరో ఒకరు అయి ఉంటారు లెమ్మని పండితులు సరి పెట్టుకున్నారు. ఫ్రాన్సిస్ మాత్రం నిరుత్సాహం పడలేదు. భవిష్యత్తులో తాము తప్పకుండా విజయం సాధించగలమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసేవాడు. వీరుడికుండే అపారమైన ఆత్మబలంతో ఫ్రాన్సిస్ ముందుకు సాగిపోయాడు. ఇంకా కొందరైతే వీళ్ళక్కూడా ఏదైనా ఆస్తి వుంటే ఇలా పరాయి వారి మీద ఆధారపడే గతి తప్పుతుంది గదా అని గొణుక్కోవడం

ప్రారంభించారు. ఈ వార్త గ్విధో పీఠాధిపతి వరకు వెళ్ళింది. కాని ఆస్తి పాస్తులుంటే తలెత్తే వివాదాల సంగతి ఆయనకు తెలియనిది కాదు. పేదరికాన్ని వదులుకోండి అని చెబితే మరి సువార్తా సందేశం మాటేమిటి? అది తప్పని అర్థమా? కనుక ఆయన మౌనంగా ఉండి పోయారు. ఆయన ఆంతర్యాన్ని గ్రహించిన ఫ్రాన్సిస్ ఒక మెట్టు కిందికి దిగి అలా అయితే మా జీవనోపాధి కోసం మేము పని చేస్తాం. ఎంతో అవసరమైతే తప్ప ఇతరుల్ని యాచించం, అని చెప్పి వచ్చాడు. ఆ ప్రకారమే ఫ్రాన్సిస్ అనుచరులు కొందరు పొలాల్లోనూ, మఠాల్లోనూ ఇతరుల ఇళ్లలోనూ పనులకు కుదిరారు. కొందరు కుష్టురోగుల గ్రామాల్లో సేవలు చేస్తున్నారు. అయితే భత్యం కోసం పనిచేయవలసి రావటంతో రేపటి గురించి యావ తప్పడం లేదు. పైగా ఈ పనిపాటలు విధానం తాము సాధించదలుచుకున్న కార్యానికి ఆటంకంగా కనిపించింది కనుక మళ్ళీ భిక్షాటన చేయక తప్పలేదు.'

## 4.7. జగద్గురువుల అనుమతి

'ఫ్రాన్సిస్, వారి పన్నెండు మంది అనుచరులతో రోముకు ప్రయాణమయ్యారు. అయితే జగద్గురువుల భవనంలో ఫ్రాన్సిసుకు మొట్టమొదట అవమానమే ఎదురైంది. జగద్గురువుల భవనంలోకి ఏ స్వాగతసత్కార్యాలు లేకుండానే వెళ్ళాడు. జగద్గురువుల్ని సందర్శించి తాము వచ్చిన పనిని సవినయంగా మనవి చేసాడు. ఫ్రాన్సిస్ వేసుకున్న చిరిగిన అంగీని, జడలుదేరిన జుట్టును, వికృతంగా ఉన్న కనుబొమ్మల్ని చూసి మూడవ ఇన్నోసెంట్ జగద్గురువు అసహనంగా "నీ సభ నిబంధనలను ఇలా ఇచ్చి, పోయి, ముందు నీ పందుల్ని వెదుక్కో. నీ ఉపదేశాలన్ని వాటికే చేసుకో పో" అన్నారట. ఫ్రాన్సిస్ మారు మాటాడకుండా బయటకు వచ్చి ఒక పందుల కొట్టంలోకి పోయి అక్కడ కొంత బురదను ఒంటికి పూసుకొని మళ్ళీ తిరిగి జగద్గురువు దగ్గరకి వచ్చి "మీ ఆజ్ఞ ప్రకారమే చేశాను ప్రభూ! దయతో నా విన్నపాన్ని ఆలకించి అనుగ్రహించండి" అన్నాడు. దానితో జగద్గురువులకు కనువిప్పు కలిగింది. ఇతను తిరుగుబాటుదారుడు కాదని నిర్ధారించుకున్నాడు." అనాలోచితంగా ఫ్రాన్సిసును అనుమానించినందుకు పశ్చాత్తాపపడుతూ స్నానాదులకు ఏర్పాటు చేయించి, తరువాత మాట్లాడదామని" పంపించారు.'

'ఈ విధంగా ఫ్రాన్సిస్ మూడవ ఇన్నోసెంట్ జదద్గురువుల అనుమతి కోసం వేచి ఉండగా, అక్కడకు అస్సిసీ పీఠాధిపతి గ్విదో రావడం వాళ్ళను తన మిత్రుడు కార్డినల్ జాన్ ఆఫ్ సెయింట్ పాల్ కు పరిచయం చేసి వీరి గురించి సవివరంగా తెలియజేశారు. కార్డినల్ జాన్ ఇన్నోసెంట్ జగద్గురువును ఒప్పించారు. అప్పుడు ఆయన ఫ్రాన్సిస్ తో నాకు తన సంకల్పమేమిటో తెలియ జేయుమని దేవుని ప్రార్థించు. ఆయన అభీష్టం స్పష్టమయ్యాక నీకు స్పష్టమైన సమాధానం ఇవ్వగలుగుతాను" అన్నారు. ఇదే సమయంలోనే ఫ్రాన్సిస్ ప్రార్థించిగా జగద్గురువులకు ఆదేవాదిదేవుడు కల ద్వారా తన ఇష్టాన్ని తెలియజేశాడు. ఆ కలలో వాటికన్ లోని లాటెరాన్ బసిలిక ఒక పక్కకు ఒరిగింది. ఇక కొద్ది క్షణాల్లో కూలిపోబోతొాందనగా, ఇంతలో ఒక చిన్న మఠవాసి వచ్చి తన భుజాన్ని ఆలంబనగా నిలిపి సునాయాసంగ భవనాన్ని తిరిగి యథాస్థానంలో నిలబెట్టాడు. కలలోని ఆ వ్యక్తి ఫ్రాన్సిసేనని జగద్గురువు గుర్తించి ఫ్రాన్సిస్ మఠాన్ని గుర్తిస్తున్నట్టు నోటి మాట ద్వారా ప్రకటించరాయన. ఈ సమయంలోనే జగద్గురువులు ఫ్రాన్సిసును డీకనుగా అభిషేకించి ఉండవచ్చునని చాలా మంది రచయితలు అంటారు. శ్రీ సభ అధికారిక గుర్తింపు పత్రం లభించక పోయినా మాట మాత్రంగా జగద్గురువులు ఇచ్చిన అనుమతితోనే త ృప్తి పడ్డాడు ఫ్రాన్సిస్. జగద్గురువుల ఆదేశాన్ని అందుకుని అపోస్తుల సమాధుల వద్ద ప్రార్థన చేసి తన సహచరులతో తిరుగు ప్రయాణమయ్యాడు ఫ్రాన్సిస్.'

## 4.8. ఫ్రాన్సిస్ సభ వారి లక్ష్యాలు

అస్సిసీకి తిరిగి వచ్చాక, పోర్తియుంకు దగ్గరలో ఉన్నరీవొటోర్తో ప్రాంతానికి వెళ్లి ప్రార్థన ఉపవాసాదులు ప్రారంభించారు. ఈ కాలంలోనే సభ అనుసరించవలసిన ప్రధాన విలువలేమిటో స్పష్టంగా తెలిసాయని, అవి 'దివ్య జ్ఞానం, నిరాడంబరత, పేదరికం, దీనత, ప్రేమ, విధేయత. ఈ సుగుణాల సామర్థ్యాన్ని గురించి కూడా ఫ్రాన్సిస్ వివరించాడు. సహనం సైతాను మాయాల్ని ఎలా పటాపంచలు చేయగలుగుతుందో ప్రాపంచిక విజ్ఞానాన్ని నిరాడంబరత ఎలా జయిస్తుందో శరీరం ఆత్మకూ – మనిషి తన పొరుగు వానికీ అనుకూలంగా ఉండేటట్టు వినయగుణం ఏ విధంగా ఉపకరిస్తుందో ఫ్రాన్సిస్ స్పష్టం చేశాడు.

నిజమైన క్రైస్తవుడు కేవలం మానవులకే కాదు జంతు జాలానికి కూడా విధేయుడిగా నడుచుకోవాలి. దైవ సంకల్పం ప్రకారం క్రూర మృగాలు తనును ఏమి చేసిన భరించడానికి సిద్ధంగా ఉండాలి అంటారు ఫ్రాన్సిస్. ఈ సుగుణాలన్నిటిలోనూ "పేదరికమే " ఫ్రాన్సిస్ మతానికి పునాది అయినది. చాలా మంది చాలా కారణాలతో స్వచ్ఛందంగా దారిద్ర్యాన్ని వారించవచ్చును. కొందరు తాత్విక చింతన వల్ల కోరుకోవచ్చు. కొందరు కఠోర తపోదీక్ష కారణంగా దారిద్ర్యాన్ని అనుభవించవచ్చును, కొందరు ధార్మిక బుద్ధితో నిరాడంబరులు కావచ్చును, కొందరు పేదరికాన్ని చవి చూడాలనే ఉద్దేశ్యంతోనే పేదలుగా మారవచ్చును. కానీ ఫ్రాన్సిస్ మాత్రం ప్రభుపట్లగల ప్రధానమైన ప్రేమ వల్లనే పేదరికాన్ని తన జీవన మార్గంగా ఎంచుకున్నాడు. క్రీస్తు ప్రభు పేదరికాన్ని అనుభవించారు గనుకనే ఫ్రాన్సిస్ పేదవాడు అయ్యాడు. దైవ కుమారునికి అత్యంత సన్నిహిత సహచరి గనుకనే పేదరికాన్ని ఫ్రాన్సిస్ చేపట్టాడు.'

## 4.9. మఠ విస్తరణ

'ఫ్రాన్సిస్ ఆశయాలు ఎంతో మందిని ఆలోచింప చేసేవి. దాని వలననే అనేక మంది యువకులను ఆకర్షితులను చేస్తున్నాయి. కనుక అనేక పట్టణాల నుండి అనేక మంది వచ్చి ఫ్రాన్సిసును అనుసరిస్తున్నారు. అనతి కాలంలోనే ఫ్రాన్సిస్ అనుచరుల సంఖ్య గణనీయంగా పెరిగింది. వివిధ ప్రాంతాలలో మఠాల స్థాపన విస్తృతంగా జరిగింది. ఇటలీ అంతటా వ్యాపించడమే గాక ఫ్రాన్సు స్పెయిను దేశాలకు కూడా ఫ్రాన్సిస్ వారి మఠం వ్యాపించింది. ఫ్రాన్సిస్ అనుచరులు ఎక్కడ ఉన్నా దైన్యం, ప్రేమ, నిరాడంబరత వారి జీవన విలువలు అయ్యాయి. పేదరికం వారికి ప్రియమైన సహచరిణి. వారు ఊరి పొలిమేరల్లో ఏకాంతంగా నివసించేవారు. అలా అని ప్రజలకు దూరంగా ఉండేవారు కాదు. వారి మధ్య శాంతి దూతల్లా సంచరించేవారు. వీరి దైన్యాన్ని చూసి సానుభూతి చూపించేవారు. మఠవాసులు అంటే ఇలా నిగర్వులూ, నిస్వార్థపరులై ఉంటారనే కొత్తపాఠాలు నేర్చుకున్నారు. ప్రేమతో వారికి బిక్ష వేసి పోషించేవారు. వారిని తమలో ఒకరుగానే భావించి ఆదరించేవారు. మఠవాసులు ఎక్కడికి వెళ్లినా సాధారణంగా ఇద్దరిద్దరు వెళ్లేవారు. సదా ఆనందంగా ఉండేవారు. క్రమం తప్పక భక్తి జీవనంలో క్రమక్రమముగా ప్రవర్థమానులు అవుతూ ఉండేవారు.'

## శ్రీ సభ ఆధ్యాత్మిక అభివృద్ధిలో ఫ్రాన్సిస్ పాత్ర

పునీత అస్సిసీ పుర ఫ్రాన్సిస్ వారు ఆధ్యాత్మిక జీవితమునకు ఎంతో ప్రాముఖ్యతను ఇస్తారు. దేవుడు నరుణ్ణి తనకు పోలికగా చేశాడని, నరుడు తన కొరకులేడని, దేవుని కొరకు ఉన్నాడని, దేవుణ్ణి చేరడమే అతని ధ్యేయమని, అందుకే అందరి హృదయాల్లో దేవుని పట్ల ఆకర్షణ ఉంటుందని, ఆధ్మాత్మిక జీవితం మనం దేవుని వైపు మనసు తిప్పి అతని చెంతకు ప్రయాణం సాగించేలా చేస్తుందని ఆయన అంటారు. ఎంతో మంది పునీతులలో ఆధ్మాత్మిక జీవితమును అక్షరాలలో కార్య రూపంలో చూపించిన మొదట పునీతుడుగా చెప్పవచ్చును. ఈ ఆధ్మాత్మిక జీవితంలో ఆయన పాటించి ప్రకటించిన కొన్ని అంశాలను తెలుసుకుందాం.

### 5.1. ఈలోక సంబంధ వ్యామోహాలను త్యజించుట

ప్రస్తుత సమాజంలో అందరూ సిరి సంపదలతో నిత్యమూ సుఖ సంతోషాలలో జీవనం కొనసాగించాలని అనుకుంటారు. ఎవరు కూడా కష్టాలను ఇష్టపడరు. అది తన బంధువుల కోసమైన చివరకు దేవుని కోసమైన. కానీ 'పునీత ఫ్రాన్సిస్ గారు మాత్రం క్రీస్తు ప్రేమ యొక్క గొప్పతనాన్ని తెలియజేయడానికి సర్వస్వాన్ని విడిచిపెట్టి, ఏ విధంగా జీవించారో మనందరికీ తెలును. క్రీస్తు ప్రభువు పేదరికములో పుట్టి పెరిగి, ఆ పేదరికాన్ని అనుభవించాడు. అంతటి మహోన్నతుడే తనను తాను తగ్గించుకుని సేవకుడై జీవించాడు.' ఆయనను అనుసరిస్తున్న మనమందరమూ ఆయనవలే జీవించాలని ఆయన బోధించి, ఆచరించ చూపించారు. క్రైస్తవులుగా మనం కూడా ఆయనను అనుసరించడానికి ప్రయత్నించాలి.

### 5.2. నిరాడంబర జీవితం

ఫ్రాన్సిసును ప్రజలంతా అభిమానిస్తూ, ఆయన్ని చూడాలని, సందేశం వినాలనీ, ఆదేశాలు అందుకుని ఆ ప్రకారమే నడవాలనీ ప్రయత్నిస్తున్నప్పుడు, వాటిని చూసి కొంత మంది ఫ్రాన్సిసును అడిగినప్పుడు, 'ఈ గొప్పతనమంతా దేవునకు చెందుతుంది. ఈ ప్రత్యేకతను నాకు నేనుగా సాధించుకున్నది కాదు. ప్రభువే అనుగ్రహించారు. నాకే ఎందుకిచ్చారు? నాకే నేను పనికి మాలినవాణ్ణి

గనుక తన మహాత్మ్యం లోకానికి తేటతెల్లం కావడానికి ప్రభువు బలహీనుల్ని, మూర్ఖుల్ని, బహిష్కృతులను ఎన్నుకుంటారు. వాళ్ళద్వారా సంకల్పాన్ని నెరవేరుస్తారు. పండితుల్నీ బలవంతుల్నీ ఉన్నత వంశస్తుల్నీ ఆయన ఎన్నుకోరు. ఎందుకంటే జీవి దేనివల్లో గొప్ప వాడు కాలేడు, కాని గొప్పతనం అంతా జీవ ప్రథాతదే, ఆ దేవదేవునదే' అన్నాడు.'

మరోసారి ప్రజలు తన అంగీని కళ్ళకద్దు కోవడం చూచి ఫ్రాన్సిస్ నవ్వుతూ, "నన్ను అప్పుడే పునీతున్ని చేసేయకండి. నాలాంటి పునీతుడు, భవిషత్తులో ఈ లోకానికి కొడుకుల్ని కూతుళ్ళన్నీ ఇచ్చినా ఇవ్వచ్చు." అన్నాడు. ఈ రెండు ఉదాహరణలు చాలు ఆయన నిరాడంబర జీవితమును తెలుసుకుని ఆచరించడానికి.

## 5.3. ప్రార్థనా జీవితము

ఫ్రాన్సిసువారు మొదటిసారి సాన్ దమియానోలో ప్రార్థించిన సందర్బమును బట్టి మనకు అర్ధమవుతుంది, ఆయన ప్రార్థన యొక్క గొప్పతనము ఆయన ప్రార్థనలలో ఎప్పుడూ దేవుని చిత్తమే జరగాలని, మరియు ఇతరుల కొరకు మాత్రమే ప్రార్థంచేవాడు. ఎప్పుడూ కూడా తన స్వలాభ ప్రయోజనాల కొరకు ప్రార్థించలేదు. ఆయన ఏ కార్యము ప్రారంభించినా ముందు ప్రార్థన చేసి ప్రారంభించేవాడు. ఇంకా చెప్పాలంటే లేచింది మొదలు మరల విశ్రమించే వరుకు ఎప్పుడూ ప్రార్థిస్తూనే ఉండేవాడు. "క్రీస్తు ప్రభువు వాగ్దానము చేసినట్లు మీరు ప్రార్థనలో పరలోక తండ్రిని ఏమి అడిగినా అవన్నీ మీకు ఒసగబడతాయి." ఇది అక్షరాల పునీత అస్సీసీపురి ఫ్రాన్సిస్ వారి జీవితంలో నెరవేరింది. ఇలాంటి ప్రార్థననే మనమూ కుడా నేర్చుకోవాలి.

## 5.4. ఆధ్యాత్మిక జీవితం

ఎంత ప్రవీణుడో మనకర్థమవుతుంది. 'ఫ్రాన్సిస్ సార్తయానొ ఆశ్రమంలో ఉండగా తీవ్రమైన శోధనకు గురి కావలసి వచ్చింది. తపోనిష్ఠకు స్వస్తి చెప్పి శారీరక సుఖాల్ని కోరుకొమ్మని సైతాను వేధించడం ప్రారంభంచింది. మనుషులు తమను తాము హింసించుకోవడం దేవుని అభీష్టం కాదనీ, కనుక భార్యా పిల్లలతో

కాలం గడుపుతూ పునీత అస్సిసీపురి ఫ్రాన్సిసుగారి ఆధ్యాత్మిక జీవితమును అవగాహణ చేసుకోడానికి ఆయన జీవితాన్నంతటినీ చూడనవసరలేదు. ఈ క్రింది సందర్భమును చూస్తే ఆయన ఆధ్యాత్మిక జీవితంలో ఎంత సుఖించుమనీ బ్రహ్మచర్యంతో ఇబ్బంది పడడం వృధా అనీ చెవిలో ఇల్లు కట్టుకుని పోరు మొదలుపెట్టింది.'

ఫ్రాన్సిస్ వెంటనే, గాడిద వంటి నిన్ను కొరడాలతో శిక్షించక తప్పదు. అంటూ ఒక తాడుతో తన శరీరాన్ని కొడుతూ హింసించుకోవడం ప్రారంభించాడు. అయినా ఆశోధన తోలగిపోలేదు. వెంటనే కురుస్తోన్న మంచులోకి వెళ్ళి మంచుతో ఏడు బొమ్మల్ని చేసి వాటికి ఎదురుగా నిలబడి తనతో తానే ఇలా అనుకోవడం ప్రారంభించాడు. " ఫ్రాన్సిస్ ఇదిగో నీ కుటుంబము,భార్యా,ఇద్దరు మొగ పిల్లలు ఇద్దరు ఆడపిల్లలు,ఇద్దరు పని మనుషులు. నువ్వు ఇంటి యజమానుడివి వెళ్ళు, వాళ్ళను చలిలో చంపదలచుకున్నవా? వెళ్ళి వాళ్ళకు కావలసిన బట్టలు తీసుకురా? ఇంకా ఇక్కడే ఉన్నావా? ఏమిటి ఆలోచిస్తున్నావు ? ఇంతమందా అంటునావా? ఎందుకు మరి అటూ ఇటూ ఈ ఊగిసలాట? నీ మార్గం దైవసేవ ప్రభు సేవలో స్థిరపడు మరో ఆలోచనకు చోటివ్వకు అన్నాడు. అంతే అప్పటివరకూ శోధిసున్న సైతాను ఫ్రాన్సిస్ ఆత్మజ్ఞానకాంతిలో నిలువలేక పలాయనమయింది.

## 5.5. కతోలిక క్రియలకు పాలకుడు

పునీత అస్సిసీపురి ఫ్రాన్సిస్ తన జీవితాదర్శం ద్వారా అనగా ఈ లోక వస్తువులపై వ్యామోహాన్ని త్యజించ యేసుని ప్రేమలో భిక్షమెత్తడం, పేదలకు తోడ్పడటం, మూర్ఖుల మనస్సు త్రిప్పడం, పాపులకు ప్రాయశ్చిత్తం కలిగించడం, సోమరులకు బుద్ధిమాటలు చెప్తూ, నిర్భాగ్యుల సేవలో ఆనందాన్ని పొందటం, తన బోధన ద్వారా అనేకమందిని ప్రేరేపించి క్రీస్తు మార్గాన్ని చూపించి శ్రీసభ క్రీస్తును చేరడానికి చేయవలసిన పనులను ఆచరించి ఏ విధంగా ప్రజలకు అనుగుణంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలు కష్టాలకు పరిష్కారం చూపించిన ఫ్రాన్సిసును ఆయన మరణించిన రెండు సంవత్సరములోనే 11వ పయస్ భక్తి నాథ పాపుగారు వారిని పునీతులుగ ప్రకటించి, కతోలిక క్రియలకు పాలకునిగ పేర్కొన్నారు.

## 5.6. సభ స్థాపకునిగ ఫ్రాన్సిస్

ఫ్రాన్సిస్ జీవిత విధానము, ఆయన భోదించిన భోదనలు, అందరిని ప్రేరేపించేవి. అందుకనే ఆయన ఎక్కడికి వెళ్ళినా, ఆయనను అనుసరిస్తామంటూ ఎంతోమంది ముందుకు వచ్చేవారు. ఫ్రాన్సిస్ సందేశం ప్రజల్ని నిలువెల్లా కుదిపివేస్తోంది, పశ్చాత్తాపుల్ని చేస్తోంది. సర్వాన్ని త్యజించి ఆయన్ని అనుసరించేలా చేస్తుంది. ఫ్రాన్సిస్ ప్రబోధాలు విన్నవాళ్ళకు దేవుని పట్ల అపారమైన ప్రేమ భావం పొంగుతుంది, ఆధ్యాత్మిక ప్రపంచం కళ్ళయెదుట సాక్ష్యాత్కరిస్తోంది, ఆత్మల రక్షణ కోసం లౌకిక సుఖభోగాలను త్రుణప్రాయంగా భావించి ఫ్రాన్సిసును అనుసరింపగోరేవారు తండోపతండాలుగా బయలుదేరారు. ఇలా వచ్చిన వారితో ఫ్రాన్సిస్, సభను మూడు భాగాలుగా ఏర్పరిచి ఇంకా ఒక మహిళల సభను కూడా ఏర్పరిచి శ్రీసభకు ఎంతో ఆధ్యాత్మిక బలాన్ని చేకూర్చాడు. ఫ్రాన్సిస్, సభ స్థాపకుడైనప్పటికీ ఎప్పుడూ నిరాడంభరంగా వినయవిధేయతలతో అందరికీ అందుబాటులో ఎటువంటి విభేదాలు చూపించకుండా, పోత్సహిస్తూ సన్మార్గంలో నడిపించాడు. సభలో ఎటువంటి నియమాన్ని అమలు పరచాలన్నా ముందు ఆయన దానిని ఆచరించి తరువాత ప్రకటించేవాడు. ఎప్పుడూ, అనుచరులందరికీ ఆదర్శంగా ఉంటూ వారి క్షేమాభివృద్ధి కొరకే కృషి చేసేవాడు. నిత్యమూ ప్రార్థనతో, తను జీవిస్తూ అనుచరులందరినీ నడిపించేవాడు. ఈ రోజు శ్రీసభలో ఫ్రాన్సిస్ సభవారు ఇన్ని విభాగాలుగా విస్తరించి, తమ సేవ ద్వారా శ్రీసభ ఆధ్యాత్మిక అభివృద్ధిలో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారంటే అదంతా పునీత ఫ్రాన్సిస్ వారి సంకల్ప ప్రతిఫలమే.

## 5.7. పశువుల పాక స్థాపకుడు

ఉత్సవాలన్నిటిలో క్రీస్తు జయంతోత్సవ మంటే ఫ్రాన్సిసుకు ఎంతో ఇష్టం. అందుకు కారణం దేవాది దేవుడు సామాన్య మానవుడిలా అవతరించడం. మునుపు తాను జరుపుకున్న ఉత్సవం వలె కాకుండ ఇక నుండి బెత్లెహేములో క్రీస్తు జన్మించిన వాతావరణంలోనే క్రీస్తు జయంతిని జరుపుకుందామని, జాన్ వెలీతతో చెప్పాడు. ఈయన గ్రెచ్యో ప్రభువు మరియు తృతీయ సభ సభ్యుడు. ఆ సమీపంలో గుహలతో, వృక్ష జాతులతో కూడిన ఒక కొండ ఉంది. ఆ కొండ మీద తను

అనుకున్న విధంగా క్రీస్తు జనన ఘట్టాన్ని పునస్మరించు కోవాలని నిర్ణయించు కొన్నాడు ఫ్రాన్సిస్. ఈ కొత్త తరహా ఆరాధన క్రమానికి రోములో ఉండగానే జగద్గురువుల అనుమతి పొందాడు. ఈ ఉత్సవంలో చుట్టు ప్రక్కల ఆశ్రమాల మఠవాసులతో పాటు అసంఖ్యాకంగా భక్తులు కూడా వచ్చి పాల్గొన్నారు. అందరూ కాగడాలను కొవ్వొత్తులనూ పట్టుకొని దైవ స్తుతి గీతాలు ఆలపిస్తూ, ఆ రాళ్ళూ, రప్పల్లో ఇరుకుదారిలో కొండ ఎక్కుకుంటూ శిఖరం మీద ఎర్పాటు చేసిన పశు ల పాకకు చేరుకున్నారు. అక్కడ ఒక ఎద్దు, ఒక గాడిద మధ్యలో గడ్డితో తొట్టె, ఎండు గడ్డి మీద బాలయేసు ప్రతిమ, ప్రక్కన భక్తి పరావశ్యంలో ఫ్రాన్సిస్. భక్త్యావేశాల మధ్య జరిగిన ఆ మహోత్సవ పూజాబలితో ఆ స్థలమే పావనమైంది. ఆ తరువాత ఆ స్థలాన్ని సందర్శించిన అనేక మంది రోగులు ఆరోగ్యాన్ని పొందారు. " బాలయేసు పవలించిన గడ్డి పరకల్ని తిన్న పశువులు సైతం వ్యాధుల నుంచి బయట పడ్డాయని తామస్ మరియు పునీత బొనవెంతురు కూడా వారి రచనలలో పేర్కొన్నారు. ఈనాడు మనం క్రీస్తు జయంతి మన కళ్ళకు కట్టినట్టుగా జరుపుకుంటున్నామంటే అది పునీత ఫ్రాన్సిస్ వారు ప్రారంభించినదే.

## 5.8. పంచ గాయల పునీతుడు

అది సిలువ మహిమ మహోత్సవం క్రైస్తవేతర శక్తులనుండి హెరాక్లియస్ క్రీస్తు మరణించిన సిలువను తిరిగి స్వాధీనం చేసుకున్న దినాన్నే నాడు యావత్ క్రైస్తవ ప్రపంచ మహోత్సవంతో జరుపుకునేది. అది 1224 సెప్టెంబరు 14. ఆ రోజునే ఫ్రాన్సిస్ పంచగాయాలు పొందినట్లు భావించడానికి ఆధారాలు ఉన్నాయి. సూర్యోదయానికి ముందే లేచి, ఫ్రాన్సిస్ తన కుటీరం ముందు తూర్పు దిశాగా మోకరించి ఆకాశం వైపు చూస్తూ ఇలా ప్రార్థించాడు. "ప్రభు నేను మరణించే ముందు రెండు వరాలు కోరుతున్నాను. మీరు అనుభవించిన బాధలన్నింటినీ నేనూ అనుభవించేటట్లు చేయండి. మీ ఆత్మ త్యాగానికి కారణమైన ప్రగాఢ ప్రేమ మీపట్ల నాకు కలిగేలా దీవించండి. "ఇలా చాలా సేపు ప్రార్థించాడు. హఠాత్తుగా ఆకాశం నుంచి ఒక దివ్య స్వరూపి దిగి రావడం కనిపించింది. ఆ వ్యక్తి సిలువపై వ్రేలాడుతున్నట్టు ఉన్నాడు. ఆయనకు ఆరు అగ్ని పక్షాలున్నాయి. అందులో రెండు ముఖాన్ని రెండు శరీరాన్ని కప్పుతూ ఉండగా మిగిలిన రెండూ,

నిప్పు రెక్కలతోనూ ఎగురుతు వస్తున్నాడు. ఆయన మరెవరో కాదు, క్రీస్తు ప్రభువే. ఈ రూపంలో పునీతునకు దర్శనమిస్తున్నాడు. ఆయన ఫ్రాన్సిసును చేరువుగా వచ్చి, కొన్ని క్షణాల పాటు ఆయన వైపే తధేకంగా చూసి మరలిపోయాడు. వెంటనే ఆయన పవిత్ర గాయాలు ఫ్రాన్సిస్ దేహం మీద శాశ్వతంగా ముద్రితమయ్యాయి." ఈ ఉదంతాన్ని కూడా పునీత బొనవెంతురే వివరించారు.

## 5.9. గురుత్వ ప్రాధాన్యత

పునీత అస్సిసీపురి ఫ్రాన్సిస్‌కు గురువు లేక గురుత్వం అంటే ఎనలేని గౌరవము. ఆయనకు గురువుగా అభిషేకము పొందే అవకాశము వచ్చినా, ఆ గొప్ప భాగ్యానికి నేను అర్హుడును కాదని చెప్పడం ద్వారా అర్థమవుతుంది. ఆయన గురుత్వాన్నికి గురువుకు ఇచ్చే ప్రాధాన్యత. ఆయన చివరి సందేశంలో కూడా గురువుల పట్ల ఆయన అభిప్రాయాన్ని తెలియజేస్తూ, రోమను శ్రీసభకు విధేయులై నడిచే గురువుల పట్ల నాలో బలమైన నమ్మకాన్ని, అపారమైన గౌరవాన్ని పెంపొందించినది ఆ ప్రభువే. వాళ్ళు నన్ను చిత్ర హింసలకు గురిచేసినా మౌనంగా భరించేటంత భక్తి భావం నాలో పెరింగింది. వీరందరినీ నా ప్రభువులుగా భావించి ప్రేమిస్తాను, నిరంతరము గౌరవిస్తాను. వాళ్ళల్లో దైవ కుమారుణ్ణి దర్శిస్తాను. వాళ్ళు ఉన్నతమైన వ్యక్తులు. ఎందుకంటే ఈ లోకంలో దైనసుతుని శరీర రక్తాలను అనునిత్యం స్వీకరించేవారు, ఇతరులకు అందజేసే వారు కేవలం వాళ్ళే కనుక. ఆ మహాద్భాగ్యం మరెవరికి లభిస్తుంది.? అని అంటారు.

## 5.10. స్త్రీలను ఆదరించిన కాపరి

ఫ్రాన్సిసు తన బోధన ద్వారా క్లారా అనే ఒక గొప్పంటి యువతను ప్రేరేపించి దైవ పిలుపుకు స్పందించేలా మార్చారు. ఆ తరువాత 1215 లో "పూర్ క్లేర్స్" అనబడే పేద కన్యాస్త్రీల మఠంకు ఆమెను సుపీరియరుగా ఫ్రాన్సిస్ గారు నెలకొల్పాడు. క్లారా పేదల సేవలోనే పునీతరాలు కూడా అయ్యింది. ఈ విధముగా నిజమైన కాపరి వర్గ విభేదాలను సైతం జయించగలగాలని, దేవుడు మానవుని సృష్టించినప్పుడు ఇద్దరినీ సమాన ప్రాముఖ్యతతో చేసాడని, దైవ సేవకు అందురూ అర్హులనే భావన కల్పించాడు. దీనితో చరిత్రలో స్త్రీలను ఆదరించి

పూర్ క్లేర్స్ అనే పేద కన్యాస్త్రీల మఠాన్ని స్థాపించి దేవుని వైపు మార్గం చూపిన మొదటి పునీతునిగా ఫ్రాన్సిస్ పేరుగాంచాడు.

## 5.11. క్రీస్తును చూపించిన దర్పణం

పునీత అస్సిసీపురి ఫ్రాన్సిసువారు తన మాటల, చేతల ద్వారా సాక్షాత్తు క్రీస్తునే చూపించ గలిగినారని ఆయనతో సహవాసము చేసిన సహచరులు అనేవారని, ఆయన మాట్లాడుతుంటే క్రీస్తుతో ఆయన హృదయము పొంగి పొరలుతున్నట్లు సాక్షాత్తు క్రీస్తే మాట్లాదుతున్నట్లు అనిపించేదని పునీత బొనవెంతురు గారు అంటారు. ఈ అనంతమైన ప్రేమకు మూలము, ఆయన హృదయములో పెదవులపైన, చెవులలో, కళ్ళల్లో, చేతల్లో, ఆయన చూట్టు ఉన్నవారిలో క్రీస్తే ఉండేవాడు. ఆయన భోజన బల్ల దగ్గర కూర్చొన్నప్పుడు కొన్నిసార్లు క్రీస్తు నామమును స్మరించుకుంటూ, చివరికి తినడం కూడా మరచిపోయేవాడు. ఆయన ప్రయాణాలలో పవిత్రమైన దేవుని నామమును గురించి ధ్యానిస్తూ పాడుకున్నప్పుడు తనతో పాటు, పశు పక్ష్యాదులను దేవుని స్తుతించడానికి ఆహ్వానించేవాడు. ఇంకా పునీత బొనవెంతూరు ఫ్రాన్సిస్, క్రీస్తుకు అమర ప్రేమికుడని, ఆ రక్షకుడు నిజంగా ఆయన కళ్ళ ముందు ఉన్నట్లుగా తన అనుచరులకు స్ఫ్రుహ నిచ్చేవారు. అందులో సిలుపై ఉన్నక్రీస్తంటే ఆయనకు ఎనలేని భక్తి ప్రపత్తులు. ఈ ఆపారమైన ప్రేమవలన ఫ్రాన్సిస్ క్రీస్తు వలే శ్రమలను భరించాలని పూర్తిగా ఆయన వలె మారాలని కోరుకునేవారు. అనుకున్న విధంగానే క్రీస్తు ప్రభు తన పంచగాయాలను ప్రసాదించి తనలో భాగమయ్యే విధంగా ఆయనను దీవించాడు.

## 5.12. దివ్యసత్ర్పసాద ఆరాధకుడు

ఫ్రాన్సిస్ రక్షకుని గురించి మాట్లాడినప్పుడెల్లా ఆయన మనసులో దివ్యసత్ర్పసాదమును ఉద్దేశించి మాట్లాడేవాడు. ఆయన సేవ, అనుసరణ, ప్రేమ, దివ్య సత్ర్పసాదరూపంలో అత్యంత సన్నిహింతంగా ఉన్నక్రీస్తు నుండేనని చెప్పేవాడు. ఆయన పశువుల పాక, సిలువను కూడా ఇందులోనే కనుగొన్నాడు. ఇదిగో ఇందులోనే నా పవిత్ర గురువు యొక్క చివరి శ్వాస ఉంది. ఇక్కడ నుండే ప్రతి రోజు తన తండ్రి అప్పగించిన పనిని పరిపూర్తి చేస్తున్నాడు. ఈ దివ్య

సత్ప్రసాదమే నా ఆలోచనా శక్తి, బలము, విశ్వాసము, నమ్మిక నా గమ్యము. ఆయనకు ఈ దివ్యసత్ప్రసాదము ద్వారా, దివ్యసత్ప్రసాదమందు, క్రీసు యాదార్థ రూపమైనాడు. ఆయన జీవితమంతా ఈ దివ్యసత్ప్రసాదమే ప్రాముఖ్యమైన లక్ష్యం, గమ్యం.

## 5.13. సువార్త సేవకుడు

పునీత ఫ్రాన్సిసుగారికి సువార్త సేవంటే మక్కువ ఎక్కువ ఎందుకంటే ఆయనకు గమ్యాన్ని చూపించిన వ్యాకమే మత్తయి సువార్త 10:7-15 "పరలోక రాజ్యము సమీపించినదని ప్రకటింపుడు". ఇది క్రీస్తు ప్రభువు తన శిష్యులను సువార్త ప్రచారానికి పంపిన సంఘటన. ఏ విధంగా శిష్యులు వెళ్ళి, సువార్తను ప్రకటించారో అదే విధంగా ఫ్రాన్సిస్ కూడా అందులోని ప్రతీ పదము యొక్క పరమార్థాన్ని పాటించి, తన బోధన ద్వారా ఎంతో మందిని క్రీస్తు వైపునకు నడిపించాడు. ఆయన ఈ సువార్త ప్రచారాన్ని ఎన్ని కష్టాలు ఎదురైనా, సువార్త విలువలను, సువార్తను మాత్రము విడనాడలేదు. ఈ సువార్తను ఆయన తన జీవితం ద్వారా బోధించాడు. ఆయన బోధనకు కఠిన మనస్కులు కూడా మారి క్రీస్తు వైపు అడుగులేసేవారు. ఆయన బోధనలకు పామరులు సైతం క్రీస్తుని స్తుతించే విధంగా మార్చాడంటే ఆయన ఎంత సువార్తా ప్రచారకుడో అర్థం చేసుకోవచ్చు. ఆయన సువార్తా సేవ అమోఘం, స్మరణీయం.

## 5.14 .మరియ మాత భక్తుడు

ఫ్రాన్సిసుకు మరియ మాతంటే ఎనలేని ప్రేమ గౌరవం. అందుకనే ఆయన నిర్మించిన ఆలయాలకు ఆమె నామమే పెట్టేవాడు. ఆయన భక్తికి కోరికను మెచ్చి సన్మనస్కుల రాజ్ఞి ఫ్రాన్సిసుకు దివ్య దర్శనం ఇచ్చింది. అందులోమరియ మాత దేవదూతల సమేతంగా వచ్చిన యేసు ప్రభువు " దేవుని మహిమార్థం మానవరక్షణార్థం ఏదైన వరాన్ని కోరుకో అన్నారు. అందుకు ఫ్రాన్సిస్ "ప్రభూ, ఈ దేవలయాన్ని సందర్శించే ప్రతివారు పాపపరిహారాన్ని పొందేటట్టు అనుగ్రహించండి. మానవాళి మధ్యవర్తి జగన్మాత ద్వారా ఈ మనవి చేయుచున్నాను' అన్నాడు. అందుకు మద్ధతు ఇస్తున్నట్లు మరియ రాజ్ఞి క్రీస్తు ప్రభు ముందు తలను వంచింది. ఫ్రాన్సిస్ కోరికను మన్నిస్తూ ప్రభువు పెరుజియా వెళ్ళి జగద్గురువుల అనుమతిని కోరుకో, నీ కోరిక ఫలిస్తుంది" అన్నారు.

## 5.15. ప్రకృతి ప్రేమికుడు

ఫ్రాన్సిస్ ఎన్ని ఉత్తేజకరమైన ఉపన్యాసాలు ఇచ్చినప్పటికినీ ఆయన పక్షులకు ఇచ్చిన సందేశం మాత్రం సువర్ణక్షరాలతో లిఖించదగినది. సకల సృష్టికీ, సమస్త జీవరాసులకు మూలం ఒకే భగవంతుడు కనుక మానవులకూ పశు పక్ష్యాదులకూ, తారలకూ, సాగరాలకూ మధ్య తెగని బంధం ఉన్నట్లు ఫ్రాన్సిస్ భావించేవాడని పునీత బొనవెంతురు గారు అంటారు. విశ్వసృష్టిలో వివిధ గ్రహరాసులకూ, జీవరాసులకు మధ్య గల సంబంధాన్ని సృష్టికీ సృష్టికర్తకూ, మధ్య గల అనుబంధాన్ని దర్శించలేని వారి దార్మికత సమగ్రమైంది కాదు గదా! దేవుడు ఎంతో ప్రేమతో జీవరాసులను సృష్టించాడో పిచ్చుకలని సైతం ఉదారంగా పోషిస్తూ అడవి లిల్లీలను అలంకరిస్తూ,ఎలా ప్రవర్ధమానం చేస్తున్నాడో క్రీస్తు చాటి చెప్పారు కదా! మనిషి పాపం చేయక పూర్వం జీవులన్నీ అతనికి సన్నిహితంగా ఉండేవి కదా! అలాంటి సమగ్ర దృక్పథం కలిగి క్రీస్తు ఆత్మను శక్తిని నింపుకున్నవాడు. సంపూర్ణ మానవుడు కనుక ఫ్రాన్సిస్ ప్రకృతితో బాంధవ్యాన్ని ఎర్పరుచుకోగలిగాడు. ఎదోను వనంలో ఆదాము మాదిరి ఫ్రాన్సిస్ కూడా ప్రతిజీవినీ తన తోబుట్టువుగా భావించాడు. ఈ మహనీయమైన భావాన్ని పశు పక్ష్యాదులు సైతం గ్రహించి ఆయనకు చేరువయ్యాయి. ఆయన వాటితో సంభాషించిన సందర్భాలు చాలా ఉన్నాయి.

పునీత బొనవెంతూరు పదిహేనుకు పైగా ఈలాంటి సంఘటలను ఉద్ఘాటించారు. ఫ్రాన్సిసును ప్రేమతో అనుసరించే చిన్న కుందేలు ఫ్రాన్సిస్ ఆశీస్సులను కోరే రియేతి సరస్సులోని ఒక చేప, గట్టున ఉండే ఒక పక్షి, ఫ్రాన్సిస్ మరణాంతరం ఆహారాన్నే ముట్టని పిజెంట్ వేట పక్షి పోర్తియంకులలో తను పిలిస్తే వచ్చి తనతో పాటూ దైవ నామసంకీర్తన చేసే కీచురాయి, ఫ్రాన్సిస్ వెన్నంటి ఉండి ప్రార్థనల్లో కూడా పాల్గొనే గొర్రెపిల్ల ఇలా ఎన్నో మూగ జీవులు ఫ్రాన్సిస్ నేస్తాలైనాయి. ఈ గొర్రెపిల్ల నడి పూజ సమయంలో సాష్టాంగ పడేదట, మరియ మాత స్వరూపం దగ్గరకు వెళ్ళి మెల్లగా అరుపులు అరిచేదట. ఈ సంఘటనలన్నిటి కంటే ఫ్రాన్సిస్ మాట విని మనస్సు మార్చుకున్నతోడేలు వృత్తంతం అపూర్వమైనది.

## 5.16. సంఘ సంస్కర్త

ఫ్రాన్సిస్ జీవితం గురించి తెలిసిన వారందరూ ఆయనను కేవలము ఒక ఆధ్యాత్మిక నిధిగానే కాకుండా సంఘ సంస్కర్తగా కూడా వర్ణిస్తాడు. ఆయన తన బాల్యం నుండే ఈ యొక్క వ్యక్తిత్వాన్ని అలవరుచుకున్నాడు. ఆయన ఆపదలోనున్న వారికి సహాయం చేయడానికి ఎంతటి సహసానైనా చేస్తాడు. ఆయన అనాథలను, పేదలను, కుష్ఠ రోగులను ఆదరించుటలో ఒక బాధ్యత గల పౌరుడు సంఘంలో ఏ విధంగా ఉండాలో చేసి చూపించాడు. ప్రతిజీవీ దేవుని ప్రేమకూ, మహిమకూ దర్పణమని గ్రహించిన మొదటి పునీతుడు ఈయనే. ఆయన జంతుజాలం పట్ల చూపిన వాత్సల్యాన్ని వర్ణించడానికి మాటలు చాలవు. సమాజంలో పురుషులతో స్త్రీలు కూడా సమాన హక్కులు కలవని ఒక పేద కన్యల మఠం ఏర్పాటు చేయడం ద్వారా తెలియజెప్పాడు. ప్రజల మధ్య శాంతి దూతలా తిరిగుతూ ప్రేమ, సహనము, కరుణ కలిగి ఉంటే ఎంత ప్రశాంతమైన సమాజాన్ని నిర్మించ వచ్చునో చూపించి అస్సీసీ పూరాన్ని పావనపరిచిన మొదటి సంఘ సంస్కర్త ఫ్రాన్సిస్.

### ముగింపు

భక్తి జీవన మార్గంలో క్రైస్తవ విశ్వాసులు అనుసరించదగిన ఆదర్శ మూర్తులు, పవిత్ర మాతృకలు పునీతులు. యేసుక్రీస్తు ప్రభువు సాక్షాత్తు దేవుని కుమారుడని నమ్మి, తమ జీవన సిలువలను మోసుకుంటూ ఆయనను అనుసరించేవారు క్రైస్తవులు. ఇలా సిలువ మార్గంలో క్రీస్తు ప్రభువు అనుసరించటమంటే స్వార్థానికీ స్వప్రయోజనాలకు అతీతంగా జీవించటం, లోకానికి లౌకిక శక్తులకు తలవంచక, ప్రభువు అడుగుజాడల్లో ధైర్యంగా ముందంజ వేయడం, అంత సులువైనది కాదు. కానీ ఇక్కడే మనకు పునీతుల జీవితాలు దారిదీపాలవుతాయి. గత ఎనిమిది శతాబ్దాలుగా క్రైస్తవ ప్రపంచడానికి, ప్రభు క్రీస్తు అనుచరులకు స్ఫూర్తిప్రదాతగా నిలచి, ఆత్మ ప్రేరణతో నిత్యమూ పవిత్ర జీవనం గడపి, ప్రభు విధేయుడుగా జీవించి ఎదురయ్యే సవాళ్లను సిలువులుగా స్వీకరించి ఓర్పుతో భరించి, శ్రమలను సహించి, తండ్రి చిత్తాన్ని సంపూర్ణంగా నెరవేర్చిన పవిత్రమూర్తి పునీత అస్సీసీ ఫ్రాన్సిస్.

ఈయన ఇటలీ దేశంలో, అస్సిసీ పట్టణంలో 820 సంవత్సరాల క్రితం మనలాగే పుట్టి పెరిగిన మామూలు మనిషి. ప్రభుక్రీస్తు పిలుపును ఆలకించి, పిలుపు వెనుకగల సవాళ్లను సంతోషంగా స్వీకరిస్తు, ప్రభువుకు సంపూర్ణ విధేయులుగా జీవించిన ఫ్రాన్సిస్, క్రైస్తవ జీవితానికే సరికొత్త నిర్వచనాన్నిచ్చాడు. యవ్వన ప్రాయంలో లౌకిక వ్యామోహాల ప్రవాహంలో కొట్టుకొని పోతోన్న ఫ్రాన్సిసును ప్రభువు పట్టి ఆపి, సాన్ దమియానొ దేవాలయంలో అతడితో ముఖాముఖి మాట్లాడారు. నా ఆలయాన్ని బాగుచేయించుమని ప్రభువు అడుగుతున్నారేమోననుకున్నాడు ఫ్రాన్సిస్. అనేక కష్టాలుపడి గుడిని బాగు చేయించాడు. ఆ క్రమంలోనే అస్సిసీలోను, అన్యభూభాగాల్లోను కతోలిక సంఘాలను బాగు చేయగలిగాడు, శ్రీసభకు సరికొత్త దిశానిర్దేశం చేయగలిగాడు. అసలు ప్రభువు తనను చేయుమన్నపని ఇదికాదని, ప్రభు నిగూఢ దేహమైన శ్రీసభ పునరుద్ధరణమే ప్రభువు తనకు అప్పగించిన కర్తవ్యమని తెలుసుకున్నాడు ఫ్రాన్సిస్.

శ్రీసభ దారితప్పడానికి ప్రధాన కారణం లౌకికమైన సిరిసంపదలు భోగ భాగ్యాలేనని గ్రహించిన ఫ్రాన్సిస్ పేదరికాన్నే తన జీవన మార్గంగా ఎంచుకున్నాడు, తన నిరాడంబర జీవనంతో ప్రభు క్రీస్తుకు నిలువెత్తు సాక్షిగా నిలువగలిగాడు, సమకాలిక శ్రీసభను తిరిగి ప్రభుమార్గానికి మళ్లించగలిగాడు, ధన్యచరితుడయ్యాడు.

అంతేకాదు, మానవ మనుగడకు మానవజాతి సమగ్రవికాసానికి ప్రకృతీ పర్యావరణ పరిరక్షణ, సమస్త ప్రాణి కోటి సమాదరణ ఎంత ముఖ్యమో ఆనాడే చాటి చెప్పిన దార్శనికుడు, ప్రకృతి ప్రేమికుడు, విశ్వనరుడు పునీత అస్సిసీ ఫ్రాన్సిస్. ఈయన జీవించిన జీవితము మనందరికి ఒక దారిదీపము. కనుక ఆయన మార్గంలో పయనిస్తూ, ఇంకా అనేక మందిని మనతోపాటు క్రీస్తును చేరడానికి ప్రయత్నించుదాం.

❃ ❃ ❃ ❃

# ౨. పునీత లయోలపూరి ఇన్యాసివారి ఆధ్యాత్మికత మరియు ప్రస్తుత గురుత్వ జీవితంలో దాని ప్రాముఖ్యత

- బ్రదర్ సూరిపోగుల రవి



సామాన్యంగా జన్మించి, అ సామన్యంగా ఎదిగి, తమ చూట్టు ఉన్న ప్రపంచాన్ని మార్చి, చరిత్రలో చిరస్మరణీ యులుగా నిలిచిపోయిన మహానుభావులు కోకొల్లలు. వారి జీవితాలు, వారి ఆశయాలు మనకు ప్రేరణనివ్వాలి. వారిని స్ఫూర్తిగా తీసుకొని మనం కూడ ఆధ్యాత్మికత నాయకులుగా మారాలి.

యేసు ప్రభువు నిజమైన ఆధ్యాత్మిక నాయకుడు. ఆయన బోధనులు, స్నేహతత్పరిత అమోఘం, అజరామరం, ఆచారణాత్మకం. పునీత ఇన్యాసివారు క్రీస్తుని పోలి జీవిస్తూ, ఇన్యాసివారిలో ఉన్న ఉత్పాదన శక్తిని, సాధించే సత్తాను, మంచి చేసే మనస్సు క్రీస్తు ప్రభువు కోరకై ఉపయోగిస్తూ ఆయన ముందు ఉండి నడుస్తూ పదుగురిని సన్మార్గంలో నడిపించాలి అన్న దృక్పథం ఇన్యాసివారిలో ఎంతగానో ఉంది.

క్రీస్తు ప్రభువే సమస్త బాధలను తీరుస్తాడు. పునీత ఇన్యాసివారు తమ శత్రు సైన్యంలో యుద్ధంలో ఉన్నప్పుడు ఆయన కాలుకు బాణాలు తగిలినప్పుడు నిరాశ నిస్పృహలతో బాధపడుతున్న ఇన్యాసిగారికి క్రీస్తు భగవానుడు మానవుడు లోకమంతటిని సంపాదించి తన ఆత్మను కోల్పయిన లాభం ఏమున్నది? అను

ఈ వాక్కు ద్వారా ఇన్యాసిగారి జీవితములో ఒక చిరుదీపం వెలుగించాడు. సమస్తము క్రీస్తు వద్దే లభించిను అని గ్రహించి తన జీవితాన్ని నాటుకున్నాడు. సమస్తము క్రీస్తు వద్దే లభించిను అని గ్రహించి తన జీవితాన్ని క్రీస్తు ప్రభువుకు అర్పించాడు.

ఇన్యాసి వారు క్రీస్తు ప్రభువు ద్వారా పొందిన విజ్ఞానమును స్వేచ్ఛను,వినయమును, గౌరవము అన్ని కూడ ఆయన ఆచరిస్తూ, తాను స్థాపించిన యేసు సభ గురువులకు తన ఆధ్యాత్మికతలో ఉన్న ఔన్నత్యాన్ని చూపించాడు. పునీత ఇన్యాసివారి తమ అనుచరులను సహోదరులను క్రీస్తు ప్రభువు యొక్క సువార్తను ప్రకటించుటకు దేశ, విదేశాలు పంపించాడు. పునీత ఇన్యాసిగారు పొందిన ఆధ్యాత్మికత అంటే అనుచరులకు సువార్త పరిచయ సమాజంలో ఎదురైయ్యే ప్రజల సమస్యలు, కొందరు సహాయ హస్తం కోసం ఎందరో ఎదురుచుస్తున్నారు. కొన్ని కొన్ని పర్యాయాలు ప్రజలు మన నుండి ఆశించేటి ఓ చిరునవ్వు కావచ్చు, మన ప్రేమ కావచ్చు. మనం క్రీస్తు ప్రభువు నుండి వీటిని అన్నింటిని అలవరుచుకొని క్రీస్తు సువార్తను ప్రజలకు భోదించాలి. అలా బోధించాలంటే మనకు ఎంతో ఆధ్యాత్మికత అవసరం.

నేను నా పాఠ్యాంశమును మూడు అధ్యాయాలుగా విభజించాను. మొదటి అధ్యాయంలో  పునీత ఇన్యాసివారి ఆధ్యాత్మిక తర్ఫీదునందు తను ఎదిగిన పరిస్థితుల ప్రభావం, ఇందులో పుట్టిన పరిస్థితులు, రాజకీయ, సామజిక పరిస్థితులు, సంస్కృత పరిస్థితులు వారి బాల్య జీవితము, జననము, విద్యాభ్యాసము, కౌమారము దశ, సైనికుడుగా, దుర్ఘటన సన్నివేశాలు, తన పరివర్తనకు ముఖ్యకారణాలు, తల్లి, మిత్రులు, పుస్తకాలు, పవిత్ర గ్రంథము. రెండవ ఆధ్యాయంలో పునీత ఇన్యాసివారి ఆధ్యాత్మికతను కనుగొనుట. ఒక ఆధ్యాత్మికత నాయకుడు ప్రమాదము తర్వాత తనకు వచ్చిన కలలు, దేవుని మహిమ వలన ప్రపంచము దేవుని ఆధీనములో ఉండుట, దేవుని పిలుపునకు స్పదించుట, దేవునిలోనే తన ఆధ్యాత్మికతను కనుగొనుట. మూడవ ఆధ్యాయములో పునీత ఇన్యాసివారి ఆధ్యాత్మిక్త దాని ప్రభావం నేటి గురుత్వ తర్ఫీదులో ఏ విధంగా ఉండాలో వివరిస్తుంది.

## 1. పునీత ఇన్యాసివారి ఆధ్యాత్మిక తర్ఫీదునందు తాను ఎదిగిన పరిస్థితుల ప్రభావం

ప్రతి మనిషి ఎదుగుదలలో ఎన్నో పరిస్థితుల ప్రభావాలు ఉంటాయి. వారి పుట్టినప్పటి పరిస్థితులు, రాజకీయ పరిస్థితులు, సామాజిక పరిస్థితులు, సంస్క ృతిక పరిస్థితులు. పునీత ఇన్యాసి వారి ఆధ్యాత్మిక తర్ఫీదునందు తను ఎదిగిన పరిస్థితులు కూడ ఇవే. ఇన్యాసివారి జీవితములో వారి తల్లిదండ్రులు, మిత్రులు, పూర్వీకులు, పుస్తకాలు, పవిత్ర గ్రంథము వీరందరు పునీత ఇన్యాసివారి ఆధ్యాత్మిక ఎదుగుదలలో ఎంతగానో తోడ్పడ్డారు.

### 1.1. ఇన్యాసివారి పుట్టినప్పటి పరిస్థతులు

పునీత ఇన్యాసివారు ఓ ఉన్నత కుటుంబానికి చెందిన వ్యక్తి. వీరి తల్లిదండ్రులు ఉన్నత సంపన్నులు. అయితే వీరికి, కుటుంబ పరిస్థితులు చాలా సంతోషమును, ఆనందమును కలిగియుండవచ్చును.

### 1.1.1. రాజకీయ, సామాజిక పరిస్థతులు

అనాటి రాజకీయ పరిస్థితులు, సామాజిక పరిస్థతులు ఎంతగానో కనుబడుతున్నాయి. ఫ్రాన్స్ దేశపు సైన్యం, స్పెయిన్ దేశంను ఆక్రమించుకొనుటకు, ఎన్నో యుద్ధాలు, రాజకీయాలు చేస్తారు. ఈ రాజకీయ యుద్ధాలు వలన స్పేయిన్ లో ఉన్నటువంటి సామాజిక పరిస్థతులు భిన్నంగా మారాయి. ప్రజలలో ఆసహనం, కోపం, పగ మొదలైన దుష్ట గుణాలు మొదలైయ్యాయి. ప్రాంతీయ గొడవలు కూడ ఎన్నో జరిగాయి. సామాజిక పరిస్థితులు కూడ ఉన్నాయి. ఉదాహరణకు ఇన్యాసివారి తల్లి తన తండ్రికి వివాహముకు వరకట్నంను తీసుకొని వచ్చింది. 1600 బంగారపు గుండులను తీసుకొని వచ్చింది.

### 1.1.2. సంస్కృత పరిస్థితులు

ప్రతి ఒక్క దేశంలో సంస్కృత స్థితిగతులు ఉంటాయి. ఒక దేశంలో వంగి నమస్కారిస్తారు. మన దేశంలో రెండు చేతులు జోడించి పలకరించు కుంటారు. అదేవిధంగా ఇన్యాసివారి పుట్టినప్పటి సంస్కృతిక పరిస్థితులు స్పెయిన్ దేశంలోను ఉన్నాయి. ఆనాటి కాలంలో సంప్రదాయకంగా వివాహాలు జరిగాయి. ఇన్యాసివారి తల్లిదండ్రులు కూడ సంప్రదాయకం గానే వివాహంను చేసుకున్నారు.

ఇక్కడ మనం గమనించవలసిన విషయం ఏమిటంటే సంస్కృతిని ఎంతగానో ప్రేమిస్తున్నారు. పండుగలను, ఎంతో ఆనందంగా చేసుకునేవారు.

## 1.2. పునీత ఇన్యాసివారి బాల్య జీవితము

పునీత ఇన్యాసివారి బాల్యంలో ఎంతో అందంగా, సంతోషంగా ఉండేవారు. పునీత ఇన్యాసివారు గొప్ప వంశనందు జన్మించినవారు కావున వారి ముఖాలు చాయలతో పూర్ణంగా వెలుగుచుండెడిది. ఇన్యాసివారు బాల్య జీవితంలో వారి తల్లిదండ్రులకు ఎంతో వినయ విధేయతలను చూపేవారు. ప్రార్థనయందు ఎల్లప్పుడు ముందుగా ఉండి నడిచేవారు. పునీత ఇన్యాసివారి బాల్యంలో వారి తల్లిదండ్రులకు ఎల్లప్పుడు ప్రేమను చూపుతూ వారికి సహాయం చేసేవారు. ఇన్యాసివారు, వారి సన్నిహితులతో కూడి ఎంతో అణుకువను, ప్రేమను చూపించేవారు. ఎప్పుడు కూడ మంచి పనియందు ముందుగా ఉండి చేసేవారు.

### 1.2.1. పూర్వీకులు

ఇన్యాసివారు ఒక గొప్ప వంశపు కోటలో జన్మించారు. ఇన్యాసివారి పూర్వీకులు క్యాసిల్ అను రాజు దగ్గర తమ ఉదార బుద్ధితో సేవలను అందించారు. లయోల కుటుంబములోని పది దశాబ్దాలు తల్లిదండ్రులు మేయర్స్‌గా పిలిచేవారు. కాబట్టి ఆపూర్వీకులు రాజు కోటను ఎంతో ఉన్నత స్థానముగా భావించేవారు. ఇన్యాసివారి పూర్వీకులు తమ రాజుకు ఎప్పుడును విధేయతను చూపించేవారు. వారి తాత గారు వారి తండ్రి గారు అందరు రాజు గారు దగ్గర సైనికులుగా పని చేశారు. ఇతర సైనికులు వారి రాజ్యం మీదికి దండెత్తి వచ్చినప్పుడు ఇన్యాసివారి పూర్వీకులు ఎంతగానో వారితో యద్ధం చేసి, రాజు గారికి సహయంగా నిలిచారు. ఇక్కడ మనం వారి నమ్మకం, విధేయతను చూడాలి. అదే విధేయతను, వినమ్రతను, నమ్మకమును ఇన్యాసి వారు అనుసరించేవారు.

### 1.2.2. జననము

పునీత ఇన్యాసి గారు 1491 డిసెంబర్ 14వ తేదిన స్పెయిన్ దేశంలోని లయోలా అనబడు కోటలో జన్మించారు. వీరి తండ్రి డాన్ బెల్ట్రాన్, తల్లి మరియ. ఆ ఇద్దరు దంపతులు సన్మార్గవర్తనులును, వేదపారాణులగుట చూసి సర్వేశ్వరుడు

వీరికి గొప్ప పుత్ర సంతానమును ప్రసాదించినారు. వీరికి సర్వేశ్వరుడు ప్రసాదించిన సంతానము యొక్క సంఖ్య పదునొకండు. వీరిలో కనిష్ఠ పుత్రుడైన వారు ఇన్యాసివారు. ఇన్యాసివారు కనిష్ఠ పుత్రుడు కనుక మహా ఆడంబరములతో తమ తల్లిదండ్రులు దేవాలయమునకు తీసుకొని పోయి జ్ఞానస్నానము ఇప్పించిరి. ఆ జ్ఞానస్నానమందు వీరికి ఇచ్చిన పేరే ఇన్యాసివారు. ఇన్యాసివారు అందగాడు, ధైర్యశాలి. చిన్న ప్రాయమునందు మిక్కిలి చురుకును, సామర్థ్యమును, జ్ఞానమును కనుబరచుచుండిరి.

### 1.2.3. విద్యాభ్యాసము

ప్రతి ఒక్కరి జీవితములో విద్య అనేది ఎంతో గొప్ప స్థానమును కలిగి ఉంటుంది. విద్యను అభ్యసించుట వలన ప్రతి ఒక్క వ్యక్తికి మంచి, చెడు అను దాని మీద ఒక పట్టు ఉంటుంది. విద్యను అభ్యసించుట వల్లన ఎప్పుడు ఎలా ఉండాలి, ఎలా మాట్లాడాలి. ఎలా అణుకువ కలిగి ఉండాలి అని నేర్చుకుంటారు. కనుక ఇన్యాసివారి జీవితంలో కూడ విద్య ఎంతో గొప్ప స్థానమును కలిగియున్నది. ఇన్యాసివారి తల్లిదండ్రులు తమ బిడ్డలకు చదువుటకు, రాయుటకు మాత్రమే నేర్పించిరి కాని ఎక్కువ నేర్పలేకపోయిరి. వారి బిడ్డలను విద్య బోధించు ఆర్చ్య/ ఉపాధ్యాయల దగ్గరికి తీసుకొని వెళ్ళిరి. ఇన్యాసివారి ఆరివాలోలో విద్యను నేర్చుకొనటం వలన వారు ఎంతగానో మార్పు పొంది, ఒక వినయం గల వ్యక్తి గాను, గొప్ప విద్యావంతుడుగా పేరునుగావించెను. ఇన్యాసివారి విద్యాభ్యాసము వల్ల వీరు తమ పరివర్తన తరువాత స్థాపించిన యేసు సభకు ఎంతోగానో ఉపయోగపడింది. ఇప్పుడు యేసు సభ సభ్యులు విద్యకు ఎంతోగానో ప్రాముఖ్యతను ఇస్తున్నారు. వీరు విద్యను పూర్తిగా ఆభ్యసించి క్రీస్తు ప్రభువు యొక్క వాక్యమును బోధిస్తున్నారు. యేసుప్రభు సభ్యులు శ్రీ సభ ప్రతినిధి అయిన పరిశుద్ధ పాపుగారికి ఎంతోగానో తోడ్పడ్డారు. యేసు సభ గురువులు శ్రీ సభ పునః ప్రతిష్టను కల్పించి, పునరుద్ధరించి ప్రోటెస్టెంటు వారి సంస్కరణోద్యమాన్ని దిగ్విజయంగా ఎదుర్కొన్న మహా మనిషి. వీరు పరిశుద్ధ జగద్గురువు ఆధిపత్యానికి సంపూర్ణమద్దతును పలికిన కొండంత విశ్వాసి మన ఇన్యాసివారు.

## 1.2.4. కౌమారము (యవ్వన దశలో ఇన్యాసి వారికి దేవునితో గల సంబంధం)

కౌమారము ప్రతి ఒక్క మనిషి జీవితంలో ఉండే దశలో ప్రతి పురుష, స్త్రీ, అంగాలు/జ్ఞానేంద్రియాలు, పెరుగుతాయి. ఈ దశలో ప్రతి ఒక్కరికి, జ్ఞానమును తెలుస్తుంది. మంచి, చెడు అను విషయములు ప్రతి కౌమార దశలో ఉన్న వ్యక్తి వారి భక్తి అర్థము అవుతుంది. పునీత ఇన్యాసివారు కౌమార/ యవ్వన దశలో ఎంతో అందముగాను, ధైర్యశాలి, కాబట్టి వారి తల్లిదండ్రులు ఇన్యాసివారు రాజ వంశీయుడైనందున, ఇన్యాసి ఎన్నో యుద్ధాలు జయించి, పేరు ప్రఖ్యాతలు సంపాదించి పెట్టి గొప్ప దళాధిపతి కావాలని, ఆ తరువాత ఓ అందమైన రాజకుమార్తెని వివాహమాడి ఆనందంగా జీవితం సాగించాలని ఆశించారు. ఇన్యాసివారి మనసులో కూడ అదే ఉంది. కనుక ఇన్యాసివారు దేవునికి కూడ విధేయతను చూపించాడు. చిన్ననాటి నుండే ఇన్యాసి వారికి దేవునిపై భక్తి, విశ్వాసం ఉండేది.

## 1.2.5. సైనికుడుగా...

తండ్రి ఇన్యాసివారిని స్పానియా దేశపు రాజుగారి దగ్గర ఉంచారు. ఇన్యాసివారు అక్కడ కొన్ని రోజులు మాత్రమే ఉండిరి. ఎందుకంటే ఆ రాజు సమక్షంలో పనిలేక సుఖంగా ఉండుట ఇష్టం లేక, సైన్యంలో చేరి ప్రఖ్యాతి చెందవలెనని ఆశించిన రాజు సైన్యంలో చేరి, సమర్థులైన బంట్రోతులైనదిగాక, యుద్ధంలో శౌర్య వీరత్వములను చూపించిరి. ఆ కాలములో ఫ్రెంచి సైన్యమునకు స్పెయిన్ సైన్యములకు యుద్ధములు జరుగుతుండేవి. ఫ్రెంచి సైన్యము దండెత్తి వచ్చి పంపేవానియా అను పట్టణమును ముట్టడి చేసిరి. అప్పుడే ఆ కోటలో ఆయుధాస్థులై యుండిన ఇన్యాసివారు, తమ జనులు శత్రువులను జూచి భయపడి, వారలకు తమ్ము సమర్పింపవలసినదేగాని ఇతర మార్గములేదని ఎరిగి ఉండగా, అందుకు ఎంత మాత్రము సహింపక శత్రు సైన్యముపై ధైర్యముతో యద్ధమును చేయ ప్రారంభించారు. ఇక్కడ పునీత ఇన్యాసివారి ధైర్యసహసాలను మనము ఎంతోగాను చూడవచ్చును. తమ ప్రజలను రక్షించాలని తహతహలాడారు.

### 1.2.6. ఇన్యాసివారి జీవితంలో దుర్ఘటన దాని ప్రభావం

ఇన్యాసివారు ఒక గొప్ప సైనికుడుగా ఉండి స్పేయిన్ దేశపు ప్రజలను ఇతర సైన్యపు బాణాల నుండి కాపాడుతుండుగా, స్ఫేయిన్ దేశంలోని ఉత్తర భూభాగంపై దండెత్తి వచ్చి ఎదురొచ్చిన పట్టణాలన్నింటిని జయించుకొంటు పాంపెలూనా నగరం ముట్టడించి అక్కడి కోట పైకి పురోగమించాయి. ఈ కోట సంరక్షణలో ఉన్న ఇన్యాసి తన సైన్యాన్ని ప్రోత్సహిస్తూ గొప్ప పోరుసల్పాడు. ఫ్రెంచివారు పేల్చిన తుపాకీ గుండు ఇన్యాసివారి కుడి మోకాలు దిగువన తగలి నేలపై కూలిపోయారు. ఇన్యాసిగారిని 50మైళ్ళ దూరంలో నున్న వారి తండ్రిగారి వద్దకు తీసుకొని పోయారు, ఇన్యాసిగారి తండ్రి తనను అంత దీన స్థితిలో చూచి కృంగిపోయాడు. ఇన్యాసిగారి తండ్రి తనను వైద్యులు దగ్గరకు తీసుకొనపోగా, వారు ఇన్యాసివారిని పరిశోధించి చూచినగాని ఎముకలు కదలి ఒక దానికొకటి చేరికలేక యుండటను కనుగొనిరి. ఆ కాలుని గుణపరుచుటకు తిరిగి కోయవలసియుండెను. ఇన్యాసివారు ఈ కఠిన బాధ వలన మిక్కిలి క్షీణించి కడన మహా సంకటమైన అవస్థలో నుండిరి. వీరిని చూచిన వైద్యులు కొన్ని దినములలో మృతి చెందుతారాని చేప్పారు. వీరి తండ్రి ఇన్యాసిగారికి చివరి అవస్థాభ్యంగ సాంగ్యమును ఇప్పించిరి. అవస్థాభ్యాంగ సాంగ్యమును స్వీకరించిన తరువత ఇన్యాసివారు మరింత కృంగిపోయేను. ఆయనను చూచిన ప్రజలు వీరు తొందరులోనే పరలోక ప్రాప్తినొందుతారని చెప్పుకొనుచుండిరి. ఈ లోకంలోని వైద్యులుకు సాధ్యం కాని ఈ వైద్యము అర్థ రాత్రి ఇన్యాసివారి కలలో పునీత పేతురుగారు కనిపించి ఇన్యాసివారి గాయములను కొంచమైనను లేకుండా ఆయన తన హస్తములతో వారిని తాకెను. ఇన్యాసిగారు పూర్ణ ఆరోగ్యము పొందెను. ఇన్యాసివారి సంకటం నయము అవుటను చూచి ప్రజలందరు మిక్కిలి అతిశయపడిరి. ఇదియే ఇన్యాసివారి జీవితములో జరిగిన దుర్ఘటన దాని ప్రభావంతో ఇన్యాసివారు పూర్తిగా స్వస్థతపొందెను. కాని వీరు నడుచుటకు వీలు పడలేదు. వీరి కాలు వంకరగా మారెను. ఆయనను సహనంతో సహించి జీవించుచండెను.

### 1.3. పునీత ఇన్యాసివారి పరివర్తనకు గల ముఖ్య కారణాలు

ఇన్యాసివారి జీవితంలో పరివర్తనకు గల కారణాలు. స్పేయిన్, ఫ్రెంచి సైన్యం యుద్ధంలో జరిగిన సంఘటన. వారి కాలుకుగల గాయము పూర్తిగా

నయము అవుట ఒక ముఖ్య కారణం. ఇన్యాసివారి జీవితములో కూడ తల్లి, మిత్రులు, పుస్తకాలు, పవిత్ర గ్రంథము ముఖ్య పాత్రలు పోషించాయి.

### 1.3.1. తల్లి

ప్రతి ఒక్కరి జీవితములో తల్లి ఎంతో ముఖ్య పాత్ర పోషిస్తారు. తన గర్భంలో ఎదుగుతున్న బిడ్డ నుంచే, నా బిడ్డ ఎలా ఉండాలి. ఆ బిడ్డను ఎలా పోషించాలి, ఎలా నడిపించాలి అని తల్లి తహతహలాడుతుంది. క్రీస్తు ప్రభువు విషయమందును తల్లి మరియమాత ఎంతో శ్రద్ధను కనబరిచింది. తల్లి మరియమాత తన కూమారుడి జననము నుండి తన మరణము వరకు ఎల్లప్పుడు కూడ వెన్నటుంది. ఈ లోకంలోని ప్రజలకు రక్షణ తెచ్చుటకు ఎంతో తోడ్పంది. మరి పునీత ఇన్యాసి జీవితంలో కూడ తన తల్లి ఆదే పాత్రను కనబరిచి యుండవచ్చును. పునీత ఇన్యాసిగారి తల్లి ఒక ఉన్నత కుటుంబము నుండి వచ్చినది, కాబట్టి మరీముఖ్యముగా వీరు కతోలిక చర్చికు సంబంధించిన వారు. తల్లి నేర్చుకున్న విషయాలను, విశ్వాసమును, ప్రేమ తన పిల్లలకు రావాలని తలంచియుండవచ్చును. పునీత ఇన్యాసిగారి తల్లి తనను ఆధ్యాత్మికత నందు నడిపించింది అనుటలో ఎంత మాత్రం అతిశయోక్తిలేదు. వీరు ఉన్నత కుటుంబమునకు చెందిన వారు కాబట్టి ప్రతి ఆధ్యాత్మికత విషయంలో పాలుపంచుకొని యుండవచ్చును. ఇన్యాసిగారి తల్లి ఆధ్యాత్మికత యందు మార్పు పొందుటకు ఎంతగానో సహాయపడియుండవచ్చును.

### 1.3.2. మిత్రులు

ఒకరితో స్నేహం చేయడమంటే వట్టినే మాటలు చెప్పడం కాదు. ఇతరుల పట్ల ఆదరణా, ప్రేమ చూపినప్పుడే అది స్నేహం అవుతుంది. స్నేహితులకు ఒకరి పట్ల ఒకరికి ఇష్టము, సానుభూతి, సహాయం చేసే గుణాలు ఉంటాయి. ఈ గుణాలు క్రియా పూర్వకంగా కనిపిస్తాయి కూడ. స్నేహం ముదరడానికి కొంతకాలం పడుతుంది. కాని అది ముదిరాక ఇద్దరినీ వృద్ధిలోకి తీసుకవస్తుంది. కాని మైత్రి ఎప్పుడు క్రియా పూర్వకంగా ఉండాలి. మంచి మిత్రులు మంచి మందులాంటివారు. మంచి మిత్రులులతో కలిసి పయనిస్తే, మన జీవితయాత్ర

పొడవు పెరుగుతుంది. మన హృదయాన్ని అర్థం చేసుకొనే హ ృదయం మరొకటుండాలి. మన చేతులతో కలసి పని చేసే చేతులు మరికొన్ని ఉండాలి. మంచి మిత్రులు ఒకరినొకరు చక్కదిద్దుకొంటారు. ఒకరి లోపాలు ఒకరు సరిదిద్దుకొంటారు. నా వల్ల నా స్నేహితుడూ, అతని వల్ల నేనూ ఉత్తములుగా మారాలి అని ప్రాధేయపడుతుంటారు. పునీత ఇన్యాసివారి జీవితంలో కూడ మిత్రులు ఎంతగానో అధ్యాత్మికత యందు తోడ్పడ్డారు. ఒకరియెడల ఒకరు అర్థము చేసుకొని, ఇన్యాసివారిని ఒక ఆధ్యాత్మిక వ్యక్తిగా మలిచారు. ఇన్యసివారు తన జీవితమునే పూర్తిగా మార్చుకొని, ప్రభు మార్గం వైపు అడుగులు వేయుటకు మిత్రులు ఎంతగానో తోడ్పడ్డారు.

### 1.3.3. పరివర్తనకు కారణాలు

జీవితంలో కొన్నిసార్లు విషమ సంఘటనలూ ప్రతికూల పరిస్థితులు ఎదురౌతాయి. అవి మనకు చెరువు చేసినట్లు కనిపిస్తాయి. మనం సహనం కోల్పయి ఆ సంఘటనల యెడల బాధపడతాము. కాని చివరన అవి మనకు మేలే చేసిపెడతాయి. పునీత ఇన్యాసివారి జీవితంలో పరివర్తనకు గల ముఖ్యకారణం. ఆయన ఫ్రెంచి, స్పెయిన్ సైన్యాలుయుద్ధం జరుగుతున్నప్పుడు తన కాలుకు తగిలిన తుపాకి బుల్లెటు తన జీవితంలో మారని మచ్చగా నిలిచింది. కాని ఆదే తన పరివర్తనకు ముఖ్యకారణం అయ్యింది.

### 1.3.3.1. పుస్తకాలు

పుస్తకాలు ప్రతి ఒక్కరి జీవితములో ఉపయోగపడుతాయి. నీవు పుస్తకాలు ఎందుకు చదువుతారు అని చాలా మంది అడుగుతుంటారు. ఒకరికి ఒకరు అందించే విద్య వలన, పుస్తకాలు చదవటం వలన జ్ఞానం పెరుగుతుంది. మంచి పుస్తకాలు మనకు శీలాన్ని నేర్పుతుంది. మన వ్యక్తిత్వం వృద్ధి చెందేలా చేస్తాయి. ఆ పుస్తకాలు అందించే విద్య వలన మన తెలివి తేటలు పెరిగి, మన నాగరికతను వ ృద్ధి చేస్తాయి. మనలో దాగియున్న శక్తి సామర్థ్యాలను అభివ ృద్ధి చేసుకొనేలా చేస్తుంది. పుస్తకాలు అందించే విద్య వలన మన బాధ్యతలను ఎరిగింపచేస్తుంది. పునీత ఇన్యాసివారి జీవితంలో కూడ ఎంతో మార్పు చేకూర్చాయి. పునీత

ఇన్యాసివారు యుద్ధంలో గాయపడి, అసుపత్రిలో వైద్యము స్వీకరించిన తరువాత ఒక నెల పాటు మంచాన ఉన్నప్పుడు, అక్కడ ఉన్న వైద్య సిబ్బందిని అతనికి కొన్ని పుస్తకాలు ఇవ్వండి అని అడిగినప్పుడు, వారు కొన్ని పునీతుల పుస్తకాలను, పవిత్ర గ్రంథమును అందించారు. అవి అతను మార్పు పోందేలా చేస్తాయి.

### 1.3.3.2. పవిత్ర గ్రంథము

పవిత్ర గ్రంథము క్రైస్తవులకు జీవన నాడి/ క్రైస్తవులు విశ్వసించే ముఖ్యమైన గ్రంథము. పవిత్ర గ్రంథము పఠించడం వలన మత విశ్వాసం బలపడుతుంది. పవిత్ర గ్రంథము క్రీస్తు ప్రభువు శ్రమ, మరణ, పూనరుత్థానం గురించి, క్రీస్తు ప్రభువు ఈ లోకంలో చేసిన అద్భుతాలు, బోధనలు గురించి తెలియజేస్తుంది. పవిత్ర గ్రంథము క్రైస్తవులైన మనకు విశ్వాసమునకు పునాదిలాంటిది. పవిత్ర గ్రంథము అంటేనే క్రీస్తు ప్రభువుని గురించి, తండ్రి దేవుని కృపావరములను గురించి బోధిస్తుంది. పునీత ఇన్యాసివారు బాధలలో మంచాన ఉన్నప్పుడు, అయన పఠించి, తన హ ృదయానికి అనువదించుకున్నాడు. ఇన్యాసివారి జీవితాన్నే ఈ పవిత్ర గ్రంథము మార్చేసింది. అదే ఈ వాక్యము "మనిషి లోకము అంతటిని సంపాదించి చివరికి తన ప్రాణము కోల్పయిన లాభమేమి?" ఇన్యాసి వారు ఈ వాక్కును తన పరిపూర్ణ పరివర్తనకు ఒక నాందింగ మారింది. అదే వాక్కు క్రీస్తు ప్రభు మార్గము వైపు అడుగులు వేసేలా చేసింది. చివరికి తన సువార్తను ప్రపంచ నలుమూలలా వ్యాప్తి చేయుటకు ఇన్యాసివారిని పవిత్ర గ్రంథము నడిపించింది.

## 2. పునీత ఇన్యాసివారు ఆధ్యాత్మికతను కనుగొనుట

పునీత ఇన్యాసివారు జీవితములో ఆధ్యాత్మికత అనేది ఒక ముఖ్యమైన ఘటన. ఇన్యాసివారు ఆధ్యాత్మికతలో, తమ భావ గర్భితమైన జీవితము నుండి ప్రభువు వైపు అడుగులు వేయటం మొదలుపెట్టాడు. ఆధ్యాత్మికత అంటే ఎవరికి వారే స్వేచ్ఛగా బాధ్యతాయుతంగా దైవ సంకల్పనానికి అనుగుణంగా స్వయం నిర్ణయాలు తీసుకోనే దశకు చేరుకోవడాన్ని ఆధ్యాత్మికత అంటారు. ఆధ్యాత్మికత రహస్యాలను తనకు తాను తెలుసుకుంటు దేవుని సేవలో ఎదగడానికి ఎంతగానో

తోడ్పడుతాయి. పునీత ఇన్యాసిగారు కనుగొన్న ఆధ్యాత్మిక సహవాసం, తనను తన సాటి వారినీ దేవునికి మరింత దగ్గరగాను సన్నిహితులను చేస్తుంది. దేవుని యందే తన యథార్థమైన స్వేచ్ఛను పొందుతారు.

## 2.1. అధ్యాత్మికత నాయకుడు

ఒక నాయకుడు అంటే తను సక్రమైన మార్గంలో నడుస్తు పదుగురిని అదే సక్రమమైన మార్గంలో నడిపించేవాడే నిజమైన నాయకుడు. మరి నాయకుడు పుట్టుకతోనే నాయకత్వ లక్షణాలు ఉన్న వారు కాదు. కాని వారు అంతరంగ విశ్లేషణతో బాహ్య ప్రపంచాన్ని పరిశీలించి,తెలుసుకొని అనుభవంతో నాయకత్వ జ్ఞానాన్ని సంపాదించుకుంటారు. మంచి నాయకులు నాయకత్వానికి అవసరమైన సుగుణాలను ఆయా పరిస్థితులను బట్టి అలవరుచుకోగలుగుతారు.

## 2.2. పునీత ఇన్యాసివారి భావగర్భతమైన జీవితము

పునీత ఇన్యాసగారి జీవితము వెలుతురు, చీకటి వంటిది. పునీత ఇన్యాసిగారు తాను యుద్ధ సమయంలో గాయపడిన జీవితము చీకటి గల జీవితము. అయితే ఈలాంటి భావగర్భమైన జీవితము ప్రతి ఒక్కరి జీవితంలో ఉంటాయి. కాని పునీత ఇన్యాసివారి జీవిమంలో మాత్రమే అది వ్యతిరేకంగా ఉంది. ఎందుకంటే తాను గాయపడిన తరువాత కనుగొన్న జీవితము తన భావగర్భతమైన జీవితమును మరచిపోయారు. చివరికి క్రీస్తు ప్రభువుని తన తండ్రిగా స్వీకరించారు. ఈ భావాగర్భమైన జీవితమే ఆయనను పూర్తిగా మార్చేలా చేసింది. పునీత ఇన్యాసివారు తను పొందిన ఆధ్యాత్మికత వలన మరో క్రీస్తు ప్రభువు వలె మారిపోయారు. తన అనుచరులను నడిపించుటకు ఇన్యాసివారి మాటలు తన లక్ష్యమైన క్రీస్తు ప్రభువును వ్యక్తపరిచాయి. తన అలోచనలు తమ గమ్యమైన క్రీస్తు ప్రభువు వైపు వేస్తూ, తన క్రియలు క్రీస్తు లక్ష్యంపై ఉంటుంది. పునీత ఇన్యాసివారు తను గాయపడిన జీవితంలో ఆగిపోక ప్రభువు వైపు పరుగులు వేయటం మొదలు పెట్టారు. చివరికి తన అనుచరులను కూడ క్రీస్తు ప్రభువు వైపు మలిచేలా తన వ్యక్తిత్వము, ఆధ్యాత్మిక జీవితము ఎంతగానో తోడ్పడింది.

## 2.3. పునీత ఇన్యాసివారు ఆధ్యాత్మికతలో 10 ముఖ్యమైన సూత్రములు

పునీత ఇన్యాసివారి ఆధ్యాత్మికతలో 10 ముఖ్యమైన సూత్రములు: అవి ఇన్యాసివారు ప్రమాదమునకు గురియైన తరువాత పొందిన స్వప్న కలలు, దేవుని మహిమ వలన సమస్తము దేవుని ఆధీనములో ఉండుట, దేవుని పిలుపునకు స్పదించుట మెదడకు తెలియని విషయాలను హృదయము తీర్చగలదు. తనలో తాను స్వేచ్ఛను కలిగియుండుట. తనకు తానే పరిశోధకుడు, ప్రత్యేకమైన ఆధ్యాత్మికత, పనిలోను ధ్యానించుట, మనము ఇతరులను రక్షించుట, ఇవి అన్ని పునీత ఇన్యాసివారి జీవితమును, తమ ఆధ్యాత్మక ఎదుగుదలలోను ఎంతోగానో దోహదపడ్డాయి.

### 2.3.1. ఇన్యాసివారు సిపాయిగా ప్రమాదమునకు గురియైన తరువాత వచ్చిన స్వప్న కలలు

పునీత ఇన్యాసి అనుభవము మీదనే పునీత ఇగ్నేషియన్ ఆధ్యాత్మికత ఏర్పడింది. పునీత ఇన్యాసివారు తాను పొందిన ప్రమాదమునుండి బయటపడిన తరువాతనే, క్రైస్తవుల విశ్వాసము బలపడింది. పునీత ఇన్యాసి వారే యేసు సభను స్థాపించారు. పునీత ఇన్యాసివారి యొక్క ఆధ్యాత్మిక జీవితమే, ఇతరులలో ప్రేమానురాగాల సంబంధాలు, దేవునితో ఐక్యత ఏర్పడింది. పునీత ఇన్యాసివారి యొక్క నిజజీవితము యొక్క సంఘటనలే ఇగ్నేషియన్ ఆధ్యాత్మికత బలపడింది. ఇగ్నేషియన్ ఆధ్యాత్మికత అనేది ఒక వెలుగుజీవితములు వలె ఉత్తేజపరుస్తుంది. పునీత ఇన్యాసివారు తాను సిపాయిగా పొందిన ప్రమాదములో తన కాలుకు గాయము మానదు అని చెప్పిన వైద్యులు, పునీత పేతురు గారు దేవుని నామమున వచ్చి పునీత ఇన్యాసి వారిని తన హస్తములతో తాకి స్వస్థత పొందాడు. అయితే ఇతరులు ప్రతిరోజు కలలు కంటారు. కాని పునీత ఇన్యాసివారు పొందిన కల ఇన్యాసివారి జీవితమునే మార్చివేసింది. చివరకు తను దైవసేవకుడుగా దేవునితో ఉండి దేవుని యెడల దైవభక్తిని కనబరుస్తూ, అనేక భయంకరమైన దురిత బాధలననుభవించుచూ దేవుని మార్గమునే, తన జీవిత మార్గముగా ఎంచుకొని ప్రయాణించటం ప్రారంభించారు. తను కలలో గాంచిన దేవుడే నన్ను ఎన్నుకొని ఉంటాడు అని తలంచి, ఇన్యాసివారు తన ఆధ్యాత్మికతను పెంపొందించుకున్నాడు.

### 2.3.2. దేవుని మహిమ వలన ప్రపంచము దేవుని ఆధీనములో ఉండుట

దేవుడు సృష్టిని ఆయన ఆధీనములో ఉంచుకున్నాడు. ఆది కాండములో దేవుడు విశ్వమును, మనుష్యులను సృజించాడు. ఇగ్నేషియన్ గారి ఆధ్యాత్మికత అనేది దేవుని అధీనములో ఉన్నది. పునీత ఇన్యాసి వారి ఆధ్యాత్మికత ప్రకారం దేవుడు ఎల్లప్పుడు కూడ పని చేస్తూ అన్ని చోట్ల ఉంటాడు అని నమ్మతాడు. పని చేసే సమయంలో దేవుడు మనల్ని తన ఆధీనంలో ఉంచుకుంటాడు అని ఎటువంటి బాధలు కలుగవని చెప్పుతాడు. సంబంధాలను అనుఅబంధాలను ధృడ పరుచుటకు దేవుడు తన ఆధీనంలో ఉంచుకుంటాడు. ఈ సంస్కృతిక, నైపుణ్యాలను కలిగియాన్నా వాటిలోను మనము విజ్ఞానము సంపాదించుకోనుటలోను, ఈ సృష్టి అంతా తన ఆధీనములో ఉంటుంది అని వారు చెప్పుతాడు. పునీత ఇన్యాసి వారు బోధించే విషయాలను ఆధ్యాత్మికత కలిగియుండాలని, ఇన్యాసివారు తమ అనుచరులకు బోధించే ఆధ్యాత్మికత. దేవుని మహిమ వలన ప్రపంచము ఆయన ఆధీనములో ఉంది. మరి మనము ఆయనకు చోటును కల్పించాలంటే ఈ సృష్టిలో తిరిగి ఆయనకు మన ప్రేమ ద్వారా, దేవునిలో ఎదగాలి అని దేవుడు మనకు ప్రసాదించిన ప్రేమను తిరిగి ఆయనకే చెల్లించాలని ఇన్యాసివారు చెప్పుతున్నాడు. పునీత ఇగ్నేషియన్ ఆధ్యాత్మికతలో దేవుని యొక్క స్థానం ఎల్లప్పుడు ఉంటుంది. పునీత ఇన్యాసివారు చెప్పినట్లుగా ప్రతి రోజు కార్యక్రమములు దేవుని అంచెలు అంచెలుగా మన హృదయాలలో పదలిపరుచుకోవాలని అని అంటాడు. దేవుడు మహిమ మనల్ని అహ్వానిస్తూ దేవునిలో లోతుగా ఎదుగుతూ ఉండాలి అని ప్రభవు మార్గము గుండా అడుగులు వేస్తూ మన ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి అని పునీత ఇన్యాసివారు పొందిన అనుభూతి వలన ఆధ్యాత్మికతను మనకు తెలియజేస్తున్నాడు.

### 2.3.3. దేవుని పిలుపునకు స్పదించుట

మనం పవిత్ర గ్రంథములో చూస్తే ప్రభువు ఆది కాలము నుండి ఎంతో మందిని పిలిస్తున్నాడు. అబ్రహాము, ఇసాకు, యాకోబు, మోషే ప్రవక్త, ఇంకా ఎంతో మందిని పిలిచాడు కాని ఆ దేవుని పిలుపునకు స్పందించినది కొందరే. వారికి ఎన్నో కష్టాలు, నష్టాలు/ బాధలు వచ్చినా ఆ పిలుపును అలకించారు, చివరకి ప్రభువు మార్గానుసారముగా ప్రయాణించారు. పునీత ఇన్యాసివారి

జీవితములో ప్రభువు గాయపడిన తరువాత తన పిలుపునకు గల అంతర్యామిని జ్ఞానమును తనకు బోధించాడు. పునీత ఇన్యాసివారి ఆధ్యాత్మికత అనేది, దేవుడు ఎల్లప్పుడు, ఇప్పుడు పిలుస్తున్నాడు, ఆయన తన తండ్రి పనిలో నిమగ్నమై ఉన్నాడు. మరి మనము తన పిలుపునకు స్పందించుచున్నామా! పునీత ఇన్యాసివారు చెప్పినట్లుగా మనము ఎల్లప్పుడు కూడ ప్రభువు పిలుపునకు స్పందిస్తూ ఉండాలని మరి చెబుతున్నాడు. ఆదే విధంగా మన ఆధ్యాత్మికత జీవితమును ఒక చక్కని ప్రణాళికను ఏర్పాటు చేసుకొని ప్రభువు మార్గంలో ఇన్యాసివారు నడిచిన బాటలో నడవాలని బోధిస్తూన్నారు. పునీత ఇన్యాసివారి వలె చక్కని వివేకమును, విజ్ఞానము కలిగి దేవుని పిలుపునకు స్పందించాడు. పునీత ఇన్యాసి వారు తన పిలుపును తనతో ఆపకుండా తన అనుచరులకు ఆ ప్రభువు పిలుపును తెలియజేసారు. వారి జీవితములో కలిగే మానసిక, శరీరక, వ్యసనాలనుండి బయటపడేలా దేవుని పిలుపు యొక్క గొప్పతన్నాన్ని తెలుసుకోవాలని పునీత ఇన్యాసివారు తన అనుచరులకు చెపుతున్నాడు. ఎప్పుడైతే వారు తమ జీవితంలో ఈ లోకపు ఆశలనుండి మానసిక బాధల నుండి బయటకు వస్తారో అప్పుడే పూర్తిగా దేవుని పిలుపునకు స్పందిస్తారు అని తన ఆధ్యాత్మిక జీవితము ద్వారా వ్యక్తపరుస్తున్నాడు.

### 2.3.4. మెదడకు తెలియని విషయాలను హృదయము తీర్చగలదు.

మనిషిలో విశిష్టమైనది విచక్షణా శక్తి. ఇది మనిషి ఔన్నత్యాన్ని బహిర్గతం చేస్తుంది. ఈ విచక్షణ మనిషి ఆలోచనకు పునాది. మనుషులు ఏమి ఆలోచిస్తారో దానిని క్రియా రూపంలో చేపడాతారు. మంచి ఆలోచనలు హ ృదయం నుండి వస్తాయి. హృదయం నుండి వచ్చే ఆలోచనలు వలన మనుష్యులు సత్క్రియలు చేపట్టడం ద్వారా సమాజానికి ఆనందం కలిగిస్తారు. పునీత ఇన్యాసివారి జీవితములో మెదడు తీర్చలేని కొన్ని ఆలోచనలు హ ృదయము తీర్చింది. పునీత ఇన్యాసివారి ఆధ్యాత్మికత వారి ఉత్తేజమైన జీవితము నుండి వెలువబడినది. అవి ఏమిటంటే ఇన్యాసివారి ప్రార్ధనా జీవితము వారి హృదయములో కలిగే భావోద్వేగాలు, సేవ చేయుటకు తనకు ఉన్న ఒక ఉద్రేకమైన జీవితము, ప్రేమ కలిగిన సేవ చేయు తత్వము. పునీత ఇగ్నేషియన్ ఆధ్యాత్మికతలో ముఖ్యమైన విషయం, సమస్యలు వచ్చినప్పుడు మనం మెదడుతో అలోచించకుండా

హృదయంతో ఆలోచిస్తే అ సమస్యలకు పరిష్కారం తొందరగా దొరుకుతుంది. మన సమస్యలు అని ఆత్మ విశ్వాసముతో ముందుకు వెళ్ళినప్పుడు వాటిని తీర్చగలము. ఎప్పుడైతే మన సమస్యలు నుండి బయటకు వస్తామో అప్పుడు మనం హృదయంతో ఆలోచిస్తూ దేవునికి ప్రీతికరమైన సేవను చేస్తాము అని పునీత ఇన్యాసివారు బోధిస్తున్నాడు. హృదయంతో మనము చూస్తే మనము ఇతరులకు పరోక్షంగా గానీ, ప్రత్యక్షంగా గానీ, చెడును తలపెట్టాలని అనుకోము. కాని మెదడుతో ఆలోచిస్తే కొన్ని సందర్భములో తప్పులు చేయవచ్చును గాని హృదయముతో ఆలోచిస్తే ఎందుకు, ఏమిటి అని మనం ఆలోచిస్తాము. అన్ని బాధలకు మన హృదయము సమాధనము చెప్పగలరు. హృదయముతో మనం ఆలోచించినప్పుడు మన శరీరానికి, ఆత్మకు శక్తి వస్తుంది.

### 2.3.5. తనలో తాను స్వేచ్ఛను కలిగియుండుట

కొంతమంది ఇతరుల అందచాందాలతోను, తెలివితేటలతోను, విజయాలతోను పోల్చుకొని మనం వాళ్ళలాగ లేమని బాధపడుతారు. మన అసంతృప్తిలో విచారంలో చాల భాగం ఈ పోలిక వలనే విచారం కలుగుతుంది. చిన్న అద్దంలో చూచుకొంటే ముఖం చిన్నదిగా కన్పిస్తుంది. అలాగే ఇతరులతో పోల్చుకొంటే మనం వాళ్ళలా లేమని చిన్నపోతాం. ఈ పోలిక వల్ల ఎలుక బోనులో చిక్కుకున్నట్లుగా అపాయములో చిక్కుకొంటాం. మన ఆత్మవిశ్వాసం ఉత్సాహం నశించి నీరస భావాల్లో చిక్కుకొంటాం. ప్రతి నరుడూ తనకు తానే సాటి. మనం మరొకరిలాగే ఉండకుడదు. వుండలేము కూడ. ఎప్పుడూ మన వ్యక్తిత్వానికి స్వేచ్ఛను నిలబెట్టుకోవాలి. నేను ఇతరుల కంటే తక్కువ వాణ్ణి కాదు, వారి కంటే భిన్నమైన వాణ్ణి మాత్రమే అని అనుకోవాలి. మనలో మనం స్వేచ్ఛను కలిగియుండాలి. పునీత ఇన్యాసివారి ఆధ్యాత్మికత, ప్రత్యేకంగా, గట్టిగా చెప్పే విషయం. అంతరంగ స్వేచ్ఛను కలిగియుండాలిని బోధిస్తుంది. మనం వ్యక్తులుగా మనలో ఉన్న ఇహలోక బాధలు, సమస్యలు, నుండి దూరంగా ఉండాలని మనకు పునీత ఇన్యాసివారు బోధిస్తున్నారు. మనం మన మనస్సులను, శరీరములను, మనం ఆరోగ్యం మీద గాని, సంపద మీద గాని, మన నైపుణ్యత మీద గాని, అనైపుణ్యత మీదగాని, లేక, కొద్దికాలము జీవితము గాని లేక యుగాంతర కాలము మీద గాని

ఆధారపడకూడదు. పునీత ఇన్యాసివారి యొక్క నైతిక విలువలు, ఆధ్యాత్మిత ఏమిటంటే ఒక వ్యక్తి తనకు తానే స్వేచ్ఛను కలిగియుండుట. తమ సంపూర్ణమైన హృదయంతో దేవునికి సేవ చేయాలని పునీత ఇన్యాసివారు గారు బోధిస్తున్నారు. తనలో తాను స్వేచ్ఛను వెతికినప్పుడే. దేవున్ని కూడ చూస్తారు. ఎప్పుడైతే తన గురించి పూర్తిగా తెలుసికొంటాడో అప్పుడే తనను సృష్టించిన సృష్టికర్తను గూర్చి కూడ అలోచిస్తాడు. ఆ స్వేచ్ఛను, ఆనందమును తన హృదయంలో కలిగించువాడు. దేవుడే అనే సమాధానము తెలుసుకోవాలి. ఇతరులతో గాని, వస్తువులతో గాని మనం ఆలోచించకుండా మన హృదయమునందు మన అంతరంగిక స్వేచ్ఛ కలిగియుండాలి.

### 2.3.6. తనకు తానే పరిశోధకుడు

ఒక వ్యక్తికి జీవితములో విజయసాధనకు నిర్దిష్టమైన లక్ష్యాలు ఉండాలి. నిర్దిష్టమైన లక్ష్యం లేకపోతే మీ గమనానికి ఒక దిశ అంటూ ఉండదు. ఒక నిర్దిష్టమైన గమ్యం లేకపోతే జీవితం నిస్సారంగ, నిరాసక్తంగ, ఏ ప్రయోజనం లేకుండా అర్ధరహితంగా మారిపోతుంది. మన జీవితములో గమ్యం లేని జీవితం చుక్కాని లేకుండా అల్లకల్లోలంగా ఉన్న సముద్రంలో తడబడుతూ కొట్టు మిట్టాడుతున్న నావతో పోల్చవచ్చు. ఒక వ్యక్తి తనకు తానే పరిశోధకుడుగా మారాలి. అంటే ఆయన ఎంచుకున్న అంశము మీద పూర్తిగా అంకిత భావంతో పరిశోధనలు చేస్తూ తను అనుకొన్న ఆశయమును సాధించాలి. పునీత ఇన్యాసివారి ఆధ్యాత్మికతలో ఒక వ్యక్తి తనకు తానే పరిశోధకుడుగా ఉండాలి అని బోధిస్తున్నాడు. ఒక వ్యక్తి ఎంచుకొన్న అంశము నిర్ధిష్టమైన ఓపికతో, సహనంతో తిరిగి దాని గురించి అలోచించి, దానిలోని తప్పులను సరిదిద్ది, అలాగే ప్రతి రోజు తాను చేస్తే ఆధ్యాత్మిక జీవితంలో కష్టాలు, బాధలకు తానే పరిశోధకుడుగా ఉంటూ, తన జీవితము మొత్తం ప్రభువు మీద అంకితం చేయాలి అని పునీత ఇన్యాసివారు బోధిస్తున్నారు. ఏ విధంగా క్రీస్తు ప్రభువు తన జీవితాన్ని చక్కగా, వెలుగుగా ఎంచుకొన్నాడో, అలాగే ప్రతి వ్యక్తి తనకు తనే పరిశోధకుడుగా ఉండాలి. తన హృదయం మొత్తం పూర్తిగా దేవుని యందు ప్రతిష్టించి తన జీవితాన్నే సాధించాలి. తాను చేసే ఆధ్యాత్మిక అభ్యాసాల ద్వారా ప్రతి రోజు పరిశీలించాలి. ఆ వ్యక్తి

ప్రతిరోజు తనను సృష్టించిన సృష్టికర్తకు తన జీవితాన్నే అంకితం చేయాలి. నేను క్రీస్తు ప్రభువునికి ఏమి చేశాను, నేను క్రీస్తు ప్రభువుకి ఏమి చేస్తూన్నాను, నేను క్రీస్తు ప్రభువుకి  ఏమి చేయాలి అని ప్రతి రోజు పరిశీలించుకోవాలి.

### 2.3.7. ప్రత్యేకమైన ఆధ్యాత్మిక

ప్రత్యేకమైన ఆధ్యాత్మికత అంటే దేవుని యెడల పూర్తిగా నమ్మకము కలిగి ఉండాలి. పునీత ఇన్యాసివారి ఆధ్యాత్మికతలో వారు నిబంధనలకు, కొత్త సంకల్పాలకు లేక అంతరంగంలో కలిగిన భావాలలో ఆధ్యాత్మికతను చూడలేక, కాని ప్రతి రోజు వారు చేస్తున్న ఆధ్యాత్మిక అభ్యాసాలలో ప్రత్యేకమైన ఆధ్యాత్మికత ఉంది అని ఇన్యాసివారు భావించారు. తాము చేసే ఆధ్యాత్మిక అభ్యాసాలు ద్వారానే, దేవుని యెడల భక్తి కలుగుతుంది అని బోధించారు. ఇగ్నేషియన్ ఆధ్యాత్మికత మానవుని జీవితము మీద ఆధారపడి ఉంటుంది. వీరి ఆధ్యాత్మికత ప్రజల యొక్క గౌరవం మీద, వారి జీవిత విధానంను గౌరవిస్తూ, ప్రజలు యొక్క ఆధ్యాత్మిక జీవితమును వెలికి తీస్తారు. వీరి ఆధ్యాత్మిక జీవితము ప్రజల యొక్క సమస్యలను, వారిని గౌరవిస్తారు. ఈనాటి సమాజంలో మనిషికి మనిషి అంటే పడదు. అలాంటి వారికి ఈ ఆధ్యాత్మికత ఎంతగానో ఉపయోగపడుతుంది.

### 2.3.8. ఐక్యత గల ఆధ్యాత్మికత

ఐక్యత సాధన క్రైస్తవులందరి బాధ్యత. వయోభేదం లేకుండా చిన్నా పెద్దా అందరూ క్రైస్తవుల మధ్య ఏకతాభావాన్ని నెలకొల్పడానికి కృషి చేయాలి. తమ అనుచరులందరు ఐక్యంగా ఉండాలని పునీత ఇన్యాసివారు ఎంతగానో కాంక్షించారు. క్రీస్తు ప్రభువు మాటలనే స్ఫూర్తిగా తీసుకున్నారు. " నీవు నన్ను పంపితివని లోకము విశ్వసించుటకు, వారు ఒకరుగ ఐక్యమై ఉండనిమ్ము" (యోహాను 17: 21). మనుషుల మధ్యవున్న భేదాలు, విభేదాలు క్రీస్తు దేహంపై గాయాలవంటివి. ఐక్యత లేకపోతే అవి నిరంతరం బాధిస్తూనే ఉంటాయి. విభజనలు శత్రుత్వాలను పెంచుతాయి, విశ్వాసాన్ని బలహీన పరుస్తాయి. మరీముఖ్యంగా క్రైస్తవుల విశ్వసనీయతను దెబ్బతీస్తాయి, మన ఆధ్యాత్మిక జీవితాన్ని తగ్గిస్తాయి. కాబట్టి అందరిలోను హృదయపరివర్తన కలగాలి. దానితోపాటు ఎవరి

విశ్వాస సత్యాలను వారు క్షుణ్ణంగా తెలుసుకొని ఉండాలి, విభిన్న శాఖల మధ్య సుహృద్భావ చర్చలు, సమష్టి ప్రార్థనలు, ఉమ్మడి జీవితం ద్వారా మన ఐక్యతను బలపరుచుకొగలమని పునీత ఇన్యాసివారు భోధిస్తున్నాడు. పునీత ఇన్యాసివారి ఆధ్యాత్మికతలో కలసిమెలసి ఐక్యతగా ఉండటములోనే ఉంది ఆధ్యాత్మికత. వారి ఆధ్యాత్మికత దేవునికి, మానవునికి మధ్య ఆన్యోన్య సంబంధమును ఏర్పరుస్తుంది. ఆధ్యాత్మికత అభ్యాసాలు, వారి ఆధ్యాత్మికత జీవితములో కలిగిన అనుభవాలను తమ ఆధ్యాత్మికతను గురువుతో వ్యక్త పరుస్తున్నారు ఇన్యాసివారు. దేవుని సువార్త ప్రచారానికి గొప్ప ప్రాధాన్యత ఇచ్చారు. ప్రజలతో దేవుని సేవను చేయడం వలన దేవుని యొక్క గొప్పతనాన్ని ప్రజలకు ఎరుక పరుస్తూ, అందరు ఐక్యముతో ఆధ్యాత్మికతను కనుగొనగలము.

## 2.3.9. పనిలోను ధ్యానించుట

పునీత ఇన్యాసివారి ఆధ్యాత్మికతలో పనికి ఎంతో విలువ ఉంది. మనం పని చేసేటప్పుడు దేవునికి ప్రీతికరముగా, సంపూర్ణముగా చేసినప్పుడు, దేవుని దీవెనలను మనం పొందుతాము. ఏ పని ఆయిన గాని దేవుని పనిగా స్వీకరించి సంపూర్ణ హృదయంతో పని చేయాలని పునీత ఇన్యాసివారు బోధిస్తున్నారు. చాలమంది పనిచేయడం నామోషి అనుకొంటారు. విశేషంగా ఊడ్వడం, శుభ్రం చేయడం మొదలైన పాచి పనులు సేవకులు మాత్రమే చేయాలి అని భావిస్తారు. మన చేతులు, బట్టలు పని వల్ల ఏమాత్రం మురికి కాకుడదు అనుకొంటారు. కాని ఇది తప్పుడు భావం. ఏపనైనా గొప్పదే. పనిచేయడం వల్ల మనం గొప్పవాళ్ల మౌతాంగాని తక్కువవాళ్లం కాము. ప్రతీ పనికి విలువ ఉంది. పనిచేసేవాళ్లకు గౌరవం ఉంది. చాలమంది పనిని తప్పించుకొని తిరిగుతూంటారు. పనిచేయకుండా ఉంటే గొప్ప అనుకొంటారు. కాని ఈ భావం పొరపాటు. పని చేయడం భగవంతున్ని పూజించడంతో సమానం. గొప్పవాళ్ళంతా శ్రమించి పనిచేసిన వాళ్లే. పని పవిత్రమైంది. అది విసుగు, పేదరికం, చెడ్డతనం అనే మూడు అవలక్షణాలను తొలగిస్తుంది. భగవంతుడే స్వయంగా కృషిచేసి ఈ లోకాన్ని సృజించాడు కదా! మరి మనం పనిచేయకుండా ఉంటే కుదురుతుందా?

## 2.3.10. మనము ఇతరులను రక్షించుట/సంరక్షించుట

ఒక మనిషికి ఇతరుల పట్ల ఉండే మంచి మర్యాదలు, అతనికున్న, సభ్యత, సత్ప్రవర్తన, సౌజన్యం, మ ృదు స్వభావాల ద్వారా వెల్లడవుతుంటాయి. ఇతరులకు మంచి అభిప్రాయం కలిగేలా సభ్యతతో, చెడు ప్రవర్తనాతీతులైతే మీరు సంస్కారమతులుగా గుర్తింపబడతారు. ఈ విధంగా పునీత ఇన్యాసిగారు ఆత్మలను రక్షించుటకు ఎంతగానో దోహదపడ్డారు. సమాజంలో సత్యం కోసం అన్వేషించటలో ఆధ్యాత్మికత ముఖ్యముగా ఉంటుంది. మన హృదయాలను స్వచ్ఛముగా ఉంచుకుంటూ, దేవుని సేవలో ఎదగాలని పునీత ఇన్యాసివారు బోధిస్తున్నాడు.

# 3. ఈనాటి గురుత్వ జీవితములో ఇన్యాసివారి ఆధ్యాత్మిక ప్రభావము

## 3.1. దేవుని యందు పుర్తి నమ్మకంను కలిగియుండుట

అప్పటి వరకు విశాల జీవితం కోనసాగించిన పునీత ఇన్యాసివారు, క్రీస్తు ప్రభువు గురించి తెలుసుకున్నప్పుడు ఆయనకు పరిపూర్ణ స్వస్థత కలిగినప్పుడూ పునీత ఇన్యాసివారికి క్రీస్తులో బలమైన నమ్మకము ఏర్పడింది. దేవుడు చేసిన అద్భుతంకు పునీత ఇన్యాసివారు విశ్వాసం మరింత ధృడపడింది. ఆ విశ్వాసంతో యేరుషలేమును సందర్శించాలని దేవునికి మ్రొక్కుకున్నాడు. ధనాన్ని తన స్నేహితులైన పేదలకు పంచి వేశాడు. చేతిలో చిల్లి గవ్వ లేదు కాని దేవునిలో కొండంత నమ్మకము. ఆ నమ్మకమే యేరుషలేముకు నడిపించింది. ఎన్ని కష్టాలైన, ఎన్ని భాదలైన చివరకు రోము నగరానికి చేరుకొన్నాడు. పరిశుద్ధ ఆరవ అంద్రియన్ పోపుగారి దగ్గర దేవుని దీవెనులు పొంది తన మ్రొక్కును సఫలీకృతం చేసాడు పునీత ఇన్యాసి వారు.

పేదవానిగా జీవించి, పేదలకు దానం చేయుట ద్వారా దేవున్ని ఘనంగా మహిమ పరచగలము అని పునీత ఇన్యాసివారి ధృఢమైన నమ్మకం. దేవుని మీద నమ్మకం ద్వారా ఆయన విశ్వాసం మరింత బలపడింది. తద్వారా తన జీవిత విధానమే పూర్తిగా దేవునివైపు మారింది. క్రీస్తు ప్రభువును అనుసరించుటకు, ఆయన అడుగు బాటలో సేవ చేయుటకు పిలవబడ్డ మనము పునీత ఇన్యాసి వారి వలే దేవుని పట్ల దృడమైన విశ్వాసాన్ని, నమ్మకమును కలిగియున్నామా

అని ఆలోచించుకోవాలి. పునీత ఇన్యాసివారి పూర్తి నమ్మకమును దేవుని యందు కనుగొన్నాడు. మరి ప్రస్తుత గురువులుగా పూర్తి నమ్మకమును దేవుని యందు ఉంచాలి. మత్తయి.8:8 "శతాధిపతి, ప్రభువుతో ప్రభూ నీవు నాయింటిలోనికి వచ్చుటకు నేను పాత్రుడను కాను. నీవు ఒక్క మాట పలికిన చాలును నా సేవకుడు స్వస్థత పొందును." అనే గట్టి విశ్వాసం, నమ్మకంతో ప్రార్థించాడు. మరి మన జీవితాలలో కూడ ఆ విశ్వాసమును, నమ్మకంను దేవునిలోనే కనుగొనాలి. అది మనకు ప్రార్థన సహాయము ద్వారా మాత్రమే లభిస్తుంది. కాబట్టి గురువుకు ప్రార్థన అనేది ఒక ముఖ్య ఆయుధం అవ్వాలి.

### 3.2 దేవునిలో సర్వమును కనుగొనుట

దేవుని ప్రేమను రెండు విధాలుగా కనుగొనవచ్చని పునీత ఇన్యాసివారు చేబుతున్నారు. మొదటిగా దేవుని ప్రేమను మన మాటలలో కంటే మన చేతులలో మరిముఖ్యంగా పేదలకు సాయంచేయడం ద్వారా దేవుని కనుగొనువచ్చు. రెండవదిగా మనకు తెలిసిన దైవజ్ఞానాన్ని ఇతరులకు భోదించి,వారిని ఆధ్యాత్మిక జీవితంపై అడుగులు వేశాలా చేయడం ద్వారా మనం దేవుని ప్రేమను కనుగొనవచ్చని పునీత ఇన్యాసివారు నమ్మే సిద్ధాంతం.

పునీత ఇన్యాసివారి జీవితములో ఎన్ని దైవ దర్శనాలను చూసారు. వాటిలో ఎక్కువగా దివ్య సత్ప్రసాదంలో క్రీస్తు భగవాన్ని దర్శించడం జరిగింది. అప్పుడు పునీత ఇన్యాసివారు దేవునితో ఓ దేవా! మీరు నాకు ప్రసాదించిన జీవితాన్ని,ఆలోచనను, స్వేచ్ఛను, అంతయు మీకే అర్పిస్తున్నాను. మీ కావాలిలో నన్ను చేర్చుకొని, మీ ప్రేమను, మీ దయను నాపై క్రుమ్మరించండి తద్వారా నేను ఎల్లప్పూడు మీలోనే నా సర్వమును కనుగొందునని పునీత ఇన్యాసివారు ప్రార్థించేవాడు. పునీత ఇన్యాసివారి సర్వమును సర్వశక్తివంతుడైన దేవునిలో కనుగొన్నాడు. మార్కు 1:17 "మీరు నన్ను అనుసరింపుడు. మిమ్ము మనుష్యులను పట్టువారలనుగా చేసెదను." అని శిష్యులతో యేసు పలికినప్పుడు, వారు తమ సర్వమును అచటనే వదిలివేసి ప్రభువుని పూర్ణ హృదయంతో, పూర్ణ మనస్సుతోను, పూర్ణ శక్తితోను అనుసరించారు. చివరికి తమ ప్రాణమును సైతం ప్రభువుకి

అంకితము చేశారు. మరి నేటి గురువులుగా ఉన్నమనం సర్వమును దేవునిలో కనుగొంటున్నామా! లేక ఇహలోక సంపదలైన, అస్తిపాస్తులు, డబ్బులో కనుగొంటున్నామా! అని ఆలోచించాలి. మన పరిపూర్ణ హృదయంను దేవునిలో ఉంచి కనుగొనప్పుడు దేవుడు సర్వమును మనకు అర్పిస్తాడు అనే విశ్వాసం మనకు ఉండాలి. ఏ విధంగా పేద విధవరాలు రెండు కాసులను ప్రభువుకు సమర్పించిందో, అదే విశ్వాసంతో, సర్వమును దేవునిలో కనుగొంది. మనకు అలాంటి విశ్వాసం కావాలి.

## 3.3. శిష్యరికము: జీవితాన్ని తీర్చదిద్దుట

క్రీస్తు ప్రభువు దైవ కూమారుడు. ఆయన దేవునితో సమాన స్థాయి కలిగిన వాడు. దైవంతో సమానుడైన క్రీస్తు మరణించాడు. క్రీస్తు ప్రభువు తన తగ్గింపులేని స్థాయి నుండి దిగి వచ్చి ఒక శిష్యుడు గురువుకి సేవ చేసినట్లు ఆయన మనందరికి సేవ చేయడం జరిగింది. ఈ యొక్క సంఘటనే పునీత ఇన్యాసివారిని శిష్యరికం. ఇన్యాసివారు ఒక శిష్యుని వలె క్రీస్తుతో పయణించారు. అదేవిధంగా మనమందరము ఒకరికొకరు శిష్యులవలే జీవించాలని, పరస్పరం గౌరవ మర్యాదలతో జీవించాలని బోధిస్తున్నారు.

## 3.4. క్రీస్తు ప్రభువుని శరీర, శ్రమల మరణ పునరుత్థానాన్ని పంచుకొనుట

మనము క్రీస్తు ప్రభువుని శరీర, శ్రమలలో భాగం పంచుకోవాలనే కోరిక మనకుంటే ఆ కోరిక ఖచ్చితంగా దేవుని నుండే వస్తుంది. ఎందుకంటే మానవులు కూడా క్రీస్తు శరీర, శ్రమల, మరణ పునారుత్థానంలో పాల్గోవాలని దేవుని అభిలాష. మనం మనకు తెలిసిన వారి బాధలలో, కష్టలలో మాత్రమే కాకుండా మనకు తెలియని వారి బాధలలో కష్టలలో భాగం పంచుకోవాలి. మనం నిజంగా క్రీస్తు ప్రభువుని శరీర, శ్రమల, మరణ, పునరుత్థానంలో భాగం పంచుకొంటామని పునీత ఇన్యాసివారు గాడంగా నమ్ముతాడు. ఈ విధంగా ఇతరుల బాధలలో, కష్టలలో మనం భాగం పంచుకొన్నప్పుడు క్రీస్తు పునరుత్థాన పరమానందంలో కూడా మరింతగా మనకు ఎక్కువగా భాగం ఉంటుంది అని పునీత ఇన్యాసివారు చెబుతున్నారు. ఇలాంటి అవకాశాలు కొంత మందికే వస్తాయి. కాబట్టి క్రైస్తవ

అనుచరులగ ఉండడం వలన మనము ఎక్కువగా క్రీస్తు ప్రభువుని శరీర, శ్రమల, మరణ పునరుత్థానంలో పాలుపంచుకోవాలని పునీత ఇన్యాసివారు బోధిస్తున్నారు. పునీత ఇన్యాసివారి గురువుగా అభిషేకమును పొందిన తరువాత ఆ మహోన్నతుడైన క్రీస్తు ప్రభువుని శరీరమును, రక్తాలను ముట్టుటకు, దివ్యబలి పూజలను సమర్పించుటకు ఒక సంవత్సరం మొత్తం దేవుని ప్రార్థించాడు. ప్రస్తుత గురువులుగా అభిషేకము పొందిన వారు క్రీస్తు ప్రభువుని, శరీర, శ్రమల మరణ పునరుత్థానాన్ని పంచుకోవాలి. మనం అందరము క్రీస్తు ప్రభువుని శరీరములో భాగస్తులము. క్రీస్తు ప్రభువే మనకు ఆధారము. క్రీస్తు ప్రభువుని శరీర, శ్రమల, మరణ, పునరుత్థానలే క్రైస్తవులకు మూలాధారం. ఇదియే మన విశ్వాసమునకు తొలిమొట్టు. ప్రస్తుత గురువులు, క్రీస్తు ప్రభువుని పాస్క పరమరహస్యమును సమర్పించుటకు మీ హృదయములు ఎంత పవిత్రంగా ఉన్నయో ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలి. గురువులగా మరి క్రీస్తు ప్రభువుని శరీరాన్ని ముక్కలుముక్కలుగా విడదిస్తూన్నామా అని ఒకసారి ఆలోచించుకోవాలి. క్రీస్తు ప్రభువు తాను సంపాదించికొనిన ప్రజలను గురువు ఐక్యతతో చూసుకుంటారో అలోచించాలి.

## 3.5. ప్రభు నీ దారిని మాకు చూపు

పునీత ఇన్యాసివారు మరణావస్థలో ఉన్నప్పుడు తాను చావు గదికి వెళ్తూండగా, తన ఆత్మ తనను వదిలి వెళ్ళిపొతుంది. అని గుర్తించాడు. ఒక్కసారిగా తాను చేసిన పాపాలను, గుర్తుకు తెచ్చుకొన్నాడు. ఆ పాపాలు చాలా ఉన్నాయి. తాను చేసిన పాపాలకు కన్నీలతో ఏడుస్తూ, దేవునియందు పాపక్షమాపణకై వేడుకొన్నాడు. దేవుడు పునీత ఇన్యాసివారి రోదనను ఆలకించి ఆయనను పరిపూర్ణ ఆరోగ్యం ఇచ్చాడు. అంతే కాకుండా పునీత ఇన్యాసివారు. రోగం నయాం అయిన తరువాత జీవితమంత దేవునికే అర్పించడం చూస్తాం.

తన రక్తంతో మన పాపాలను కడిగి, మనలను శుద్ధి చేస్తున్నారు క్రీస్తు ప్రభువు. మనం మన పాపల నుండి విముక్తి పోందాలంటే మనము అయన రక్తంతో కడగబడాలి. అందుకు మనమందరము పునీత ఇన్యాసివారి వలే పాప

పశ్చాత్తపహృదయంతో దేవుని వేడికొంటే మనం కూడా శుద్ధి చేయబడతాము. ఆయన మార్గము కూడా మనకు తెలియ చేయబడుతుంది. కాబట్టి దేవుడు కోరేది పాప పశ్చాత్తాప హృదయాన్ని కాని పాప జీవితాన్ని కాదు. ఇది తెలుసుకొని మన పాప జీవితాన్ని పునీత ఇన్యాసివారి వలే తరిమివేద్దాం. పునీత ఇన్యసివారు ఎల్లప్పుడు "ప్రభు నీ దారిని మాకు చూపించు" అని ప్రార్థించేవాడు. ప్రభువు మార్గము ఇరుకైన మార్గము. ఎల్లప్పుడు ఆ మార్గం గుండా ప్రవేశించడానికి ప్రయత్నించేవాడు. మరి నేటి గురువులు విశాలమైన మార్గము కోసం ఎదురుచూస్తున్నారా? లేక ఇరుకైన మార్గం కోసం వెదుకుతున్నరా? అని అలోచించాలి. గురువులు ఎల్లప్పుడు ఇరుకైన మార్గమునే ఎంచుకోవాలి. ఎందుకంటే క్రీస్తు ప్రభువు చూపించిన మార్గం అది. అదే మన ప్రభువును తెలుసుకోవడానికి పరిపూర్ణమైన మార్గం.

### 3.6. నూతన అపోస్తోలిక జీవితము

అపోస్తలులు యేసు పునరుత్థానానికి సాక్షులుగా నిలచారు, ప్రభువునకు సంబంధించిన సత్యసర్వస్వానికి ప్రత్యక్ష సాక్షులయ్యారు. అలాగే యేసు ప్రభు మరణానంతరం ఆయన ఆరంభించిన లోక రక్షా ధర్మాన్ని అపోస్తలులే కొనసాగించారు. అంతేకాదు తమ అనంతరం లోకరక్షణధర్మాన్ని కొనసాగించే వారుసులను స్వయంగా తామే ఎంపిక చేసేవారు. అలా ఎంపికచేయబడిన అపోస్తలిక వారసులే పీఠాధిపతులు. యేసు ప్రభువు తన అపోస్తలులకిచ్చిన దివ్యాధికారిన్ని నేడు వారుసులు అమలు చేస్తూంటారు. ఈ దివ్యాధికారంతోనే అపోస్తోలుల వారసులు క్రైస్తవ సంఘాలను పరిపాలిస్తారు. సత్యప్రబోధం చేస్తున్నారు. దైవార్చనలు నిర్వహిస్తారు. ఈ అపోస్తలిక పారంపర్యమే శ్రీసభ ఏకతకు సంఘీభావానికి పునాదిగా నిలుస్తుంది.

పునీత ఇన్యాసివారు అపోస్తలిక జీవితమును అనుసరించాడు. క్రీస్తు సభ్యులలో ఒక్కడిగా ఉంటూ, క్రీస్తు భగవానుడిని ముఖాముఖిగా దర్శిస్తూ ఆయన నామమునకు స్తుతులు, స్తోత్రములు గౌరవములు చేకూరుస్తున్నాడు. అలనాడు అపోస్తలులు క్రైస్తవ సంఘాలను క్రీస్తు బాటలో నడిపించాడు. మరి నేడు గురువులు

క్రీస్తు ప్రభువు ఎన్నుకొన్న ప్రజలను క్రీస్తు మార్గం వైపు పయనింపచేయాలి. గురువులు తమ విభేదాలను, భిన్నాభిప్రాయాలను విడనాడి ఇన్యాసివారి వలే క్రీస్తు అడుగు జాడలలో నడుస్తు, విశ్వాసులను కూడ సన్మార్గము వైపు నడిపించాలి.

## 3.7. పునీత ఇన్యాసివారి తన స్నేహితులను వేద ప్రచారానికి పంపించుట

క్రీస్తు భగవానుడు తన శిష్యులను తన పవిత్రాత్మవరములతో నింపిన తరువాత సువార్త ప్రచారం కోసం పంపించారు. పునీత ఇన్యాసివారు క్రీస్తు ప్రభువునికి సేవకునిగా మలచిన తరువాత, ఇన్యాసివారు క్రీస్తు ప్రభు యొక్క దైవరాజ్యంను స్థాపించుటకు ఎంతగానో దోహాదపడ్డారు. క్రీస్తు ప్రభువునే నిజ శక్తిగల సత్య స్వరూపుడు అయిన ప్రభువు అని సమాజానికి చెప్పుటకు ఎప్పుడు కూడ ముందుగా ఉండి నడిచారు. తాను నడవటమే కాదు తన అనుచరులను సైతం క్రీస్తు ప్రభువు యొక్క దైవరాజ్యాన్ని స్థాపించుటకు ప్రపంచ నలుమూలల వేదా ప్రచారం కోసం పంపించాడు. అందులో ఒక్కరు మన దేశానికి వచ్చిన పునీత ఫ్రాన్సీస్ జేవియర్ గారు. తెలియని స్థలం, తెలియని భాష, తెలియని ప్రజలు, అయినకూడ తన ఆధ్యాత్మిక గురువు పునీత ఇన్యాసివారికి వినయం, విధేయత చూపిస్తే నేను ప్రభువుకు చూపించినట్లే అనే ప్రగాడ విశ్వాసంతో మన దేశానికి వచ్చాడు. చివరికి ప్రభువుకే తమ సర్వమును అంకితం చేసి ప్రభువు యొక్క దైవరాజ్యాన్ని స్థాపించాడు. మరి ఈనాటి గురువులు మన పీఠాధిపతుల యెడల వినయ విధేయతలు చూపిస్తు ప్రభువు యొక్క దైవరాజ్యాన్ని స్థాపించాలి. గురువులను పీఠాధిపతులు పంపించు ప్రదేశాలకు వెళ్ళి ప్రభువు యొక్క గొప్పతనమును గురించి బోధించాలి. ఆనాడు పునీతులు తమ సర్వమును ప్రభువు మీద అంకితం చేశారు. కనుక దైవ సేవను కష్టాలు, నష్టాలు, బాధలు, సమస్యలు, ఆనందాలు వచ్చి సంతోషంగా దైవరాజ్యం కోసం కృషి చేశారు. ఈనాటి గురువులు కూడ ప్రభువుకు సర్వమును అంకితం చేసి దైవరాజ్యం కోసం ప్రాధేయపడాలి. అప్పుడే ఆ మహోన్నతుడైన క్రీస్తుని గురించి తెలియని ప్రజలకు మనం బోధించగలము. ఈ భూమిలో దైవరాజ్యంను స్థాపించగలము.

**ముగింపు**

ప్రస్తుత ప్రపంచంలో ఒక ప్రక్క అంచెలంచెలుగా ప్రపంచ భావ్య అభివృద్ధి చెందుతుంది. మరోపక్క ఊహించలేని విధంగా ప్రతికార హింసలు, మరణాలు, దోపిడీలు, తీవ్రవాదులు, యుద్ధాల వలన ప్రజలు తీవ్ర వేదనలను అనుభవిస్తున్నారు. ఎటు చూసినా భయాందోళన, శత్రుత్వ భావాలు, మానసిక క్షోభంతో నేటి సమాజం నిండి ఉంది. మనిషి దుర్బలుడు, భమల్లో జీవిస్తున్నాడు. తన జీవితప్రయాణంలో తడపడుతూ ఉంటున్నాడు. మనిషి ప్రయాణంలో కష్టాల్లో ఉన్నప్పుడే కాకుండా అంతా పూర్తి సజీవుగా నడుస్తున్నప్పుడు కూడ తనకి ధైర్యాన్ని, శక్తిని ఇచ్చేందుకు ఎల్లవేళాలా ఆధారపడదగ్గ ఒక మంచి అసరా కావలి. మనకు అవసరమయ్యే ఆధారాన్ని, శక్తి యుక్తులను మనకన్నా ఎక్కువ ఉన్నతమైన స్థితిలో ఉన్నవారే అందించగలరు. సకల ఆధారాలకు ఆధారం, మూలం, స్వయం ప్రకాశం, సర్వం వ్యాపించివున్న ఉన్నతమైన శక్తి స్వరూపులే త్రియేక సర్వేశ్వరుడు. త్రియేక సర్వేశ్వరుని గురించి మనిషి తెలుసుకోవాలంటే ప్రార్థన శక్తి ఎంతగానో అవసరం. ప్రార్థన అనగా దేవునితో ముఖాముఖిగా మాట్లాడడం. ఇలా చేయడానికి మనకు ఆధ్యాత్మిక శక్తి ఎంతో అవసరం.

పునీత ఇన్యాసివారు చిన్ననాటి నుండే తన ప్రార్థన జీవితంను ప్రారంభించాడు. తల్లిదండ్రుల యెడల వినయ, విధేయతలు చూపుటకు, ఆయనకు తండ్రి దేవుడే అనుగ్రహించాడు. ఆధ్యాత్మిక జీవితమును, ప్రార్థన శక్తిని పెంది అభివృద్ధి చేసుకొన్న ప్రతి ఒక్కరులో, సమస్యల ఆవేదనల నుండి దూరం చేస్తాయి. ప్రార్థన చేయటం వలన ఆయనలో ఒక ఉత్తేజమైన శక్తి వెలువడుతుంది. పునీత ఇన్యాసివారు చెప్పిన విధంగా సంపూర్ణ మనస్సును దేవుని మీద లగ్నం చేసి శ్రద్ధతో ప్రార్థన చేస్తే ప్రతి ఒక్కరిలోను ఆధ్యాత్మిక చైతన్యము మేల్కొలుపుతుంది. మన ఆధ్యాత్మిక జీవిత ప్రయాణం "సర్వము దేవుని మహిమకు ఉపయోగించాలి" అని పునీత ఇన్యాసివారు బోధిస్తున్నారు. దేవుని మీద పూర్తి నమ్మకం ఉంచి ప్రార్థన చేయాలి. అది లాభమైన, నష్టమైన, గెలుపైనా, ఓటమియైనా, కష్టమైనా, సుఖమైన దేవుని మీద పూర్తి విశ్వాసం ఉంచి ప్రార్థించాలి. మన ఆధ్యాత్మిక జీవితము ద్వారా దేవుని విశ్వాసంతో ప్రార్థిస్తున్నప్పుడు మన నిస్సహాయమైన

స్థితిలోను, మనలోనికి అత్యంత స్నేహపాత్రుడైన దేవుడే తోడుగా నిలుస్తాడు. మన ప్రార్థన జీవితము ద్వారా దేవుడు భయస్తులకు ధైర్యాన్ని, పిరికిపందలకు నమ్మకాన్ని ప్రసాదిస్తాడు. మన ఆధ్యాత్మిక జీవితం ద్వారా మన జీవితము ఎదురయ్యే గట్టి, ఎదురు దెబ్బలనుండి మనల్ని కాపాడి నిరాశ నిస్పృహల నుండి ప్రభువు రక్షిస్తాడు అని పునీత ఇన్యాసివారు బోధిస్తున్నాడు.

ఇహలోక విషయాలతో సతమతమౌతు తీవ్రమైన మోహావేశాలతో, అహంకారం, అగౌరవం అనే దుష్ట గుణములతో నిండిపోయిన మన హృదయాన్ని శాంతి, సమాధానముతో నిరాడంబరంగా వినయంతో చేసే ప్రార్థనే మార్గం. చేదు అనుభవాలతో గాయపడిన మన హృదయాలను మధురంగాను, విచారంతో ఉన్న హృదయాలలో ఆనందంగాను, సంతోషంగా చేయుటకు ప్రార్థనే ముఖ్యం. పునీత ఇన్యాసివారి జీవితము ప్రార్థనతో దేవుడు తన దుర్భరమైన హృదయాన్ని తీసివేసి ఉన్నతమైన ఆనందకరముగాను ప్రజల్వింపచేయు హృదయాన్ని పునీత ఇన్యాసివారికి ప్రసాదించాడు.

పునీత ఇన్యాసివారి దేవుని తల్లియైన మరియమాత మీద ఎంతో ప్రగాఢ నమ్మకమును కలిగివున్నాడు. తనకు ఆపద వాటిల్లక తల్లి మరియమాత ప్రార్థన సహాయంతో, తన కుమారుడైన క్రీస్తు ప్రభువుకి విన్నపం చేశేవాడు. ప్రగాఢ విశ్వాసముతో ప్రభువు తనకు దయచేస్తాడు అని విశ్వాసముతో, నమ్మకముతో ఉండేవాడు. మరి ఈనాటి సమాజం గురుత్వ బాధ్యతలను స్వీకరించిన వారు పునీత ఇన్యాసివారి వలె తల్లి మరియమాత మీద విశ్వాసమును చూపిస్తున్నారు. లేక ఒకసారి ఆత్మపరిశీలన చేసుకొవాలి. గురుత్వ బాధ్యత అనుభవించు వారి, ఇహలోక బాధలు, కష్టాలు, నష్టాలు, సంతోషాలు వచ్చినప్పుడు మన కొరకు విన్నవించే దయగల తల్లి ఉంది అని గ్రహించి, మన సేవలను, మన ఆధ్యాత్మిక జీవితమును అభివృద్ధిపరుచుకోవాలి. గురువులు తాము చేయు ప్రతి పని కూడ దేవునికి మహిమను చేకూర్చాలి. ఆయన నామమునకు, స్తుతులు, స్తోత్రములు గౌరవములు చేకూర్చేలా జీవించాలి.

❋ ❋ ❋ ❋

# 3. ప్రజలను దేవుని సేవయందు తరింపచేయుటలో గురు జీవితమందు ఆధ్యాత్మిక ప్రాముఖ్యత

- బ్రదర్ వడ్లపాటి మరియదాస్

**ఉపోద్ఘాతం**



నేటి సమాజం పారిశ్రామికంగాను, సాంకేతిక రంగంలోను ఎంతగానొ అభివృద్ధి చెందుతుంది. మానవుడు సుఖవంతమైన, విలాసావంతమైన, లాభకరమైన జీవితమును జీవించుటకు అన్నీ కనిపెడుతున్నాడు, కాని పాపపు ఆలోచనలు మాత్రం సృష్టి ఆరంభం నుండి మానవునిలో ఇమిడి ఉన్నాయి అవి తీయలేకపోతున్నాడు. కారణం తనలో అహం, గర్వం నేను నా జీవితం అని జీవిస్తున్నాడు కాబట్టి. అందువల్లె సమాజంలో ఎన్నో సమస్యలు ఎదురౌతున్నాయి. మనిషి జీవితం అందవికారంగ తయారవుతుంది. ఒక్క సమాజం అభివృద్ధిపథంలో నడుస్తుందని ఆనందపడాలో లేక పాపపు జీవితంలో కూరుకు పోతుందని బాధపడాలో అర్థం కావడం లేదు.

శ్రీసభ కూడా అనేక విభజనలకు దారితీస్తుంది. కులం, వర్ణం, జాతి, ప్రదేశం, బాష, స్త్రీ పురుష భేదముందని. మతాచార్యులు సొంత స్వలాభాల కోసం, ధనాన్ని కూడబెట్టుకొని, అధికారాన్ని విచ్చలవిడిగ ఉపమోగిస్తున్నారు. వారి అధికారులకు వినయం చూపించకపోవడం దురదృష్టకరం. దీని వల్ల క్రీస్తు సంఘం పలు విభజనలకులోనై నేడు ఎవరి దారి వారిదిగా, ఎవరి సంఘం వారిదిగా జీవిస్తున్నారు. క్రీస్తు సంఘం ఒకే శరీరంలోని అవయవాలు అనే నానుండి

పోయి, అవయవాలు పలు శరీరాలుగా మార్చుకొని, ఎవరికి వారు మేమే గొప్ప, మాదే గొప్ప అన్న భావనతో ఉంటూ, సోదర భావం బదులు ద్వేషజ్వాలలు రగిలిస్తూ, ఐక్యతతో సాగాల్సిన జీవితాలను విభజనతో సాగిస్తున్నారు. ప్రతి గురువు కూడా తాను ఆధ్యాత్మికంగ నడుస్తు, తన మందను ఆధ్యాత్మికంగా పెంపొందింప చేయాలి. తద్వారా క్రీస్తు రాజ్యాన్ని స్థాపించాలి.

పరుగెడుతున్న ఈ ప్రపంచంలో ప్రజలు ప్రభువు వైపు మరల్చవలసి బాధ్యత గురువుదే. కావున గురువు, జీవితంలో ఆధ్యాత్మిక అవసరం అందుకే నేను "ప్రజలను దేవుని సేవయందు తరింపచేయుటలో గురు జీవితమందు ఆధ్యాత్మిక ప్రాముఖ్యత" అనే అంశాన్ని తీసుకున్నాను. దీనిని నాలుగు అధ్యాయలుగా విభజించాను. మొదటి అధ్యాయం దేవునితో గురువు యొక్క ఆధ్యాత్మిక సంబంధము: ఇందులో గురుత్వం, ఆధ్యాత్మిక జీవితం అనగానేమి, తన విలువైన సమయాన్ని దేవుని ద్వారా పాపనపరచాలి, గురువుకు ఉండవలసిన సుగుణాల కోసం వివరించబడింది. రెండవ అధ్యాయం గురు వ్యక్తిగత జీవితంలో ఆధ్యాత్మికత: ఇందులో తాను గురువు ఏ విధంగా పవిత్రంగా జీవించాలి, ఆధ్యాత్మికంగ ఉండుటకు ప్రార్థన ఎంత అవసరం, ఎటువంటి పనులయందు సమానత్వం కలిగి ఉండాలి, పునీత జాన్ మరియ వియన్ని గారిని ఎలా అనుసరించాలో చెప్పబడింది. మూడవ అధ్యాయం సమాజంలో గురువు ఆధ్యాత్మికత: ఇందులో గురువు సమాజంలో సభ్యుడు కాబట్టి తన తోటి వారితో ఎలా ఆధ్యాత్మికంగ ఉంటున్నాడు, ముఖ్యముగ వారిని ఏ విధంగా ఆధ్యాత్మిక జీవితంలోకి నడిపిస్తున్నాడని వివరించబడింది. నాల్గవ అధ్యాయం నేటి భారతదేశంలో గురువు పాత్ర. ఒక భారతీయుడిగ తన దేశాన్ని ఎటువంటి పథంలో నడిపించాలి. అందుకు కావలసిన మంచి సంస్కృతిని నెలకొల్పుతూ, నాయకుడుగ ఉంటు, అందరి హక్కులను కాపాడాలి.

దైవం మానవులకు ప్రసాదించిన ఓ అపురూప ప్రేమ కానుక గురుత్వం. తను మనతో ఎల్లప్పుడు వాసమై ఉండాలని, తన కార్యాలు నిరాటంకంగా ఈ భువిపై కొనసాగాలని, తనప్రేమను సకల మానవాళికి చాటి చెప్పాలని, మనలో

నుండి కొందరిని పిలిచి, అభిషేకించి తన ప్రతి నిధులుగా తన గురువులను నియమిస్తున్నాడు. కాని ప్రస్తుత సమాజంలో కొందరు గురువులు విఫలం అవుతున్నారు. కాని గురుత్వం విఫలం కాలేదు. గురుత్వ ఔన్నత్యం దశ దిశల వ్యాపిస్తూనే ఉంది.

గురువులు క్రీస్తుని పోలి తండ్రి భగవానునికి తమ విశ్వసనీయతను కనబరచాలి తాము చేసే సువార్త ప్రబోధం, కతోలిక విశ్వాసులకు మార్గదర్శకంగా, దివ్యసంస్కారాల పరిచర్య ద్వారా క్రీస్తును ప్రతిబింబించి, విశ్వాసుల ఆధ్యాత్మిక జీవితాలను పరలోక రాజ్యం నిత్యసంతోషం వైపు నడిపించినప్పుడే గురువులు విశ్వసనీయులు. గురువుల నడవడిక, దైనందిన జీవనశైలి కతోలిక గురుజీవిత విశిష్టతకి వారు నిర్వర్తించే ధార్మిక క్రియలకు ప్రతిబింబాలుగా ఉండాలి. గురువులు పీఠాదిపతుల సహాయకులుగా వారికి సర్వదా విధేయులై, తమ సహగురువులతో సోదర బాంధవ్యాన్ని కలిగి, పరస్పర సహాయసహకారాలను యిచ్చి పుచ్చుకుంటూ తమకు అప్పజెప్పబడిన ప్రజలను ప్రేమిస్తూ, వారి కష్ట సుఖాలలో పాలుపంచు కుంటూ, స్థానికి కతోలిక సంఘాన్ని ముందుకు నడిపించాలి. క్రీస్తు ప్రభువుకి మరియు శ్రీసభకు ప్రామాణికముగా జీవించుటకు ప్రార్ధన, పవిత్రత, సేవాభావం మరియు సువార్తా వ్యాప్తికై అలుపులేని తపన ప్రతిగురువు నందు ఉన్నప్పుడు తమ గురుజీవితం ఫలవంతంగా మారును. ఈ విధమైన ఆధ్యాత్మిక జీవితంగా ప్రజలను దేవునియందు తరింపచేయుటలో తోడ్పడును.

## దేవునితో గురువు యొక్క ఆధ్మాత్మిక సంబంధము

ప్రతి గురువు తప్పనిసరిగా తండ్రి దేవునితో మమేకమై జీవించాలి. తనను సృజించి, నడిపిస్తున్న తండ్రికి సంపూర్ణ విధేయతను వ్యక్తపరుస్తూనే, తండ్రిపై అపారమైన ప్రేమను కలిగి జీవించాలి. ప్రతి గురువు తాను తండ్రితో చేసుకొనిన ఒప్పందాలకు కట్టుబడి జీవించాలి.

## 1.1. గురుత్వం అనగానేమి?

గురువు (Sacerdos) అనేపదం లాటిన్ పదం నుండి వచ్చింది. అనగా ఒక వ్యక్తి తనను తాను పవిత్రంచేసుకుంటు, దేవునిలో ఎదగడం?.ఆంగ్ల పదం

ప్రకారం గురువు (Priest) అనగా దేవాలయపు అధికారి. అందుకే గురువు అనే పదం రెండు విశిష్టమైన అర్థాలను కలిగిఉంది.

గురువుతనను తాను పవిత్రీకరణము చేసుకొనేవాడుఅలానే దేవాలయపు అధికారి కూడ అని గురువుకు నిర్వచనం చెప్పుకోవచ్చు.

గురువు అంటే అజ్ఞాన చీకటిని పారద్రోలి విజ్ఞాన వెలుగునిచ్చేవాడు అని లోత్తైన అర్థం.

గురువంటే మోక్షం నుండి ఊడిపడిన అపురూప వ్యక్తీ కాదు కాని అతడు మనలో ఒకడు.

మనమెవరం వినని, మందమైన మన చెవులకు వినపడని దేవుని స్వరాన్ని విని, మనం చేయలేని, మనకువల్లగాని ఈ ముముక్షత్వ మార్గాన్ని ఎంపిక చేసుకొన్న మహానీయవ్యక్తి గురువు.

క్రైస్తవ అర్థంలో గురువు క్రైస్తవ ఆధ్యాత్మిక మార్గాలను, భక్తి జీవన విధానాలను సద్వినియోగ పరచుకుంటూ, సువార్త ప్రచారం చేస్తూ ఎందరినో ప్రభుయేసు వైపునకు మళ్ళించి, నూత్న సంఘాల నిర్మాణం గావించేవాడు. పరలోక రాజ్యం కోసం జీవితాంతం గురువులు బ్రహ్మచారులుగా ఉంటారు. వారుదేవుని కోసం, మనుష్యుల కోసం సంపూర్తిగా సమర్పించుకోవాలి. సంతోష హృదయంతో బ్రహ్మచర్యాన్ని అంగీకరిస్తే అది దేవుని పాలనను ప్రకాశవంతంగా ప్రకటిస్తుంది. వారు తమ ప్రజలకు ఆదర్శంగా నిలవాలి. ఈ గురుత్వం అనే కృపావరం, తన ప్రజల కోసం ప్రాణాలర్పించటానికైనా, భయపడకుండా ఉండటాన్ని ప్రేరేపిస్తుంది. పవిత్ర మందకు కాపరిగా రాత్రింబవళ్ళు వారికి పరిచర్యచేసి, నిర్మలమైన గురువుగా ఉండి, పవిత్రాత్మశక్తి ద్వారా, వారి పాపాలను క్షమించటానికి గురువులకు అధికారం కలదు.

గురువులు దేవాలయమునకు మూలస్తంభం వంటివారు. “నీవు పేతురువు, ఈ రాతి మీద నా సంఘమును నిర్మించెదను. నరకశక్తులు దీనిని జయింపజాలవు” (మత్తయి 16:18). గురువులకున్న ఆత్మీయ శక్తి ఇటువంటిది.

గురువు వినయమును ప్రదర్శిస్తు, ప్రాణమును ధారబోయుటకు సిద్ధంగా ఉండి, ప్రేమను నిరూపించును. గురువు ప్రజలను ప్రోత్సాహించవలెను, ఆటంక పరుపకూడదు. గురువు అధికారాన్ని, పవిత్రాత్మ నడిపింపును కలిగిఉండును. గురువు లక్ష్యసిద్ధికి పాటుపాడేవాడు. సమాజంలో మానవతావిలువలు అంతరించిపోతున్న ఈ తరుణంలో ప్రజల మనస్సులలో విలువల ప్రాధాన్యతను పెంచే ఆదర్శప్రాయుడు. కులం, మతం, ప్రాంతం అన్ని పరిమితులను దాటి, ఒకే తాటిపై ప్రజలను నడిపేవాడు.

కతోలిక అర్థం ప్రకార పీఠాధిపతులు నిర్వర్తిస్తోన్న లోకరక్షా ధర్మాన్ని, వారి ద్వారానే అందుకొని, వారికి సహాయకులుగా వ్యవహరించేవారు గురువులు. వీరు గురుశ్రేణిలో నియమితులవుతారు. పీఠాధిపత్య వర్గానికి అప్పగించిన అపోస్తలిక ధర్మాన్ని సమర్థవంతంగా, ఫలప్రధముగా నిర్వర్తించడానికి తోడ్పుడుతారు.

## 1.2. ఆధ్యాత్మిక జీవితము అనగానేమి?

ఆధ్యాత్మికం అనగా సాధకుడు క్రీస్తుతో ఐక్యమై క్రీస్తుశరీరమైన తిరుసభలో పవిత్రాత్మ సహాయంతో వరప్రసాదంతో గూడిన జీవితం గడపడమే ఆధ్యాత్మిక జీవితం. గురువు క్రీస్తు రూపాన్ని స్వీకరించి, అతని ద్వారా రక్షణం పొందాలని, ఆత్మ సహాయంతో ప్రేమతో దివ్యజీవితం గడుపుతాం. దేవుని ఆత్మ మన ఆత్మను ఉత్తేజపరచి, అది దేవుని మార్గాలలో నడిచేలా చేస్తుంది. తన వరప్రసాద బలంతో మనలను పవిత్రపరుస్తుంది. ఆత్మ అనుగ్రహం లేనిదే దివ్యజీవితం గడపలేరు.

దేవుడు నరుణ్ణి తనకు పోలికగా చేశాడు. నరుడు తన కొరకు లేడు, దేవుని కొరకు ఉన్నాడు. దేవుణ్ణి చేరడం అతని ధ్యేయం. అందుకే అందరి హృదయాల్లో దేవుని పట్ల ఆకర్షణ ఉంటుంది. ఆధ్యాత్మికజీవితం మనం దేవుని వైపు మనసు తిప్పి అతని చెంతకు ప్రయాణం సాగించేలా చేస్తుంది. అతన్ని చేరితేనేగాని మన మనస్సుకు శాంతి లభించదు. అగస్తీను భక్తుడు, "ఓ ప్రభూ! మా హృదయాన్ని నీ కొరకేచేశావు. నీ యందు విశ్రమిస్తేనే గాని దానికి విశ్రాంతి లేదు" అని నుడివాడు.

నరులమైన మనం కేవలం ఆత్మ సంబంధమైన ప్రాణులం మాత్రమే కాదు. శరీరధారులం గూడ. మనకు ఆత్మ జీవితము, భౌతిక జీవితము కూడ ఉన్నాయి.

మరణం వరకు ఈ భౌతికలోకంలో వసిస్తుంటాం. కనుక మన ఆధ్యాత్మికత, ఆర్థిక సాంఘిక రాజకీయ రంగాల్లోకి కూడ ప్రవేశిస్తుంది.

ఈ రంగాలను కూడ మనం పునీతం చేయాలి. మన జీవితం ద్వారా సమాజాన్ని ఆధ్యాత్మికత సమసమాజం చేయాలి. మన ఆధ్యాత్మికతకు క్రీస్తు కేంద్రబిందువు. మన జీవితమంతా క్రీస్తుతో జీవిస్తు, ఆధ్యాత్మికతలోనే గడుపుతూండాలి.

## 1.3. యేసు ప్రభుని యాజకత్వము

యాజకత్వాన్ని గురించి నూతన నిబంధనంలో మనకు ప్రధానమైన రెండు అభిప్రాయాలు కనిపిస్తాయి. హెబ్రీయుల లేఖ యాజకత్వం అనే పదాన్ని క్రీస్తు ప్రభువుకే వర్తింపజేస్తుంది. ప్రభు క్రీస్తునే యాజకులుగా యాజకాగ్రగణ్యులుగా ప్రస్తుతిస్తుంది. అయితే, పునీత పేతురు వ్రాసిన మొదటి లేఖ ప్రకారం యాజకత్వం క్రైస్తవులందరికి వర్తిస్తుంది.

యేసు ప్రభువు ఎప్పుడు తాను నిర్వర్తించే లోక రక్షణ ధర్మాన్ని యాజకధర్మంగా భావించలేదు. యేసు ప్రభువు నిర్వర్తించిన లోక రక్షణ ధర్మాన్ని యాజకధర్మంతో సరిపోల్చి చెప్పారు. క్రైస్తవ విశ్వాసులందరు క్రీస్తు ప్రభువే దేవునికీ మానవులకు ఏకైక మధ్యవర్తి అని గాఢముగా విశ్వసించేవారు.

ఆయన మధ్యవర్తిత్వం ఆయన కొనసాగించిన, పరిచర్యల ద్వారా వ్యక్తమయింది, దేవునికి తనను తాను సంపూర్ణముగా సమర్పించుకోవడం ద్వారా కూడ యేసు మధ్యవర్తిత్వం వెల్లడయ్యింది. క్రీస్తు ప్రభువు తండ్రి దేవుని సంకల్పానికి విధేయుడుగా ఆత్మ సమర్పణ భావంతో ఆచరించిన ధార్మిక క్రియలన్నీ క్రీస్తు సమర్పించిన రక్షణబలిలో భాగంగానే కనిసిస్తాయి. అలా క్రీస్తు సమర్పించిన సిలువబలితో అప్పటి వరకు సమర్పింపబడిన బలియాగాలన్నీ సంపూర్ణమూ సార్థకము అయ్యాయని భావించాలి. ఆ మేరకు క్రీస్తు ప్రభువు రక్షణబలిని సమర్పించిన యాజకులయ్యారు.

ప్రధాన యాజకుడు అనే బిరుదును యేసు ప్రభువుకు వర్తింపజేయడానికి, పూర్వ నిబంధన గ్రంథములోని బాధామయ సేవకుడి వృత్తాంతానికీ సన్నిహిత

సంబంధం కనిపిస్తుంది. ఎందుకంటే ఇరువురు దేవునికీ మానవులకు మధ్యవర్తులు గానే నిలుస్తారు. ఇలా యూదమత నేపథ్యంలో దేవునికీ మానవులకు మధ్యవర్తిత్వం నెరపడం వలననే ప్రధాన యాజకుడికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వబడినది. ఇదే అర్థములో కీర్తనల గ్రంథ ములోని (110 కీర్తన) దానియేలు గ్రంథం (7వ అధ్యాయం) లోను, యోహాను సువార్త 18:36 వచనంలోను కనిపించే ప్రధాన యాజకత్వ ప్రస్తావన యేసు ప్రభువుకు వర్తిస్తుంది.

యేసు ప్రభువు యాజకత్వమును పొందినవాడు గురువు. ఆయన యాజకత్వ మును ప్రతిదినం దివ్యబలిపూజ ద్వారా దివ్య సంస్కారాల ద్వారా క్రీస్తును మానవుల మధ్య మహోన్నతునిగా నిల్చుంటాడు. ఈ గురువు క్రీస్తు యాజకత్వమును బడిసి, పవిత్ర జీవితం జీవిస్తూ, ప్రజలకై ప్రార్థిస్తూ పాపాలకై ప్రాయశ్చిత్తం చేస్తూ ప్రజల రక్షణార్థమై క్రీస్తుకు నైవేద్యం చెల్లించే అపరక్రీస్తు.

## 1.4. అపోస్తలులవలె క్రీస్తుతో స్నేహభావము

గురువు ఈ విధంగా అడగవచ్చు నాకు దేవునితో స్నేహమేమిటి? ఈ స్నేహమునకు ఎవరైనా మార్గదర్శకముగా ఉన్నారా? ఈ ప్రశ్నలకు సమాధానం అపోస్తలులకు క్రీస్తుతోవున్న స్నేహబంధమే తెలుపుతుంది. దేవునితో స్నేహం బంధము ఉండాలంటే అది కేవలము దైవికమైన ఉపదేశము కలిగి ఉండాలి.

ఈ స్నేహబంధమును దేవుడే ఏర్పరుచుకుంటాడు. యోహాను 15:16 మీరు నన్ను ఎన్నుకోలేదు. నేను మిమ్ము ఎన్నుకున్నాను అపోస్తులు అంతయు వదలి క్రీస్తును అనుసరించారు. అనగా వారు పూర్తిగా క్రీస్తుకు వశమయ్యారు. ఇదే క్రీస్తుపై అపోస్తలులకున్న స్నేహం. ఈ స్నేహబంధమునకై గురువులు కూడా పిలువబడ్డారు. ప్రతి గురువు కూడా తనను తాను పూర్తిగా క్రీస్తుకు అంకితం చేసుకొవాలి.

అపోస్తలులకు అర్థంకాని పరలోక రహస్యములను, వారు ఒంటరిగా ఉన్నప్పుడు క్రీస్తు వారికి తెలియపరిచారు. ప్రతి గురువు క్రీస్తుతో ఉన్నప్పుడు అర్థంకాని విషయాలు తెలుస్తాయి. తద్వారా, క్రీస్తు మీద ప్రేమ పెరుగుతుంది. ఆ ప్రేమతో ప్రజలను నడిపించవచ్చు. ఎందుకంటే ఈ గురుత్వం క్రీస్తు మనకు ఇచ్చింది. యోహాను 15:15లో నేను మిమ్ములను దాసులని పిలువక స్నేహితులని పిలచెదను.

ఏలన, నేను నా తండ్రి వలన వినినదంత మీకు విశదపరచితిని. గురువు క్రీస్తుతో స్నేహబంధం కలిగి ఉన్నప్పుడు క్రీస్తు పరలోక రహస్యములని తెలియపరుస్తారు. అపోస్తలులు ఏ విధంగానైతే క్రీస్తును ప్రతిక్షణం అనుసరించారో అదేవిధముగా గురువులు కూడా క్రీస్తును అనుసరించాలి. అప్పుడు గురుజీవితంలో ఏ సమస్యలు వచ్చిన, తనకు క్రీస్తుతో ఉన్న స్నేహం వలన ఆబాధలను సంతోషంగా స్వీకరిస్తాడు. ఈ విధముగా స్నేహబంధం మరీ పెరుగుతుంది.

## 1.5. సిలువను అంటిపెట్టుకొని ఉండుట

గురువు తన జీవితంలో సిలువను అంటిపెట్టుకొని, వ్యక్తిగతముగను, శ్రీసభ పరంగను జీవించుటకు, నిజమైన ఉపచారము చేయుటకు పిలువబడ్డాడు. సిలువ త్యాగం ద్వారా రక్షణ విశ్వాసంద్వారా సేవ అని బల్తజార్ అన్నారు. గురువు మంచి కాపరియైన బాధ్యత క్రీస్తు యందు పాలొ&గ్గనాలి. నేను మంచి కాపరిని నన్ను నా తండ్రి ఎరిగియున్నట్లు నేను నా తండ్రిని ఎరుగుదును. అట్లే నేను నా గొర్రెలను, నన్ను నా గొర్రెలను ఎరుగును. నేను నా గొర్రెల కొరకు ప్రాణమునిచ్చెదను (యోహాను 10: 14–15). గురు కర్తవ్య బాధ్యతలను అప్పగింపబడిన గురువు, క్రీస్తు కోసం వారి జీవితాలను త్యాగం చేయాలి. ఇది కేవలం ఎప్పుడైతే సిలువను అంటిపెట్టుకొని జీవిస్తామో అప్పుడే గురుత్వాన్ని వెల్లడించినట్లు ఈ విధంగా ఉన్నప్పుడు గురువు పలికే మాటలు తన కోసమో లేదా తనశక్తి ద్వారానో పలికేవి కావు ఇతరుల మంచికోసం క్రీస్తే తన ద్వారా పలుకుతున్నాడని గురువు భావిస్తాడు. గురువు ప్రతిక్షణం సిలువను అంటిపెట్టుకొనిజీవిస్తూ, క్రీస్తుతో తన జీవితాన్ని ఉంచుతూ, తన జీవితం పరిపూర్ణం చేసుకోవాలి.

గురువులు అన్నివేళలా క్రీస్తు ప్రభువు సన్నిధిలోనే నిలువడానికీ, ఆయనతో సన్నిహితంగా మెలగడానికి సహాయపడేది క్రీస్తుతో గురువుకు ఉన్న సన్నిహిత సంబంధమే. ఎందుకనగా, యేసు ప్రభువుని సాన్నిధ్యం పవిత్రమైనది, శక్తివంతమైనది, ఎంతో సుందరమైనది. ఇటువంటి ప్రభువు సాన్నిధ్యంలో గురువు ఎక్కువ సమయాన్ని గడపాలి.గురువు తనను తాను సంపూర్తిగా దేవునికి సమర్పించుకున్నాడు. గురువుకి క్రీస్తు తప్ప వేరేలోకం ఉండరాదు. గురుత్వంపై క్రీస్తుకి సంపూర్ణ అధికారం ఉంది. ఈ జీవితమంత ఆయన సొంతం. ఆయన క్రియలకే ఈ జీవితం అంకితం.

ప్రతి గురువు ప్రతి క్షణం ఆయనతోనే ఉండాలి. అలనాడు అపోస్తలులను పిలిచిన రీతిగా నేడు క్రీస్తు గురువులను పిలుస్తున్నాడు. అపోస్తలులు ఏ విధముగా ఆయనతోనే ఉన్నారో ఆయన బోధనలను ఆలకించారో ఆయన చేసిన అద్భుతకార్యాలు కనులారా గాంచారో అలానే ప్రతి గురువు ఆయనను అంటిపెట్టుకొని జీవించాలి. క్రీస్తు గురువులను పిలిచింది ఆయనతో ఉండుటకు కావున గురువులు పూర్తి సమయాన్ని క్రీస్తుకు కేటాయించాలి. ఇలా ఉన్నప్పుడు గురుజీవితం పావన పరచబడుతుంది. తద్వారా, దైవప్రజలను కూడా క్రీస్తులో నడిపిస్తూ, వారి జీవితంలో రక్షణనూ చేకూర్చినవారు అవుతారు. ప్రజల జీవితాలు కూడా, గురువువలే పావనపరచబడతాయి.

### 1.7. గురువు ప్రార్థనాపరుడు

శిష్యులు, యేసును ప్రార్థన ఎలా చేయాలి అని అడిగినప్పుడు క్రీస్తు ప్రార్థనలలో గొప్పదైన పరలోక ప్రార్థనను నేర్పారు (లూకా. 11:14). అదే విధముగా, ఎవరైతే క్రీస్తు జీవితాన్ని, ఆయన పనులను నిర్వర్తిస్తున్నారో వారు ప్రజలను ప్రార్థన ఎలా చేయాలో నేర్పించాలి. ఇదే వారి జీవితంలో శాశ్వతమైన కార్యం.

గురువు ప్రజలకు ప్రార్థన చేయడం నేర్పించాలంటే ముందు గురువు ప్రార్థనాపరుడై ఉండాలి. ప్రజలు కూడా గురువు నుండి కొరుకొనేది ఇదే. గురువు కూడా ఈ విధముగానే ఉండాలి అని కోరుకుంటాడు. బాధాకరమైన విషయం ఏమిటంటే కొన్ని సందర్భాలలో గురువు ప్రార్థనాపరుడిగా ఉండలేకపోతున్నాడు. ఈ లోక పనులలో ఎక్కువ శ్రద్ధ చూపించడం వల్ల, ప్రార్థన లేదా ధ్యానం చేయడం మరచిపోతున్నాడు. పవిత్రగ్రంథములో మగ్ధలా మరియ ఏ విధముగానైతే క్రీస్తు పాదముల దగ్గర కూర్చుని వాక్యాన్ని ఆలకించి ధ్యానించిందో అదే విధముగా గురువు కూడా ఉండాలి. కాని మార్త వలె ఈ లోక విషయాలమీద ఎక్కువ శ్రద్ధ కలిగి ఉండకూడదు. క్రీస్తు ప్రభువు ప్రతి గురువు నుండి ఆశించేది ఆయనలా (ప్రార్థనలో) ఉండటమే కాని ఆయనను మరచి ఈలోక విషయాల మీద ఆసక్తి చూపడంకాదు.

ఈ విధముగా ఉన్నప్పుడు గురువు నిజమైన సంతోషం కలిగి ఉండగలడా? నిజముగా ఉండలేడు. ముందుకంటే తనలో ఎక్కువ కోపం, బాధ, నిష్ఫలమై అవటం

చూస్తాం. 2003–2005 సర్వేలో గురువుల ఆధ్యాత్మిక జీవితం కోసం అడిగినప్పుడు 80 గురువులు సంవత్సరానికి ఒక్కసారైన ఆధ్యాత్మిక వడకంలోపాల్గంటున్నారని, 88 గురువులు సంవత్సరానికి ఒక్కసారైన పాపసంకీర్తనము చేస్తున్నామని చెప్పారు కానివ్యక్తిగతముగ ఎంత మంది ప్రార్థన చేస్తున్నారు అని అడిగినప్పుడు కేవలం 45.3 మాత్రమే అని చెప్పారు. ఇది బాధపడవలసిన విషయం. మనం దేవుని మనుష్యులం మన బాధ్యత ప్రజలకు ఎలా ప్రార్థన చేయాలోనేర్పాలి. మనకి దేవునితో ప్రార్థనానుభూతి లేకపోతే ప్రజలకు ఏ విధముగా నేర్పుతాము? ప్రార్థన గురువు బాధ్యత. ప్రార్థనను తాను ప్రతిదినం చేయాలి. ఎందుకంటే ప్రార్థన ద్వారానే దేవుని కార్యములను చేయగలం. ప్రార్థన మన శత్రువులను చీల్చి చెండాడే ఖడ్గంలా పనిచేస్తుంది. దుష్టుని తుదముటించే ఆయుధంగా సహకరిస్తుంది. విరోధులను విచ్ఛిన్నం గావించే సాధనంగా ఉపకరిస్తుంది.

గురువు చేసే ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా ఆలకించి మన్నింపు ప్రసాదించే పాపసంకీర్తన సాంగ్యము ద్వారా, ప్రజలకు అనునిత్యం బోధించే సువార్తా ప్రబోధం ద్వారా, తనలో శక్తిని కోల్పోతుంటాడు. ఆ శక్తిని తిరిగి పొందాలంటే, ఆధ్యాత్మిక బలాన్ని మరల పెంపొందించుకోవాలంటే, తప్పని సరిగా ఆయన చేతిలో ప్రార్థన అనే ఆయుధం ఉండి తీరాలి. ప్రతి గురువు దివ్యపూజాబలిని సమర్పించడం ద్వారా తన బాధ్యత తీరిపోయిందని భావింపరాదు. తన ప్రజలతో కలిసి సంఘప్రార్థన అనునిత్యం చేస్తూనే, శ్రీసభ తనకప్పగించిన అనుదిన ప్రార్థనావళిని క్రమం తప్పక జపించాలి. ఏకాంతముగా పరలోక తండ్రితో, నిత్యగురువైన క్రీస్తుతో గంటల తరబడి సంభాషించాలి. తద్వారా గురువు తన ఆధ్యాత్మిక జీవితాన్ని పెంపొందించుకుంటాడు.

### 1.8. గురువు సువార్త సేవకుడు

దైవప్రజలందరిని ఒక్కటిగా నిలిపే మొట్టమొదటి ఏకతాసూత్రం దేవుని జీవవాక్కు. దేవుని వాక్కును తరచుగా గురువు నోట వినాలని దైవప్రజలు కోరుకుంటూ ఉంటారు. దేవుని వాక్కును ఆలకించివిశ్వసింపని వారెవరు రక్షణ పొందలేరు. కనుక, పీఠాధిపతులకు సహకారులైన గురువుల ప్రథమ కర్తవ్యంమానవులందరికీ సువార్తను బోధించడం. తద్వారా వారు మీరు ప్రపంచమందట తిరిగి, సకలజాతి

జనులకు సువార్తను బోధింపుడు (మార్కు 16:15) అంటూ ప్రభు విచ్చిన ఆదేశాన్ని పాటించినవారవుతారు. దైవజన సంఘాన్ని విస్తరింపచేసిన వారవుతారు.

గురువును వాక్యపరిచర్య నుండి వేరుపరుచట కష్టతరము. గురువు ఎన్నుకొబడినది సువార్త పరిచర్య చేయుటకు మాత్రమే అనుటలో సందేహం లేదు. గురువు లేకుండా వాక్యపరిచర్య లేదు. వాక్యపరిచర్య లేకుండా గురువుకు అర్థము లేదు. అందుకేనేమో పునీత పౌలుగారు ఈ విధముగా సంబోధించారు. నిజమునకు సువార్తను ప్రకటించుటకు నేను ఆజ్ఞాపింపబడితిని. కనుక సువార్తను బోధింపకున్నచో నా పరిస్థితి ఎంతో దారుణమగును (1 కొరింతీ 9:16). కనుక, సువార్తను బోధించుట ప్రతి ఒక్కరి విధి, ముఖ్యముగా గురువుల ప్రధానవిధి.

గురువు క్రీస్తు ప్రభువు యొక్క సందేశాన్ని మాటల రూపములో ప్రజలకు బోధించే వ్యక్తి. దైవసందేశాన్ని సాధారణముగా ప్రజాసమాజానికి బోధిస్తారు లేదా ప్రజాప్రతినిధికి, రాజుకు బోధిస్తారు. గురువు ఒక ప్రవక్తగా దేవుని సందేశాన్ని మాత్రమే బోధించును. దేవుడి ఆజ్ఞానుసారం బోధించును. క్రీస్తు వాక్కును ప్రజలందరికి ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా బోధించారు. స్వయముగా క్రీస్తే ఈ లోకమునకు వచ్చి ప్రవక్తవలె ప్రధాన యాజకుని వలె వాక్యమును బోధించెను. కావున అదే పనిని ఇప్పుడు గురవులు కొనసాగిస్తున్నారు.

## 1.9. గురువు ఆధ్యాత్మిక సుగుణాలు

### 1.9.1. అణుకువ విధేయత

గురువు ఆధ్యాత్మిక జీవితం జీవించాలన్న, గురుత్వ బాధ్యతలను నిరాటకంగా కొనసాగించాలన్నా, క్రీస్తు సంఘ వ్యాప్తిలో అహర్నిశలు శ్రమించాలన్నా తప్పనిసరిగా గురువు విధేయతను కలిగి ఉండాలి.

ముఖ్యముగ ప్రభుక్రీస్తుకు విశ్వాస పాత్రుడుగ ఉండటానికి, శ్రీసభకు విశ్వాసపాత్రుడుగ మెలగడానికీ విధేయత ఎంతగానో అవసరం. ఇది జీవితాంతం గురువులో ఉండాలి. ఈ విధేయతను గురువు గురుపట్టాభిషేక సమయంలో తన మేత్రాణుల చేతిలో చేయివేసి తన విధేయతా ప్రమాణం చేస్తాడు.

ఆ విధేయత ఆ మేత్రాణులకే కాదు, శ్రీసభ మొత్తానికని మరువరాదు. తండ్రి దేవుని  ఆజ్ఞకు క్రీస్తు ఎలా విధేయించి మానవుడుగా భువిలో జీవించాడో, అలాగే ప్రతి గురువు తనను పిలిచి, గురువుగా అభిషేకించిన క్రీస్తుకు జీవితాంతం విధేయుడై జీవించాలి.

విధేయత అన్ని బలుల కంటే గొప్పదని సమూవేలు ప్రవక్త పలుకుచున్నాడు. సౌలు రాజు యావే ప్రభువు మాట మీరినందుకు, దేవుడు సమూవేలు ప్రవక్త ద్వారా ప్రబోధించిన సందేశాన్ని జవదాటినందుకు అధిక శిక్షను అనుభవించాడు (1 సమూవేలు. 15: 22-23). గురువు ఎన్ని గొప్ప గొప్ప కార్యాలు చేసినా, ఎన్ని భవనాలు నిర్మించినా, ఎన్ని సంఘాలను నెలకొల్పినా, ఎందరిని క్రీస్తు బిడ్డలుగా తయారు చేసినా ఆయనలో విధేయత లేనిచో అంతా వ్యర్థమని భావించాలి. కావున ప్రతి గురువు క్రీస్తు ఏర్పాటు చేసిన శ్రీసభకు పరమ విధేయుడై నడుచుకోవాలి. అపోస్తలుల వారసత్వాన్ని పుచ్చుకున్న జగద్గురువులకు, మేత్రాణులకు తన విధేయతను చాటి చెప్పాలి. దైనందిన జీవనయానంలో పలు అంశాలపై మేత్రాణులతో విభేదించినా, విధేయతను మాత్రం మీరరాదు. వారు ఇచ్చే ఆదేశాలను చిత్తశుద్ధితో పాటించాలి. కష్టాలలో కూడా సంపూర్తిగా విధేయతను ప్రదర్శించాలి. అలాగే ప్రతి గురువు కూడా ప్రజలను ఒక నాయకుడై నడిపించాలి. అందుకు ప్రతి గురువు దేవునికి, దైవ ప్రతినిధులకు, విశ్వ శ్రీసభకు ఎల్లప్పుడు విధేయుడై ఉండాలి. విధేయతను అతిక్రమించటం పెద్ద తప్పు. విధేయత అన్ని బలులకంటే, అన్ని మహత్తర కార్యాల కంటే గొప్పదని గురువు మరువరాదు క్రీస్తు విధేయతను ఆదర్శంగా తీసుకొని తను కూడా విధేయతతో జీవితాన్ని సార్థకం చేసుకోవాలి.

### 1.9.2. బ్రహ్మచర్యం

బ్రహ్మచర్యం అనగా దైవసన్నిధిలో ఉండటం. ఇది ఒక జీవనవిధానం. క్రీస్తు ప్రభువుని శిష్యునిగా ఉండుటకు, తన జీవితాన్ని సంపూర్తిగా క్రీస్తుకు అర్పించుటకు ఎన్నుకోబడిన వారే బ్రహ్మచారులు. క్రీస్తు కోసం, దేవుని ప్రజల కోసం ఎల్లప్పుడు జీవించువాడే బ్రహ్మచారి. అందుకే పునీత తోమాస్ ఆక్వినాస్ గారు ఈ విధముగా పలుకుతున్నాడు. "దేవుని కోసం తనను శూన్యం చేసుకున్న

వాడే బ్రహ్మచారి. శూన్యం చేసుకోవడం అనగా దేవుని సేవచేయడానికి ఎల్లప్పుడు అందుబాటులో ఉండేవాడు." (vacare deo).

వివాహానికి, వైవాహిక జీవనానికి అధిక ప్రాధాన్యత నిచ్చిన క్రీస్తు, బ్రహ్మచర్య జీవితానికి కూడా అంతే ప్రాధాన్యతనిచ్చాడు. వైవాహిక జీవితం కష్టతరమైతే అసలు వివాహం చేసుకోకుండా ఉంటేనే మంచిది అని శిష్యులు పలికితే పరలోక రాజ్యం నిమిత్తం కొందరు నపుంసకులుగా (బ్రహ్మచారులుగా) ఉన్నారన్నాడు. ఇది దైవానుగ్రహం కలవారకే సాధ్యమవుతుంది కాని అందరికి కాదు అన్నాడు (మత్తయి. 19:11,12). ఒక విధముగా చెప్పాలంటే పాతనిబంధన మొత్తం మీద అతి తక్కువ మంది బ్రహ్మచారులుగా జీవించినట్లు మనకు తెలుస్తుంది. అందులో ముఖ్యుడు యిర్మియా ప్రవక్త. ఆయన యోరుషలేము కొరకు, యావే సందేశం కొరకు అనేక శ్రమలనుభవించి చివరికి తన ప్రాణాలను ధారపోశాడు.

యేసు శిష్యులలో యోహాను ఒక్కడే బ్రహ్మచారి. మిగతా అపోస్తులంతా వివాహం చేసుకున్నవారే. అయినా తొలి క్రైస్తవ సంఘంలో బ్రహ్మచర్యకు అధిక ప్రాధాన్యత నివ్వలేదు కాని, దైవ కార్యార్థం, సువార్తా ప్రచారార్థం. సంపూర్ణంగా క్రీస్తుకి, క్రీస్తు సువార్తకి అంకితం కావాలంటే బ్రహ్మచర్యం తప్పనిసరని భావించిన శ్రీసభ, గురువులు, మేత్రాణులు బ్రహ్మచర్యం పాటించాలని నిర్ణయించింది.

బ్రహ్మచర్యం ద్వారా ప్రతి గురువు తనను తాను సంపూర్తిగా దేవునికి అంకితం చేసుకోవాలి.

ప్రభువును సంతోషపెట్టుటకు ప్రయత్నించు అవివాహితుడగు వ్యక్తి ప్రభువు పని యందే నిమగ్నమగునని పునీత పౌలు అంటున్నాడు (1 కొరింతీ. 7:32). గురువులకు క్రీస్తు కన్న ఈ లోకంలో మిన్నయైనది ఏమీ ఉండరాదు. ఇది ఒక బ్రహ్మచర్యం ద్వారానే సాధ్యం. గురువు అందరికి చెందిన వాడుగా, క్రీస్తు ప్రతినిధిగా, అందరి అభివృద్ధికై పాటుపాడే సేవకుడుగా తన జీవితాన్ని సార్థకం చేసుకోవాలంటే తప్పనిసరిగా అది బ్రహ్మచర్యం ద్వారానే సాధ్యపడుతుంది. ఈ విషయంలో గురువులకు మార్గచూపరి నిత్యగురువైన క్రీస్తు ప్రభువే.

### 1.9.3. పేదరికం

గురువుకి క్రీస్తుతో ఉన్న వ్యక్తిగత సంబంధం, తన తోటి గురువుల స్నేహబంధం పేదరికం వైపు నడిపిస్తుంది. క్రీస్తును అనుసరించుటకు వచ్చిన గురువు, ఆయననే ఒక ఉదాహరణగా తీసికొని జీవించాలి. ఎందుకనగా క్రీస్తు భాగ్యవంతుడై ఉండి కూడ, తన పేదరికము వలన మిమ్ము భాగ్యవంతులను చేయుటకు ఆయన నిరుపేద అయ్యెను (2 కొరింతీ. 8:9). ప్రతి గురువుకి ఈ లోక వస్తువులు ఒక సవాలుగ మారుతున్నాయి. అవి తన దృక్పథాన్ని మార్చివేసి, ఈ లోకమే తన జీవితం అనే భ్రమలో పడివేస్తాయి. గురువులు ఈ లోకంలో జీవిస్తునప్పటికిని వారు ఈ లోకానికి చెందిన వారు కాదు (యోహాను. 17:14). వారు ప్రాపంచిక వస్తువులను ఉపయోగిస్తునప్పటికి, వానితో సంబంధము లేనట్లు ప్రవర్తింపవలెను. క్రీస్తు ప్రభువే వారికి సమస్తము అనే భావన వారి హృయంలో ఉండాలి. ప్రభువు అహరోనుతో పలికిన విధముగా మీకు ఏ భూమియు భుక్తమునకు లభింపదు. యిస్రాయేలీయుల భూమిలో మీకు భాగము లేదు. మీ భుక్తమును, మీ భాగమును నేనే అనుకొనుడు (సంఖ్యా. 18:20). అందువలన గురువులు, వారి హృదయాలను ఈ లోక వస్తువులపై కాక, క్రీస్తు అను నిధిపై ఉంచాలి. మీ సంపద ఉన్నచోటనే మీ హృదయముందును (లూకా. 12:34).

ఈ లోక వస్తువులన్ని దేవుని చేత సృష్టింపబడినవి, అవి మంచికి కాని చెడుకు కాదు. కావున గురువులు ఈ వస్తువులను సరైన పద్ధతిలో ఉపయోగించాలి. వాటికి బానిసలు కాకూడదు. పేదరికం అనే సుగుణానుసారం జీవిస్తూ, నలుగురికి ఆదర్శప్రాయంగా ఉంటూ, క్రీస్తు అపోస్తలుల వలె జీవించాలి.

ఈ విధముగా ఉన్నప్పుడు గురువు పేదవారికి తండ్రిగా, పేదలను ప్రేమించేవాడిగా ఉంటాడు. తద్వారా, తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ ఎంతో మందిని క్రీస్తులోకి నడిపించగలడు.

ఎవరైతే తమ వెంట ఏదోకటి ఉంచుకోవడానికి ప్రయత్నిస్తారో వారు క్రీస్తు కోసం సమస్తమును ఇవ్వడానికిసిద్ధపడరు. వారు నామకరణకే గురువు. నిజమైన గురువు అనగా క్రీస్తు కోసం తన జీవితాన్ని అంతటిని త్యజించి జీవించాలి. పునీత

పౌలు గారు ఎలా జీవించారో ఆ విధముగా క్రీస్తు కోసం సమస్తమును చెత్తగా భావించాలి. ఈ విధముగా ప్రతి గురువు తన జీవితాన్ని జీవించాలి.

## 2. గురు వ్యక్తిగత జీవితంలో ఆధ్యాత్మికత

### 2.1. క్రీస్తుతో ప్రార్థనలో లీనమగుట

నిత్యగురువైన క్రీస్తు జీవితమంతా ప్రార్ధనమయము. ఆయన సంఘప్రార్థనలో చురుకుగాపాల్గొన్నారు. ఏకాంతంగా, పగలని, రాత్రని లెక్క చేయక తన జీవితంలో అధిక సమయం తండ్రితో సంభాషిస్తూ గడిపాడు. ఆయన తన సువార్త ప్రచారాన్ని ప్రార్థనతోనె ప్రారంభించాడు. యోర్దనులో బప్తిస్మం పొంది, నలువది రోజులు నిద్రాహారాలు మాని ప్రార్ధనలో తన తండ్రీతో గడిపాడు (మత్త 3:13-4:11). ప్రార్థనతోనె తన ఇహలోక జీవితాన్ని ముగించాడు. సిలువపై వ్రేలాడుతు "తండ్రీ ! నా ఆత్మను నీ చేతికి అప్పగించుచున్నాను" (లూకా 23:46) అని పలికి తనువుచాలించాడు. క్రీస్తు జీవితాన్ని, అద్భుతాలను, భోదనలను క్షుణ్ణంగా పరిశీలిస్తే ప్రతి పనిముందు, పని తరువాత ప్రార్థన చేసేవాడు.

క్రీస్తుప్రభువు తండ్రి దేవునితో, అపోస్తలులను సత్యమందు ప్రతిష్టింపచేయుటకు, వారి భోధద్వారా తనను విశ్వసించువారి కొరకు ప్రార్థించెను (యోహాను 17:15). ఓలివు కొండపై క్రీస్తు చేసిన ప్రార్థన తనను గొల్గొతా పీఠానికి నడిపించింది, ఈ ప్రార్థన గురువుకు మూలాధారము. గురువు తన ఆధ్యాత్మిక జీవితమును పెంపొందించుకొవడానికి, గురు పరిచర్య చేయడానికి, ఈ లోక సైతాను శోదనలను జయించుటకు గురువు ఎల్లప్పుడు క్రీస్తుతో ప్రార్థనలో లీనమై ఉండాలి.

పునీత పౌలు తెస్సలోనిక విశ్వాసులకు వ్రాసిన లేఖలో "సదా ప్రార్థింపుడు" (తెస్స 5:17) అని పలికిన రీతిలో గురువు ఎటు వెళుతున్న ఏ పని చేస్తున్నా, రోజులోని 24 గంటలు ప్రార్థనామయంగా సాగిపోవాలి. బాహ్యంగా ఎన్ని పనులతో మునిగి తేలుతున్నా, అంతరంగికంగా, ఆధ్యాత్మికంగా ప్రార్ధనలో మునిగిపోవాలి, ఓ కార్యం ప్రారంభించే ముందు ఆ కార్యం కొనసాగుతున్నంత సేపు, ఆ కార్యం ముగిసిన తరువాత కూడ ప్రార్థనలోనె గురు జీవితం తరించాలి. ఇలా గురువు

తన ఆధ్యాత్మిక జీవితాన్ని పెంపొందించుకుంటు, తనకు అప్పగించిన దైవ ప్రజలను కూడా ఆధ్యాత్మిక జీవితంలో నడిపిస్తాడు.

## 2.2. పవిత్రాత్మ - గురువు

గురువు అపర క్రీస్తు కాబట్టి, క్రీస్తు జీవితంలో పవిత్రాత్మ ఎలా పనిచేసిందొ తెలుసుకోవాలి. క్రీస్తు ఈ లోకంలో జన్మించిన క్షణం నుండే పవిత్రాత్మ మార్గదర్శకత్వంలో ఉన్నాడు. ఆదిలో దేవుడు ఆకాశమును, భూమిని సృష్టించేటప్పుడు దేవుని ఆత్మ నీటిపై తిరుగాడుచుండెను అప్పుడు "వెలుగు కలుగును గాక అనెను" (ఆది1:1-3). ఆ ఆత్మయే మనుష్యావతార సమయంలో మరియను ప్రేరేపించింది, "పవిత్రాత్మ నీపై వేంచేయును సర్వోన్నతుని శక్తి నిన్నావరించును అందుచేత ఆ పవిత్ర శిశువు దేవుని కూమారుదు అని పిలవబడును"(లూకా1:35). "క్రీస్తు బప్తిస్మము పొందు సమయంలో పవిత్రాత్మ పావురమువలె తనపై దిగివచ్చెను" (మార్కు1:10). ఈ విధముగా ప్రతిగురువు కూడ పవిత్రాత్మచే నింపబడతాడు, తనలో ఉన్న ఈ పవిత్రాత్మ గురువును ఎల్లప్పుడు ఆధ్యాత్మిక జీవితంలో నడిపిస్తుంది, తనకు అప్పగించిన ప్రజలను రక్షణ మార్గంలో నడిపించుటకు సహాయపడుతుంది.

మానవ రక్షణకు అవసరమైన విషయాలను పవిత్రాత్మ తెలియచేస్తుంది ముఖ్యముగా గురుత్వం ద్వారా, పునీత పేతురుగారు ఈ విధంగా పలుకుచున్నారు "క్రీస్తు ప్రభువు రానున్నాడని, ఆయన ద్వారా రక్షణకార్యం నెరవెరుతుందని ముందుగానె పవిత్రాత్మ ప్రవక్తలకు తెలియపరిచింది(1 పేతురు1:10). గురువు జీవితంలో ఏమిచేయాలో కూడ పవిత్రాత్మే తెలియచేస్తుంది. గురువు ఎల్లప్పుడు పవిత్రాత్మతో ఉన్న సంబంధాన్ని ధృఢపరచుకోవాలే గాని అశ్రద్ధ చేయకూడదు. చేసినయెడల "ధనికుడు! అబ్రహామా నన్ను కనికరింపుము నేను ఈ మంటలలో మాడిపోతున్నాను" (లూకా 16:24) అని పలికాడో అదేవిధముగా గురు జీవితమంతా బాధపడాలి. కాబట్టి గురువు పవిత్రంగా ఉండాలన్న ఇతరుల దగ్గర గౌరవమర్యాదలు కలిగి జీవించాలన్న పవిత్రాత్మ శక్తి ఎంతో అవసరం, అందుకు గురువు ఎల్లప్పుడు పవిత్రాత్మ తనలో ఉండాలని నిత్యము ప్రార్థించాలి.

### 2.3. ప్రాయశ్చిత్త సంస్కారము

క్రీస్తు అపోస్తులులకు పాపములను మన్నించు అధికారమును ఇచ్చెను "మీరు ఎవరి పాపములనైనను క్షమించినయెడల అవి క్షమించబడును మీరు ఎవరి పాపములనైనను క్షమింపనియెడల అవి క్షమించబడవు" (యోహాను 20:23) వాళ్ళ వారసులైన పీఠాధిపతులు, గురువులు ఈ పరిచర్యను అమలుచేస్తు కొనసాగిస్తున్నారు. పిత, పుత్ర, పవిత్రాత్మ పేరున పాపాలను క్షమించే శక్తి పీఠాధిపతులకు గురువులకు మాత్రమే ఉంది.

గురువులు పాపములను క్షమించు అధికారమును యాజక అభిషేకం పొందిన పీఠాధిపతుల నుండి స్వీకరిస్తున్నారు. క్రీస్తు ప్రభువు అపోస్తులకు యిచ్చిన అధికారంలో భాగస్తులగుచున్నారు. అందువలన సఖ్యతా సంస్కారంలో గురువు క్రీస్తు స్థానంలో ఉండి పాప మన్నింపును ఇస్తారు. విశ్వాసులు ఈ విషయం గ్రహించి, వారు మాట్లడేది గురువుతో కాక ప్రభువుతోనే అను భావంతో సిగ్గు బిడియం లేకుండా స్వేచ్ఛగా గురువుతో మాట్లాడాలి. గురువులు తమ వ్యక్తిగత ఆధ్యాత్మిక జీనితాన్ని సమీక్షించుకొని విచారణలయందు సమావేశమైనప్పుడు సఖ్యతా సంస్కారమును జరుపుకొని విశ్వాసులకు ఆదర్శముగా ఉంటు తన ఆధ్యాత్మిక జీవితమును పెంపొందించుకొనేవారు అవుతారు. గురువులు ఈ సంస్కారమును స్వీకరించునప్పుడు గమనించిన జనులు దాని ప్రాముఖ్యతను గ్రహించి వాళ్ళు కూడ ఆచరించుదురు. విచారణ ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను తీర్చుటలో గురువు వెనుకంజ వేయరాదు. ముఖ్యముగా సంస్కారాలను అందించుటలో అనుక్షణం వారికి అందుబాటులో ఉండాలి. ప్రతిరోజు దివ్యబలిని సమర్పించుటకు ముందు కొంతసేపు సమయం ప్రజలకై వేచివుండి వారు సఖ్యతా సంస్కారం పొంద సహకరించాలి. ఈ విధముగా గురు జీవితం ఉన్నప్పుడు తను చేసే ప్రతికార్యం సఫలం అవుతుంది. క్రీస్తు శుభ సందేశాన్ని అందిస్తు, నూరంతలుగా క్రీస్తు పొలంలో పంటను పండించగలుగుతాడు.

### 2.4. గురుత్వం – పవిత్రం

క్రీస్తుప్రభుని యాజక పదవిలో ప్రతి గురువు పవిత్రుడుగా ఉండాలి. ఆయన పాపాత్ములగు మనుజుల నుండి వేరుచేయబడి (హెబ్రీ 7:26) తన పవిత్రత చేత

మానవుల పాపాలకు పశ్చాత్తాపాన్ని దేవుని నుండి ప్రసాదిస్తాడు. కావున గురువులు పవిత్రతను పొందుటకు నిత్యము నిష్టతో, భక్తితో, దైవ భయంతో, ప్రార్థనతో, పాపములను విడనాడుతూ, పవిత్రాత్మ ఒసగు శక్తితో జీవించాలి. తద్వారా వారు తమ చుట్టు ఉన్నవారిని పవిత్రంగా ఉంచగలరు.

గురువు యొక్క నైతిక జీవనము, ఆధ్యాత్మిక జీవనము, క్రీస్తు నిగూఢ శరీరమునకు రెండు విధములుగా సంబంధం కలిగి ఉంది. గురువు పవిత్రత విశ్వాసులను పవిత్రం చేస్తుంది. క్రైస్తవుల పావనత్వము గురువులను పవిత్రంగా ఉంచుతుంది. కడరాత్రి భోజన సమయంలో క్రీస్తు శిష్యులపై పవిత్రాత్మను కుమ్మరించి ఎల్లప్పుడు పవిత్రంగా జీవించమని ఆదేశించాడు, గురువులను పావనం చేశాడు. పావనం చేసింది కేవలం వారి కోసమే కాదు ప్రజలను దైవ మార్గంలో నడిపిస్తూ, పవిత్రులుగా మలచమని కోరాడు.

ప్రతి గురువు క్రీస్తులో జీవిస్తు, ఆత్మ అనుగ్రహించే వరాలు, అనుగ్రహముల వలన ప్రజలను, పవిత్రతలో నడిపించాలి. తన ఆత్మను కాపాడుకొనుచు, తన చుట్టువున్న లేక వారికి అప్పగించిన ఆత్మలను ప్రభుదగ్గరికి చేర్చాలి. ప్రతి గురువు శ్రీసభ ఎదుగుదలకు కృషి చేస్తూ, శ్రీసభ పవిత్రతను దివ్యసంస్కారాల ద్వారా కాపాడాలి. పునీత అగస్టిను గారు పలికినట్లు గురువులు కాపలాదారులు, రాత్రనక, పగలనక ప్రార్థనతో, బోధనతో విశ్వాసులందరిని, సన్మార్గములో నడిపిస్తు పవిత్ర పరచాలి. దేవునిచే పిలవబడిన గురువులు, క్రీస్తు పలికినట్లు “ఇదిగో ఓ దేవా నీ చిత్తమును నేరవేర్చుటకు ఇట వచ్చియున్నాను” (మత్తయి 26:39) అంటూ దేవుని చిత్తాన్ని అనుసరించి పవిత్ర జీవితం జీవించాలి.

## 2.5. పరిశుద్ధ మరియమ్మ గారి మీద భక్తి

క్రీస్తు రక్షణ చరిత్రలో మరియతల్లి ప్రత్యేక స్థానం కలిగి ఉంది. మనుష్యావతార క్రీస్తుని తన గర్భంలో మోసి, గురువులకు అధిపతియైన క్రీస్తుకు తల్లి అవడం వలన ప్రతి గురువుకు ఆధ్యాత్మిక తల్లిగ నిలిచింది. ఆమె గురువులకు తన జీవిత నడవడిక ద్వారా అదర్శమూర్తిగా నిలిచింది కాని ఎటువంటి ఆధిక్యము వలన కాదు. 'ప్రభువు పలికిన వాక్కులు నెరవెరునని విశ్వసించిన నీవు ఎంత

ధన్యురాలవు' (లూకా 1:45) మరియమాత అచంచలమైన విశ్వాసము ప్రకటించింది. దేవుడుచేసిన ఏ వాగ్ధానము కూడ వ్యర్ధమైపోదని ఆయనను నమ్మిన వారు, ఆయన మీద గొప్ప విశ్వాసం ప్రకటించు వారిని దేవుడు ఏనాడు చేయివిడువడని మరియమాత తన జీవితం ద్వారా తేటతెల్లము చేసింది.

యేసుప్రభుని మరణంతో భయకంపితులయిన అపోస్తలులను ఒకటి చేసి, ఒక దరి చేర్చి, వారితో కలిసి పెంతెకొస్తు పండుగ వరకు, ఆత్మ అగ్ని జ్వాలలవలె దిగివచ్చేవరకు ప్రార్ధించింది. తన కూమారుడు ఎర్పాటు చేసిన గురుత్వానికి మరియతల్లి అండగా నిలిచింది.

అలనాడు కానపల్లె వివాహ విందులో " ఆయన చెప్పినట్లు చేయుడు" అని సేవకులతో పలికిన మరియతల్లి. "ఆయన చెప్పినట్లు చేయుడు" అని పదే పదే గురువులందరితో పలుకుతోంది. మరియ తల్లి గురువులందరికి తల్లిగ, గురువులంతా మరియతల్లి కూమారులుగా నిలుస్తున్నారు. మరియ తల్లి ప్రతినిత్యం గురువుల కొరకు, గురువుల విశ్వాస ప్రయాణం కొరకు తన కూమారుని ప్రార్ధిస్తుంది.

మరియమాత యెడల భక్తి మన క్రైస్తవ జీవన విధాననానికి ఎంతగానో ముఖ్యమైనది. రక్షణ మార్గంలో పయనించడానికి మనకు ఎంతో సహకరిస్తూ, మనకు అనేక విషయాలలోను ఒక సుమాతృకగా నిలుస్తుంది. ప్రతి గురువు కూడ ఆ తల్లి యెడల అచంచల భక్తి బావాలు కలుగి ఆమెను తమ జీవితంలో అనుసరించాలి. తమ జీవన విధానాన్ని ఆమె చూపించిన బాటలో కొనసాగిస్తూ, క్రీస్తు పభువునకు మరింతగా దగ్గరవాలి. మరియతల్లి వలె విశ్వాసంతో కూడిన జీవితాన్ని జీవించాలి. ఈ విధంగ ఆ తల్లి సహాయం, సహకారాలతో తన విచారణ ప్రజల శారీరిక, ఆధ్యాత్మిక అభివృద్ధి కొరకై కృషి చేస్తూ, తన గురుత్వ జీవితాన్ని సార్థకం చేసుకోవాలి.

## 2.6. గురువు – దైవశక్తి

గురువు ఒక దైవశక్తి. క్రీస్తు ప్రధాన యాజకత్వములో, అపోస్తలుల అధికారములో, గురువులు భాగస్తులౌతున్నారు ఈ విధంగా గురువులు దైవశక్తి పొందుతూ, ఆ దైవశక్తిని ఇతరులకు పంచుతున్నారు.

అపొస్తులుల హస్త నిక్షేపణము ద్వారా భాగస్తులగుచున్నారు. “అందువలన నాహస్త నిక్షేపణము వలన నీకు కలిగిన దేవుని వరమును సజీవముగా ఉంచవలెనని నీకు జ్ఞాపకము చేయుచున్నాను” (2 తిమోతి 1:6) ఇవి పౌలుగారు తిమోతితో పలికిన మాటలు. నాకు యాజకులుగా సేవచేయుటకై అహరోను అతని కుమారులను ప్రతిష్ఠింపవలసిన నియమమిది. అభిషేక తైలమును కుమ్మరించి అతనికి శిరస్సున అభిషేకము చేయుము (నిర్గమ 29:1,7) హస్తనిక్షేపణ, తైలాభిషేకము ద్వారా దేవునికి గురువులు నివేదించబడుతున్నారు, వీరు అపోస్తలుల వారసత్వములో పాలుపంచుకుంటున్నారు, ప్రభువుతో భాగస్తులౌతున్నారు.

పెంతెకొస్తు దినమున యేసు ప్రభువు తన అపోస్తలుల పైకి పవిత్రాత్మను పంపి తన పనికై అపోస్తులను అభిషేకించారు, తరువాత అపోస్తలలు కొంతమందిని ప్రభువు పనిలో కొనసాగటానికి ఎన్నుకొన్నారు, తద్వారా పవిత్రాత్మను హస్తనిక్షేపణ ద్వారా గురువులు కూడ అత్యంత గొప్ప శక్తిని, పవిత్రాత్మను పొందుచున్నారు. దేవుని సేవించుటకు, దేవుని పని నిమిత్తము నివేదించబడుతున్నారు.

## 2.7. గురువు దైవనుగ్రహ స్థితి

యాజకులు సర్వశక్తిమంతుడైన ప్రభువు వార్తావాహులు (మలాకి 2:7) వారు పాపపరిహరము జరిపించు దేవుని ప్రతినిధులు మరియు దేవునికి మానవులకు మధ్యవర్తులు. పాతనిబంధనలో ప్రభువు, యాజకులకు అప్పగించిన పనులలో ప్రధానమైన పని, పాపములకు పరిహారమును ఒసగుట, ఎందుకనగా పాపము మానవుని, దేవుని నుండి విడదీసింది. పాపము తొలగిపోతె మానవుడు, దేవునితో సఖ్యపడవచ్చును. తన యాజకుల ద్వారా, పాప మన్నింపు ఒసగుట అనునది రానున్న తరములలో కూడా జరగవలసిన పని. అందుకే యేసు ఉత్థానుడైన పిదప, తన శిష్యులను సమీపించి, వెళ్ళి పాపములను మన్నింప ఆజ్ఞాపిస్తున్నారు. “ఆయన వారి మీద శ్వాసను ఊది పవిత్రాత్మను పొందుడు, ఎవరి పాపములైనను క్షమించిన యెడల అవి క్షమింపబడును, మీరు ఎవరి పాపములనైనను క్షమింపని యెడల అవి క్షమించబడవు” (యోహాను 20:21-23) ఆ కారణముగానే ఈనాటి కతోలిక క్రైస్తవులు క్రీస్తుపభువు యొక్క నూతన నిబంధనులైన యాజకులైన గురువుల వద్ద

పాపములను ఒప్పుకొనుచు, పరిహారము పొంది, దేవునితో సఖ్యపడుతున్నారు. ఇటువంటి గొప్ప దైవనుగ్రహమున జీవిస్తూ, ప్రతి ఒక్కరిని దైవ ప్రేమలో నడిపిస్తూ, ప్రార్థనలో క్రీస్తుతో ఐక్యమై జీవించాలి.

## 2.8. లోక సమస్యలను అధిగమించుట

ఈ లోకం పలురకాల ఆకర్షణలకు పుట్టినిల్లు. ఆకర్షణ, వ్యామోహాలు మనలను బానిసలుగా చేసుకు0టాయి. క్రీస్తుప్రభుని పలు రకాల శోధనలతో సాతాను తన వశం చేసుకోవాలని, తన వలలో వేసుకోవాలని, తన వైపు అకర్శించి తనకు బానిసగా మలచుకొవాలని ప్రయత్నించింది. నేటి గురువులు కూడ ఈ లోక ఆకర్షనలకులోనై అనేక సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు. తాము చేయాల్సిన కార్యాలను చేయక తమ జీవితాలను, తమ సంఘస్తుల జీవితాలను ధుర్భరం చేస్తున్నారు. గురువుల జీవితాలలో ఆకర్షణ తప్పుకాదు. తప్పకుండా వారి జీవితాలలో ఆకర్షణ ఉండాలి, అది లేక పోతె వారి జీవితాలకు అర్థం ఉండదు. అయితే వారి ఆకర్షణ ఈ లోకం పట్ల దైవకార్యాల పట్ల, దైవ ప్రేమ పట్ల దైవ విస్తరణ పట్ల, క్రీస్తు సంఘ అభివృద్ధిపట్ల ఉండాలి.

గురువు ఆధ్యాత్మికమైన జీవితం, జీవిస్తున్న సమయంలోనే ఎక్కువ సమస్యలు ఎదురౌవుతాయి. సైతాను క్రీస్తును ఎడారిలో ప్రార్థన చేస్తున్నాప్పుడు ఏ విధంగా శొధించిందొ ఆ విధగానె గురువులను కూడా శోధిస్తుంది. ఈ లోక విషయాల మీద ఆసక్తిని పాటిస్తుంది, వీటిని జయించడానికి క్రీస్తుప్రభువు తండ్రి దేవునితో ఎలా ప్రార్థనలో గడిపాడో, గురువులు కూడా ప్రతి క్షణం ప్రార్థనలో గడిపాలి.

గురువు ఈ లోకుల మధ్య జీవిస్తున్నా, అందరిలో ఒకడిగా ఉంటునె తన ప్రత్యేకతను చాటుకోవడంలోనే తన గొప్పతనం. ప్రతి గురువు తాను దేనిపట్ల ఎక్కువ ఆకర్షితుడవుతున్నాడో గ్రహించి అది ఈ లోక పోకడల పట్లయితే మార్చుకొని దేవుని పట్ల, దేవుని కార్యాల పట్ల ఆకర్షణను, ఆపేక్షను పెంచుకునేందుకు ప్రయత్నం చేయాలి. అపర క్రీస్తుగా మనగాలంటే తప్పనిసరిగా దైవ ప్రణాళిక ప్రకారం జీవిస్తూ, ఈ లోక సమస్యలను అధికమించి ముందుకుసాగాలి.

## 2.9. ఆరాధన – పనియందు సమానత్వము

గురువులు పిలవబడింది క్రీస్తుతోనుండటానికి, సువార్త ప్రకటనకు పపుటకు (మార్కు 3:14). గురువు ఎల్లప్పుడు క్రీస్తుతో ఉంటు, ఆయననే ప్రేమిస్తు, సేవిస్తూ నిండు ఆరాధన కలిగి జీవించాలి. తద్వారా తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలి. ప్రజల భాద్యతలను నిర్వహించేటప్పుడు మంచి కాపరులుగా ఉండాలి. వారు చేసే పనియందు లేకుండా స్వార్ధరాహిత్య, పరోపకార పరాయణత్వం గురువులలో మూర్తీభవించి ఉండాలి. తమ ప్రయోజనాలకు తమ సదుపాయలకు ప్రాధాన్యతనివ్వకుండా ఎల్లవేళల సంఘ పరిచర్యలో మరింత ప్రగతిని సాధించడానికి ప్రయత్నించాలి. అవసరమైనచోట తమ క్రైస్తవ సంఘాల ఆధ్యాత్మిక వికాసం కోసం సరికొత్త కార్యక్రమాలను రూపొందించి, అమలు చేయడానికి సిద్ధముగా ఉండాలి. ఈ విధముగా గురువు ప్రజలను ఆధ్యాత్మికతను, శారీరికంగాను ముందుకు నడిపిస్తూ తనకు అప్పగించిన గురుతర పనులను నేరవేర్చినవాడు అవుతాడు. ఈ గురుతర పనులను నేరవేర్చుటకు గురువుకు ఎంతో శక్తిసామర్థ్యములు అవసరం, అవి నిరంతర ప్రార్ధన, ఆరాధన ముఖ్యముగా ప్రేమబలియైన 'దివ్యబలి' సమర్పణం ద్వారా లభిస్తాయి. ఇవి గురువులు నిత్యము చేస్తున్నప్పుడు ఆరాధన పనియందు సమానత్వం కలిగి ఉంటాడు.

## 2.10. గురువులకు ఆదర్శప్రియుడు – జాన్ మరియ వియాన్ని

పునీత జాన్ బాప్టిస్ట్ మరియ వియాన్ని గారు ఫ్రాన్స్ దేశంలోని డర్డీలీ గ్రామంలో 1786లో జన్మించారు. ఆయన 1815లో గురుపట్టం పొందారు. 1818 నుండి 1859 వరకు ఆర్స్ అనే చిన్నగ్రామంలో విచారణ గురువుగా పనిచేశారు. దైవభక్తి నశించిన ఆ గ్రామాన్ని మరల దైవభక్తిలో నడిపిచారు. ఆ గ్రామంలోనే విచారణ కర్తలుగా సేవలు అందించి 1859 లో తన 73వ ఏట కన్నుమూశారు. 1925 లో ఆయనకు అర్చ్యశిష్ట పట్టం లభించింది. పాపుగార్లు ఆయనను 1926 లో విచారణ గురువులకు, 2009 లో గురువులందరికి పాలకార్చ్యశిష్టులుగా నియమించారు.

## 2.10.1. గురువుపాత్ర

క్రైస్తవ సమాజంలో గురువు పాత్ర పట్ల వియాన్నిగారికి అపారగౌరవం ఉండేది. ఆయన మాటలల్లో చెప్పాలటె "గురుపట్టం లేకపోతే మనకు ప్రభువు లభించడు" దేవున్ని సత్రప్రసాద మందసంలో ఉంచినది.

ఎవరు? జీవితారంభంలో మన ఆత్మకు స్వాగతం చెప్పింది ఎవరు? ఆధ్యాత్మిక ప్రయాణంలో దివ్యభోజనాన్ని అందించి మన ఆత్మకు బలం చేకూర్చింది ఎవరు? మన ఆత్మ పాపంవల్ల చనిపోతే మళ్ళా జీవంతో లేపి దానికి నెమ్మదినీ శాంతినీ ప్రసాదించింది ఎవరు? దేవుని చెంతకు చేరుకోవడానికి మనాత్మను సిద్ధం చేసేది ఎవరు? గురువే. దేవుని తరువాత గురువే అన్నిటికి ఆధారం. గురువు లేకపోతే క్రీస్తుశ్రమలు, మరణం వ్యర్థమైపోతాయి. వాటి ఫలితం మనకు దక్కదు. నేడు క్రీస్తు రక్షణ కార్యాన్ని మన మధ్యలో కొనసాగించుకొనిపోయేది గురువే. అతని పలుకులకు స్పందించి దేవుడు రోజు స్వర్గం నుండి దిగివచ్చి చిన్న అప్పములో ప్రత్యక్షమవుతున్నాడు. అతడు ప్రభువు సంపదలను మనకు పంచియిచ్చె గృహనిర్వహాకుడు. దేవుడు విచారణకిచ్చే గొప్పవరం భక్తిగల గురువే. ఇటువటి బాద్యతలను సంపూర్తిగా నిర్వహించినవాడు పునీత జాన్ మరియవియాన్ని గారు ఈ బాధ్యతలను నిర్వహించడానికి పిలవబడిన గురువులు ప్రతిక్షణం వాటిని నెరవేర్చడానికి ప్రయత్నం చేయాలి.

## 2.10.2. దివ్యసత్రప్రసాదంపై భక్తి

పునీత వియాన్ని గారు రాత్రి ఒంటి గంటకే లేచి దేవాలయంలోకి వెళ్లి ప్రార్థన చేసేవారు, సాయంత్రం త్రికాల జపం చెప్పేవరకు అక్కడే వుండేవాడు. దేవాలయం ఆయన నివాసించే గదియైపోయింది. ఇల్లు కంటే గుడిలోనె ఎక్కువ కాలం గడిపేవాడు. గుళ్ళో సత్రప్రసాద మందసం ముందు సాష్టాంగపడి ప్రార్థన చేసేవాడు. విశ్వాసులకు కూడ సత్రప్రసాద భక్తి నేర్పేవాడు. "ప్రభువు ఈ మందసంలో ఉన్నాడని మనకు తెలుసు, అతని ముందు మన హృదయాలను విప్పుదాం. ఆ ప్రభుని దివ్య సన్నిధిలో ఆనందిద్దాం. ఇదే ఉత్తమమైన ప్రార్థన. సోదరులారా రండి!

సత్ర్రసాదంలో యేసుని స్వీకరిద్దాం. మనం జీవించేది అతని వల్లనే సుమా” అని ప్రజలకు చేప్పేవాడు. అపారమైన ప్రేమభావంతో సత్ర్రసాదంవైపు పారజూచేవాడు.

ఎన్ని మంచి కార్యాలయిన దివ్యపూజకు సమానంకావు. అవన్ని నరుల కార్యాలు. ఇది దేవుని కార్యం, గురువుకి భక్తి లోపించడానికి కారణం దివ్యపూజను భక్తితో సమర్పించకపోవడమే, భక్తి లేకుండా వాడుక ప్రకారం పూజచేసే గురువును చూచి మనం ఎంతైనా విచారించాలి అని చేప్పేవాడు. కావున వియాన్ని ఆదర్శాన్ని స్వీకరించిన గురువు ఆయన వలె దివ్య సత్ర్రసాదంపై భక్తి పెంపొదించుకొని క్రీస్తు అడుగుజాడలో నడుస్తూ, తన ఆధ్యాత్మిక జీవితమును రెట్టింపు చేసుకుంటు, ఇతరులను కూడా వియాన్నిగారి వలె క్రీస్తు అడుగుజాడల్లో నడిపించాలి.

## 2.10.3. పాపసంకీర్తన సంస్కారం మీద భక్తి

పునీత వియాన్నిగారు రోజు 16 గంటలకు పైనె దేవాలయంలో కూర్చుండి పాపసంకీర్తనాలు వినేవాడు. ఒక్క ఫ్రాన్సు నుండే కాక ఇతర దేశల నుండి కూడ భక్తులు ఆయన దగ్గరకు వచ్చి పాపసంకీర్తనం చేసేవాళ్ళు. పక్కనే ఉన్న లియోను పట్టణం నుండి రోజు రెండు బస్సుల యాత్రికులను అర్స్ గ్రామానకి కొనివచ్చేవి. వియాన్నిగారు పాపసంకీర్తనంలో ప్రజలకు ఆధ్యాత్మిక సలహాలు ఇచ్చేవాడు. 40 ఏళ్ళ పాటు రోజు 300 మందిదాకా ఆయన దగ్గర పాపసంకీర్తనం చేసికొని పాపపరిహారం పొందుతువచ్చారు. ఆ భక్తుడు వారిని క్రీస్తు నెత్తుటిలొ కడిగి శుద్ధి చేసేవాడు. ఆస్పత్రి రోగులతో నిండిపోయినట్లుగా ఆర్స్ దేవాలయం పాపాలకు పశ్చాత్తాపపడే భక్తులతో నిండిపోయేది.

వియాన్నిగారు పాపసంకీర్తనం గూర్చి ఇలా చెప్పేవారు “పాపసంకీర్తనంలో నరుడు దేవుని దగ్గరకు రాడు, దేవుడే నరుని చెంతకు వచ్చి అతడు తన దగ్గరకు తిరిగి వచ్చేల చేస్తాడు. దేవునుకి మనం మరల పాపంలో పడిపోతాము అని తెలుసు, ఐనా అతడు మన పాపాలను కరుణతో క్షమిస్తూనే ఉంటాడు. పాపసంకీర్తన సంస్కారం వల్లె మనకు మనశ్శాంతి కలుగుతుంది. గురువులు దీనిని అశ్రద్ధ చేయకూడదు. గురువులు వారి జీవితంలో నెలకు ఒక్కసారియైన ఈ దివ్యసంస్కారం చేయాలి.

తద్వారా గురువు యొక్క ఆధ్యాత్మిక శక్తి పెరుగుతుంది. ఈ సంస్కారాన్ని ఇతరులకు ఇచ్చేటప్పుడు, తన జీవితం ద్వారా ప్రజలను దైవ ప్రేమలో నడిపించగలడు.

## 3. సమాజంలో గురువు ఆద్యాత్మిక జీవితం

### 3.1. గురువు – సమాజం

ప్రతి గురువు సమాజం నుండి ఎన్నుకొనబడి, ప్రజలకు పరిచర్యలు చేయడానికే నియమింపబడతాడు. ప్రతి గురువు గుర్తించవలసిన విషయం ప్రజల మధ్య, ప్రజలతో, ప్రజల కొరకు జీవించుటకు తాను గురువుగా అభిషేకం పొందానన్న సత్యాన్ని మరువక, తాను ఎక్కడ ఎలాంటి సంఘ సమాజంలో జీవస్తున్న, వారితో ప్రేమబంధాన్ని ఏర్పరచుకోవాలి కాని అహంభావాన్ని, గర్వాన్ని, ఆధిపత్యాన్ని చెలాయించకూడదు. క్రీస్తు నాయకుడు, గురువు, బోధకుడైనా సేవ చేయుటకే వచ్చానని మార్కు 10:45లో పలికి కడరా భోజన సమయంలో తన శిష్యుల పాదాలు కడిగి తన మాటలను చేతల ద్వారా చూపించిన క్రీస్తు ప్రతినిధులుగ ఉన్న ప్రతి గురువు సేవక రూపం దాల్చాలి. అంతేకాకుండ తన మందలోనే అనగా సమాజంలో తనలో జీవిస్తున్న ప్రతి ఒక్కరి గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలి వారి ఆధ్యాత్మిక, శారీరక అవసరాలను గుర్తించి, వారు అడగక పోయినా తీర్చేందుకు ప్రయత్నించాలి. ముఖ్యముగ సమాజ అభివృద్ధి కొరకై ప్రార్థించాలి.

సమాజంలో జీవిస్తున్నప్పుడు గురువుకి ఈ లోక సమస్యలు ఎన్నో ఎదురౌతాయి. ఆనాడు జనం ఏ విధంగానైతే క్రీస్తుని ద్వేషించి, అవహేళన చేసారో అదే విధంగ ఈనాడు జనం కూడా స్వార్థంతోనె దురాశతో, మూర్ఖత్వంతో జీవిస్తూ ఎదుటివారిని పట్టించుకోకుండా, నేను, నా జీవితం అనే స్వార్థంతో ఉంటు, వారి స్వలాభాల కోసం ఎదుటివారిని నాశనం చేస్తున్నారు. ఇలాంటి సమాజంలో ఉంటున్న గురువు ఎలాంటి మానవత్వం కలిగి జీవిస్తున్నాడు. క్రీస్తు ప్రభువు సమాజం బాగుండాలని ముఖ్యముగ ఆయనను హింసించిన వారి కోసం తండ్రి దేవునికి ప్రార్థన చేస్తాడు. గురువులు కూడా ప్రతినిత్యం సమాజం బాగుండాలని, దైవానికి దివ్య పూజలు, విన్నప ప్రార్థనలు కృతజ్ఞతా స్తుతులు అర్పించాలి. తద్వారా ఎంతో

మందిలో ఆధ్యాత్మికతను పెంచినవాడు అవడమేకాకుండ, తను కూడా క్రీస్తులో తన ఆధ్యాత్మిక జీవితాన్ని పెంపొందించుకున్నవాడు అవుతాడు.

## 3.2. క్రీస్తువలే గురువు ప్రజల కోసం

క్రీస్తు దేవుడై ఉండి కూడా ఒక మానవునిగ ఈ లోకంలో జన్మించి, దేవుని సన్నిధి నుండి దూరమైన ప్రజలను మరల తండ్రి దరికి చేర్చడానికి తన ప్రాణాలనే దారపోసాడు. తను ఈలోకంలో జీవితాంతం ప్రజలకు సేవచేయాలని, వారి యొక్క ఆధ్యాత్మిక, శారీరక రుగ్మతులనుండి కాపాడలని ఆశించాడు. తన దగ్గరకు వచ్చిన ప్రతి వారిని ప్రేమతో ఆదరించాడు. ఈవిధంగానే ప్రతి గురువు కూడా ప్రజలను కాపాడాలి. ఎందుకంటే గురువు పిలువబడింది క్రీస్తుతో ఉండుటకు, తన ప్రజలను ఆయనలో నడిపించుటకు కాబట్టి గురువులు వారి జీవితాన్ని వారి స్వంత స్వలాభాల కోసంకాక ప్రజల శ్రేయస్సు కొరకు ఉపయేగించాలి.

ప్రజల జీవితంలో సమస్యలు ఉన్నప్పుడు, గురువు దగ్గరికి వస్తారు కారణం ఆయన క్రీస్తు సేవకుడు కాబట్టి అలాంటి సమయంలో వారి సమస్యలకు పరిష్కారం చూపించాలి అందుకోసం ప్రతిదినం ప్రార్థన చేయాలి. వారి సమస్యలను క్రీస్తుకు అర్పించాలి క్రీస్తు ఏవిధంగానైతే అపోస్తులులను, తనను శిక్షించిన వారిని తండ్రికి అర్పించాడో అవిధంగా గురువు చేయాలి.

గురువు కేవలం తన ప్రజలతో మాత్రమే కాకుండ తాను నివసిస్తున్న పరిసరాలలోని ప్రతి ఒక్కరితో సఖ్యత కలిగి జీవించాలి. వారందరికి క్రీస్తు ప్రేమను, సేవలను తన మాటలద్వారా జీవితంద్వారా బోధించాలి. క్రీస్తు వలె నిరంతర కృషి వలన మేలు చేయుటయందు నిమగ్నులు కావాలి. క్రీస్తు ఏ విధంగా వాక్కు రూపంలో మానవాళికి రక్షణ భాగ్యం తెచ్చారో, కాపరిగా తన ఆదరణను స్థాపించారో, యాజకునిగా తన ప్రాణాన్ని ప్రజల రక్షణార్థమై వినియోగించారో, గురువు కూడా క్రీస్తు బాటను కనుగొని, క్రీస్తుని ప్రజల మధ్య ప్రత్యక్ష పరచి, తన జీవితాన్ని విలువైనదిగ ఉంచుకోవాలి. మరీముఖ్యంగా మన దేశంలో, మన రాష్ట్రంలో ప్రతి గురువు ఎంతో మంది అన్య మతస్థుల మధ్య జీవిస్తున్నాడు. వారందరి మారు

మనస్సు కొరకు, వారందరు క్రీస్తును నమ్ముకొని ఆయన అడుగు జాడలలో నడుచుట కొరకు ప్రతి నిత్యం ప్రార్థించాలి.

## 3.3. గురువు అన్ని పనులయందు అందరివాడు

గురువు చేసే ప్రతి పనికూడా ప్రజలను ఆధ్యాత్మిక జీవితంలోకి నడిపించడానికే తన జీవితాన్ని దేవునికి అంకితమొనర్చుకున్నాడు. విశ్వసనీయతతో తనకు అప్పగించిన ఆత్మల పెడత్రోవ పట్టకుండా జాగ్రత్త వహిస్తారు. మానవునిగా దేవుని కార్యాన్ని నిర్వర్తించటం, ప్రేమ పాలనతో పరలోక భాగ్యాన్ని అందరు ప్రత్యక్షంగా పొంద ప్రయాసపడుతుంటారు. తనకు అప్పగింపబడిన ఏ ఒక్కరు నిరాశచెందక, ఆశతో జీవించేలా అహర్నిశలు కృషిచేస్తారు. నిరంతరం మెలకువతో శత్రుభారినుండి మందకు రక్షణను కల్పిస్తారు.

గురువు సువార్త ద్వారా ప్రజలను చైతన్యబాటలో నడుపుతూ, ప్రతి మనిషి దేవుని ప్రేమానుభూతిని అనుభవించేలా చేస్తాడు. అదే విధంగా గురువు కూడా తాను బోధించే వాక్కుతో దేవుని ప్రత్యక్షతను చూపించును. ఏలన దేవుడు దేవుని వాక్కు అనునవి రెండు వేరుకాదు. దేవుడే వాక్కు, వాక్కే దేవుడు "ఆదిలో వాక్కు ఉండేను ఆ వాక్కు దేవుని యొద్ద ఉండెను ఆ వాక్కు దేవుడై ఉండెను" (యోహాను 1:1). గురువు చేసే బోధనల ద్వారా విశ్వాసుల ఆధ్యాత్మిక దాహమును తీర్చును. ఆధ్యాత్మిక జీవితమును తీర్చిదిద్దును. ఆధ్యాత్మిక జీవితములో ఎదురయ్యే అవరోధాలు అధిగమించుటకు దారిచూపును. దేవునికి మనుజులకు మధ్య వారిధిగా విశ్వాస జీవిత యానములో తోడుగ వుండును.

గురువు ప్రజలకు ఇచ్చే ప్రతి దివ్య సంస్కారము ద్వారా వారిని దేవుని దరికి చేర్చడమే కాకుండ, వారు ఎల్లప్పుడు ఆధ్యాత్మిక జీవితంలో జీవించేలాగున ప్రయాసపడతాడు. ప్రజలు చేసే ప్రతి పనియందు గురువు యొక్క ప్రోత్సాహం చూపించాలి. వారు చేసే ప్రార్థనలుకాని, రోజువారి పనిపాటలు కాని ఈ విధంగ ఉంటునప్పుడు ప్రజలు ఎటువంటి పాప కార్యములకు బానిసలు కాకుండ కాపాడ కలుగుతారు. అందుకని ప్రతి గురువు క్రీస్తువలె ప్రజల రక్షణకై ప్రతిక్షణం కృషి చేయాలి.

## 3.4. ప్రజలతో జీవించేవాడు

గురువు ప్రజలలో ఒకరు. గురువు విశ్వాసులలో ఒకరు. అందుకే తప్పనిసరిగా అటు ప్రజలతో ఇటు విశ్వాసులతో ఆత్మీయ ప్రేమ బంధాన్ని పెంచుకోవాలి. ప్రతి గురువు ప్రజల కోసం జీవించేవాడు. గురువులు అభిషేకం పొందింది అందుకే ప్రజలలో ఉంటు వారందరిని ఐక్యమత్యంతో ఉండేలా చూడాలి. ఈ విధంగా ఉంచాలనుకున్నప్పుడు ఎన్నో సమస్యలు ఎదురౌతాయని కొందరు అంగీకరిస్తారు, కొందరు తృణీకరిస్తారు. కొందరు ప్రేమిస్తారు, కొందరు ద్వేషిస్తారు. అయినా గురువు మాత్రం ఎవరినీ ద్వేషించకూడదు. అందరిని ప్రేమించాలి, గౌరవించాలి. అందరితో మాట్లాడుతూ, ప్రోత్సహిస్తూ, వారి కొరకే తన జీవింతమని గ్రహించాలి. మంచి కాపరి తన గొర్రెల కొరకు ఎలా తన ప్రాణాలనర్పిస్తాడో, గురువు కూడా తన ప్రజల కొరకు ప్రాణాలర్పించేందుకు సహితం వెరవరాదు, వెనుకాడరాదు.

ప్రజలతో జీవిస్తున్న గురువు వారిని ఒకే త్రాటిపై నడిపించాలంటే దేవుని వాక్యం ఎంతో అవసరం. అదే వారిని ఐక్యమత్యంగ ఉంచుతుంది. విశ్వాసులు గురువు చేసే బోధనను ఆలకించి విశ్వసించాలి లేనిచో దేవుని నిరాకరించినట్లగును "మీ మాట ఆలకించువాడు నా మాటలను ఆలకించును మిమ్ము నిరాకరించువాడు నన్నును నిరాకరించును" (లూకా 10:16) గురువు ప్రజల మధ్య దైవ సంబంధం ఉన్నప్పుడు వారి జీవితాలు ఎంత ఆనందంగా, సంతోషంగా ఉంటాయి.

ప్రతి గురువు తనకు అప్పగించిన సంఘాన్ని కంటికి రెప్పలా కాపాడుతూనే, తన సంఘానికి చెందనివారిని, క్రీస్తు సంఘాలుగా ఏర్పడి వేరుగా జీవిస్తున్న వారిని ఒకే మందగా, ఒకే కాపరి క్రిందకు తీసుకొనిరావాలి. ప్రతి ఒక్కరు తన ప్రజలు కాబట్టి ఈ ప్రయత్నంలో కొన్ని పర్యాయాలు గురువుకు నిద్రాహారాలకు కూడా సమయముండకపోవచ్చు. సువార్తా ప్రచారంలో మునిగిపోయిన క్రీస్తుకు, ఆయన శిష్యులకు వేళకు భుజించుటకైనను సమయం దొరకలేదు. గురువు కూడా తన సమయాన్ని అంతటిని ప్రజల కొరకై వినియోగిస్తూ జీవించాలి. ప్రతి ఒక్కరి జీవితాలలో మార్పుకు ప్రయత్నించి తన నిత్య గురువైన క్రీస్తుని ఆనందభరితుని చేయాలి.

## 3.5. ఆధ్యాత్మిక వరములను పంచేవాడు

గురువు పవిత్రాత్మ వరములతో నింపబడే పవిత్ర వ్యక్తి తన జీవితంలో ఆధ్యాత్మిక వరాలను తన హృదిలోనింపుకొని, తనను తాను పవిత్రపరచుకుంటు, దివ్యసంస్కారాల ద్వారా దైవప్రజలను పవిత్రపరచే దేవుని విశ్వాసి. తను ఎల్లప్పుడు ఆత్మలరక్షణార్థం కొరకు స్పూర్తిని చూపే వ్యక్తి కతోలికేతరలకు సువార్త సందేశాన్ని అందజేయడానికి, వారిని రక్షణమార్గం చూపడానికి అనుక్షణం దివ్యసత్ప్రసాదం ముందు తన రెండు కాళ్ళతొ మొకరించి ప్రార్ధించేవాడు. గురువు విశ్వాసాన్ని, నమ్మకాన్ని, దైవప్రేమను పెంపొందిస్తూ, దైవమార్గంలొ నడిపించడానికి ప్రయత్నిస్తాడు. అదేవిధంగా క్రీస్తు ప్రేమలొ దృఢంగ పాతుకుపోయి, ప్రజలందరిని దినదినము క్రీస్తుప్రేమను, సోదరప్రేమను అందిస్తాడు. దివ్యబలిపూజద్వారా ప్రజలందరిని ఆధ్యాత్మికంగా బలి సంపన్నులను చేస్తు, దైవార్చనలొ భక్తిశ్రద్దలతొ నడిపించుటకు సహాయపడతాడు. పశ్చాత్తాప సంస్కారం ద్వారా దైవ ప్రజల పాపాలను సంపూర్ణంగా శుద్ధిచేసి, దేవునిలో పవిత్రపరచి, ఆయన అనుగ్రహములను అందచేస్తాడు.

గురువు ఆధ్యాత్మిక కాపరి కనుక తన సంఘంలోని ప్రతి ఒక్కరిలోను క్రైస్తవ విలువలను పొందడానికి, ఆయన వెలుగులో నడవడానికి, ప్రతిక్షణం ప్రార్ధనచేస్తు, వారందరిని ఒక్కటిగ చేసి మంచి సంఘంగ నిర్మించడానికి ప్రయాశపడతాడు. క్రైస్తవ జీవితంలొ పుట్టినప్పటి నుండి మరణించే వరకు గురువు అవసరం. ఆయన ప్రతి ఒక్కరి జీవితంలొ ఎన్నో వరములను పోందుటకు, క్రీస్తు ప్రేమలొ నడుచుటకు తన జీవితాన్నే ఒక వరముగ ఇస్తాడు. దివ్యసంస్కారాలు ద్వారా ప్రజలను ఆధ్యాత్మిక వరములతో నింపుతూ, పవిత్ర మార్గంలొ నడిపిస్తాడు.

## 3.6. ఆత్మల కాపరి– విశ్వాసుల పోషకుడు

గురువు ఆధ్యాత్మిక కాపారి. కాపరి తన గొర్రెల మందను ఎంత మృదువుగ పెంచి వాటి కొరకై ప్రతిక్షణం కష్టపడి, మంచి కాపారిగా చూచుకుంటాడు. ఎందుకంటే అవే ఆయన జీవనాధారము. సామాన్య గొర్రెల కాపరే తన మందకొసం రేయింబవళ్ళు కష్టపడితే, క్రీస్తుమందకు కాపరులుగ పిలువబడిన గురువులు,

తమమందను దైవవాక్కుతో, ప్రభుశరీర రక్తాలతో ముఖ్యముగా వారి జీవితాలద్వారా ప్రతి ఒక్కరి ఆత్మలను కాపాడాలి.

ప్రతి గురువు ఒక తండ్రిలా క్రీస్తువలె ఒక సేవకుడిగా ఉంటూ, ప్రజల ఆత్మీయ, భౌతిక అభివృద్ధికై పాడుపడుతూ, ఎల్లప్పుడు విశ్వాసంలొ నడపాలి. ప్రజలను నీతిమార్గంలో నడిపించుటకు గురువు నైతిక విలువలను కలిగి జీవిస్తూ, పవిత్రంగ ఉంటూ, వారిని ధర్మమార్గంలొ నడపాలి. సమస్యల వలయంలొ చిక్కుకున్నవారి బాధలు అర్థం చేసుకొని వారికై సమయాన్ని కెటాయించి నిజ దేవుడును, తండ్రియైన దేవుని వద్దకు తన మందను చేర్చుటకు కృషిచేయాలి.

## 4. నేటి భారతదేశంలో గురువు పాత్ర

నేటి భారతదేశంలో గురువు పాత్ర ఎలా ఉండాలి ? అతడు ప్రజలకు ఏలాంటివాడుగా కన్పించాలి? . ప్రధాన గురువైన క్రీస్తు అతనికి ఆదర్శం కావాలి. క్రీస్రులోని ముఖ్యంశం అతని "అబ్బ" అనుభవం. కనుక గురువు తండ్రికి ప్రార్థన చేసుకొని, తండ్రిని పూర్ణంగా అనుభవానికి తెచ్చుకొని, క్రీస్తు గుణగణాలను పరిపూర్ణంగా అలవర్చుకొని, ప్రజలకు అందుబాటులో ఉండాలి.

### 4.1. స్వార్థంను త్యజించుట

తనసొంత లాభమును, ఉద్దేశ్యములను గూర్చి ప్రాకులాడుటమే స్వార్థము. స్వార్ధంను విడనాడి జీవించవలెనని క్రైస్తవ మతం బోధిస్తుంది. ఎందుకన, క్రీస్రు తన జీవితమంతా స్వార్థంను విడనాడి జీవించెను. కనుక పౌలుగారు ఫిలిప్పీ 2: 6-11 లోఈ విధంగ తెలియపరుస్తున్నారు "ఆయన దేవుడైనప్పిటికి తనను తాను రిక్తుని చేసుకొని, మానవరూపమెత్తెను." తన ప్రాణన్ని సహితం లెక్కచేయక, నిరాశ్రయంగా, నిస్సహాయంగా మారి మానవుల రక్షణార్థం సిలువపై కన్నుమూసెను. అటువంటి స్వార్థరహిత క్రీస్రు తనలా జీవించడానికై అపోస్రులను ఎన్నిక చేసెను. అపోస్తులుల తదుపరి గురువులు కూడా స్వార్థమును వీడి జీవించవలసిన బాధ్యత ఎంతైన ఉంది. నేటి తిరుసభ లోక వ్యామోహాల్లో మునిగి పోకుండా చూసుకోవలసిన బాధ్యత గురువులదే. అందుకుగాను గురువులు నిరాడంబరంగాను, లౌకిక వ్యామోహాలకు లొంగక, తమ స్వార్థమును చూసుకొనక జీవించాలి. మరి ముఖ్యంగా

నేటి భారతదేశంలో గురువుల పాత్ర సామాన్య ప్రజలకు విభిన్నంగా ఉండాలి. తాము అనుసరించే ప్రధాన యాజకుని పోలి ఉండాలి. క్రీస్తు ఏ విధంగా అయితే తండ్రి దేవుని గుణాలను కలిగి ఉన్నారో అదే మాదిరిగా నేటి గురువులు క్రీస్తు సుగుణాలను కలిగి జీవించాలి. తండ్రిని సేవించి, తండ్రి కొరకు క్రీస్తు అన్నీత్యాగం చేసినట్లుగా గురువులు కూడా క్రీస్తును సేవించి సకలము త్యాగం చేయగలగాలి. తన, మన అనే భేదం లేకుండా సంస్కారాలను, దివ్యబలిపూజను జరిపించునప్పుడు సాక్షాత్తు క్రీస్తు సిలువపై మరణించిన రీతిన తమను తాము అర్పించుకొవాలి. నా కుటుంబం, నా కులం, నా గ్రామం, నా...నా అనే ధోరణిని విడనాడి జీవించాలి. విశాల దృక్పథం కలిగి అందరూ నా వారే అని జీవించాలి. ప్రభువు లోక వ్యామోహాల్లో చిక్కుకోలేదు. దురాశ, కామం, స్వార్థం, ద్వేషం, మొదలైన దుర్గుణాలకు క్రీస్తు లొంగలేదు. ఆత్మత్యాగం, సేవ ఆయన ముఖ్య లక్షణాలు. సంపూర్ణమైన త్యాగము క్రీస్తు సిలువ మరణము. ఈ త్యాగబలి వలన ప్రజలకు దేవునితో అనుసంధానమయ్యే మార్గం ఏర్పడెను.(ఎఫెస్సీ 2:18) దేవునితో అనుసంధానం కావాలంటే సంపూర్ణమైన యాజకుడు, సంపూర్ణమైన బలి గొఱ్ఱపిల్లయైన క్రీస్తుతో కలసి తమను తాము అర్పించుకొనవలెను. ఇదంతా దివ్య బలిపూజ ద్వారా మాత్రమే సఫలమగును. ఇటువంటి అద్భుతమైన పరమ రహస్యములను జరిపించు గురువు సామాన్య ప్రజల కంటే అతీతంగా స్వార్థంను విడనాడి జీవించాలి.

### 4.2. పేదల కోపు తీసికోవాలి

ఈ ప్రస్తుత సమాజంలో ఎన్నో వస్తువులు తయారుచేయబడుచున్నవి. వాటిని అందుబాటులోకి తెచ్చిన వారిని అభినందించి, ప్రోత్సహించాలి. ఎందుకన, వారు దేవుని యొక్క అనుగ్రహం వలన మాత్రమే చేయగలుగుతున్నారు. ఇటువంటి ప్రాపంచికమైన వాతావరణంలో జీవిస్తున్నప్పటికి ప్రపంచానికి భిన్నంగా జీవించాలి. గురువు ఓ పేదవానిగా నిరాడంబరంగా జీవించవలసిన అవసరం చాలా ఉంది. సువార్త సేవకు అవసరమైన వాటికంటే అధిక ఆస్తిపాస్తులను కలిగి జీవించడం మంచిదికాదు. క్రీస్తు ఓ పేదవానిగా పశువుల పాకలో జన్మించెను. మానవ శరీరం హీనమైనది కాదు. పాపంవలన మలినమైనది నిజమే కాని పవిత్ర కన్య శరీరం ఇచ్చింది. పవిత్రాత్మ ఏర్పాటును చేసాడు. ఆయన పాపిగా ఎంచబడినా, పాపిగా

లెక్కించబడినది మనలను పవిత్రులుగా మలచుట కొరకే. అంతేకాని ఆయన పాపికాదు. అదే విధంగా గురువులు నిరాడంబరంగ పేదవారితో, అభాగ్యులతో కలిసి జీవించి వారిని ఉన్నత స్థానానికి లేవనెత్తాలి. పేదవారిపట్ల అసహ్యము కలిగి ఉండకూడదు. పేదరిక జీవితాన్ని అనుభవించినప్పుడు తమ కర్తవ్యాన్ని సరిగా నెరవేరుస్తు జీవించగలరు. గురువులు తమ నివాసాలను పెద్ద పెద్ద అలంకరణలతో, ఆడంబరంగా కాకుండా సామాన్య, పేదవారు సహితం గురువు సమీపమునకు వచ్చు విధంగా అమర్చుకోవాలి. గురువు పేదల పక్షాన నిలబడి వారి కొరకు పోరాడి వారిని అభివృద్ధి పధంలో నడపాలి. ఈ ప్రపంచంలో 100 కోట్లకు పైగా ప్రజలు తక్కువ ఆదాయంతో దుర్బర జీవనం గడుపుతున్నారు. వారు పోషకాహార లోపాలతో బాధపడుతున్నారు. పరిశుభ్రమైన త్రాగునీరు లేక పలురకాల వ్యాధుల బారినపడుతున్నారు. పేదవారికి గురువులు ఏవో కొన్నిదాన ధర్మాలు చేస్తే సరిపోదు. అన్ని విధాల న్యాయం జరిగేలా చూడాలి. మనకున్న వస్తువులను పేదవారితో పంచుకోకపోతే అది దొంగతనంతో సమానమవుతుంది, వారు జీవించే హక్కును హరించినట్లవుతుంది. ఎందుకంటే మనం కూడబెట్టుకున్నవి ఏవి మనవికావు, అవి పేదలకు చెందినవి అని పునీత జాన్ క్రీసోస్టం పలుకుతున్నారు. "దీనాత్ములు ధన్యులు, దేవ రాజ్యము వారిది" (మత్తయి 5.3) యేసు చేసిన పర్వత ప్రబోధంలో మొదటి వాక్యమిది. ఇది భౌతికమైనది, భావోద్వేగ సంబంధమైన పేదరికం, విద్యాబుద్ధులకు సంబంధించిన పేదరికం, ఆధ్యాత్మిక పేదరికం. ఈ లోకంలో ఉన్న పేదల పట్ల గురువులు ప్రేమకలిగి, ఆదరిస్తూ, సన్నిహితంగా ప్రవర్తించాలి. ఈ నా సొదరులలో అత్యల్పుడైన ఏ ఒక్కనికి మీరు ఇవి చేసినప్పుడు, అవి నాకు చేసితిరి. (మత్తయి 25:37) అను వాక్యం తీర్పు సమయంలో సామన్య క్రైస్తవులకంటే ముందు గురువులకు ప్రపధమంగా అన్వయించును. ఆనాటి అగ్రవర్గం ఈ పేదలనా చిన్న చూపు చూచి సమాజం నుండి బహిష్కరించింది. పేదలతో కలసి భుజించే వాళ్ళు వారితో పాపులౌతారని భావించింది. క్రీస్తు ఈ పేదవర్గాల జీవనం తీసికొన్నాడు. క్రీస్తు యాజకత్వం నుండి వచ్చిన గురువు యాజకత్వం గూడా ప్రజల కొరకే. క్రీస్తు లాగే గురువు కూడా దైవరాజ్యన్ని స్థాపించిడానికి కృషి చేయాలి. పేదవారితో కలిసిపొవాలి. పేదవాడిగా జీవించాలి.

### 4.3. కాపరిగా పని చేయాలి

కాపరి అనగా రక్షించేవాడు. కాపరి రక్షిస్తూ పోషించును. కాపరి తన మందకు హాని కలుగకుండా చూసుకునేవాడు. ఇక మంచి కాపరి తన ప్రాణాలను సహితం పణంగా పెట్టి తన మందను కాపాడుతాడు. ఇటువంటి కాపరి బాధ్యతను మన ప్రభువైన క్రీస్తు సంపూర్ణంగా నెరవేర్చి అదే బాధ్యతను తన అపొస్తలులకు తదుపరి గురువులకు అప్పగించగా నేటికి కొనసాగుతూనే వస్తుంది. గురువు కేవలం పూజలు చేసేవాడు మాత్రమే కాదు. అతని ప్రధాన పని కాపరిపని. పూజనర్పించడం, వాక్యాన్ని బోధించడం, తదితర కార్యాలన్ని కాపరి బాధ్యతలో భాగాలే. "నేను మంచి కాపరిని మంచి కాపరి గొఱ్ఱెల కొరకు తన ప్రాణము దారపోయును" (యోహాను 10:21). క్రీస్తు ఓ మంచి కాపరిగా, మేపరిగా వ్యక్తపరుచుకునెను. ప్రజల శ్రేయస్సుకై తన ప్రాణాన్ని పణంగా పెట్టెను. పాత నిబంధనలో తండ్రి దేవుడే స్వయాన నుడివినాడు. నేను మంచి కాపరిని, నా సమక్షంలో గొర్రెలు సేద తీర్చుకొనును. ఆయన వలె తన మందయైన యిస్రాయేలు ప్రజలను మోషే, అహరోను కాపరిలా నడిపారు. తదుపరి ఎందరో రాజులు, ప్రవక్తలు ఆ బాధ్యతను చేకొనగా కొందురు విజయంగా నడిపించగా మరి కొందరు విఫలమయ్యారు. "నేను మంచి కాపరిని" అని ఆదిలో దేవుడు పలికిన సత్యవచనం క్రీస్తునందు మాత్రమే సంపూర్ణమాయెను. నేటి శ్రీ సభలో గురువులు కూడా కాపరులుగా మారుచున్నారు. కావున గురువు తన జీవితాన్ని దేవునికి అంకిత మొనర్చుకొని, విశ్వసనీయతతో తనకు అప్పగించిన ఆత్మలు పెడత్రొవ పట్టకుండా జాగ్రత్రవహించాలి. మానవునిగా దేవుని కార్యాన్ని నిర్వర్తించి, ప్రేమ పాలనతో పరలోక భాగ్యాన్ని అందరు ప్రత్యక్షంగా పొంద ప్రయాసపడాలి. తమకు అప్పగింపబడిన ఏ ఒక్కరు నిరాశ చెందక, ఆశతో జీవించేలా అహర్నిశలు కృషిచేయాలి. కాపరి పిలుపుకు అర్థం పరమార్థం చేకూర్చుకుంటూ, ప్రజలను సంతృప్తి పరచే క్రీస్తులో ఆనందింపచేయగలవారు గురువు మాత్రమే. కావున క్రీస్తు ఏ విధంగా పలువురిని భాదల నుండి, వ్యాధుల నుండి విముక్తిల్ని కావించి, జీవితయాత్రను కొనసాగిస్తూ తు.చ తప్పకుండా తన తండ్రి చిత్తాన్ని నెరవేర్చారో, అదే రీతిగా గురువు తనను పిలిచిన క్రీస్తు చిత్తాన్ని నేరవేరుస్తూ జీవించాలి.

### 4.4. నూత్న సంస్కృతిని నెలకొల్పాలి

భారతదేశం “భిన్నిత్వంలో ఏకత్వం” కలిగిన దేశం అని పిలువబడును. అనగా భారతదేశం అనేక మతాలకు, కులాలకు, రకరకాల సంస్కృతులకు నిలయమైన దేశం. ఈ దేశంలో రకరాకల వర్గాలు కలిగిన ప్రజలు ఉన్నప్పటికి అందురు భారతీయులు అని పిలువబడుతారు. అనేక మార్లు అవివేకం, అజ్ఞానం, స్వార్ధంలాంటి కొన్ని చెడు గుణాలు ప్రజలను పాలించినప్పుడు చాలా రకాలైన విభేదాలకు తావివ్వబడుతుంది. అన్నదమ్మలులాగా జీవించవలసిన ప్రజలు బద్ధవైర్యం కలిగి జీవించడం జరుగుతుంది. వీటిన్నింటిని అధిగమించి ప్రజలలో ఓ నూత్న సంస్క ృతిని నెలకొల్పవలసిన భాధ్యత గురువుదే. గురువు ప్రజల కొరకు ఎన్నుకోబడ్డాడు, నియమించబడ్డాడు. అంతేకాని గురువు క్రైస్తవులు లేదా కేవలం కథోలికుల కొరకు మాత్రమే కాదు. గురువు తన మతాన్ని సంరక్షిస్తూ, ఇతర మత సభ్యులతో సంభాషించగలగాలి. వారితో మంచి అవినాభావసంబంధం ఏర్పరుచుకొని మాటలతోనూ, ప్రవర్తనతోనూ క్రీస్తును ఇతర మతాలకు పరిచయం చేయాలి. ఏ మతానికి సంబంధించిన వారైన ఏ కులానికి సంబంధించిన వారైన, ఏస్థితిలో ఉన్నవారైనా గురువును సమీపించడానికి, మాట్లాడడానికి ఏ విధమైన ఇబ్బందికరంగాను గురువు ప్రవర్తించరాదు. క్రీస్తు యెరుషలేము దేవాలయాన్నిగుర్చి మాట్లాడుతు, నా ఆలయం అన్ని జాతులకు ప్రార్ధనాలయం అన్నాడు.

(మార్కు 11:17) ఆయన యూదులకేకాక కననీయ స్త్రీలాంటి అన్యజాతి ప్రజలకు కూడా అద్భుతాలు చేసెను. ప్రపంచీకరణ అమితంగా వృద్ధిచెందుతున్న ఈ ఆధునిక కాలంలో స్వార్థం, అవినీతి, దోపిడి, బోగవాదం లాంటివి పోటిగా పెరుగుతున్నివి. ఈ పరిస్థితిలో చేప నీటికి ఎదురుగా ఈదుతున్న విధంగా వీటిని అధిగమిస్తూ ప్రజలలో ఓ మంచి అవగాహన కల్పించి ఓ నూత్న సంస్కృతిని నెలకొల్పగలగాలి. శాంతిని స్థాపించడం, సఖ్యసంబంధాల్ని పెంపొందించడం మొదలైన మానవీయ విలువలును పెంపోందించాలి (లూకా 4:18-19). క్రీస్తు సాధించిన గొప్పకార్యం దైవరాజ్యం స్థాపించడం. గురువు పనికూడా ఈ రాజ్యస్థాపనే. దైవ రాజ్యంలో అన్ని మంచి విలువలూ ఇమిడి ఉన్నాయి.

### 4.5. గురువు భావం, సన్యాసి భావం ప్రతిబించించాలి

గురువు అనగా తమస్సు నుండి వెలుగులోనికి నడిపించువాడు. గురువుకు చీకటి నందుగల ఇబ్బందులు అదేవిధంగా వెలుగునందుగల సౌఖ్యముకూడా తెలుసు. అందుచేతనే గురువు తన శిష్యులను వెలుగులోనికి నడిపిస్తాడు. గురువు తాను పొందిన జ్ఞానాన్ని ప్రజల శ్రేయస్సు కొరకై వినియోగిస్తూ వారి అజ్ఞానాన్ని తీసివేయాలి. గురువు కేవలం సాంఘిక పరమైన జ్ఞానాన్ని మాత్రమే కాక పరలోక రాజ్యాన్ని చేరడానికి వీలుకలుగు విధమైన విజ్ఞానాన్ని ప్రజలకు అందిస్తూ గురువు పాత్రను పోషించాలి. వారికి బైబులు గ్రంథాన్ని బోధించాలి. రక్షణ మార్గం చూపించాలి. వారిపట్ల ఆదరంతో, ప్రేమ భావంతో మెలగాలి. ప్రజలకు తనపట్ల గౌరవము, నమ్మకము కలిగేలా నడుచుకొవాలి.

కొన్ని శతాబ్దాలు పాటుగా ఒక విలువైన వజ్రాన్ని కాపాడుతున్నట్లుగా కథోలిక శ్రీ సభ ఈ బ్రహ్మచర్యాన్ని ఆచరిస్తూ వస్తుంది. అంతేకాక దానికై ఉన్న విలువను కాపాడుతు వస్తుంది. క్రీస్తు ప్రభువుగాని తదుపరి వచ్చిన అపోస్తలులు దీనిని ఖచ్చితమైన నిర్ణయంగా చేయలేదు. అనుసరించు వారి స్వేచ్ఛకు వదిలివేయబడింది. అందుచేతనే శిష్యరికానికి చేరడానికి బ్రహ్మచర్యాన్ని ఓ అర్హతగా దేవుడు నూతన నిబంధనలో నిర్ణయించలేదు. అపోస్తలులు కూడా ఆ విధంగా చేయడం జరగలేదు. కాలం గడిచేకొద్ది, పరిస్థితులు మారుతున్న కొలది, ప్రాపంచిక వ్యామోహాలకు అతీతంగా జీవించడానికి, కొన్ని పవిత్ర కార్యాలు నిరవధికంగా నెరవేర్చడానికి ఏకతాదృష్టి కలిగి జీవింలాలని బ్రహ్మచర్యం తీసుకురావడం జరిగింది. 11వ శతాబ్దంలో గ్రెగొరి జగద్గురువులు బ్రహ్మచర్య జీవితాన్ని తప్పకుండ పాటించాలని చెప్పారు. 12వ శతాబ్దంలో 1139న రెండవ లాటరన్ మహసభలో కూడ గురువులు వివాహం చేసుకోకూడదని ప్రకటించారు. 1563, ట్రెంట్ మహాసభ అప్పటి వరకు పాటిస్తున్న బ్రహ్మచర్య జీవితాన్ని కొనసాగించాలని చెప్పింది. దీనికోసం అనేక వాదోపవాదనలు జరిగాయి, తరువాత క్రీస్తు జీవితంపైన పూర్తిగా ఆధారం చేసుకొని, దేవునికి మరియు ప్రజలకు సంపూర్ణంగా సమయాన్ని వెచ్చించడం కొరకై కతోలిక బ్రహ్మచర్యాన్ని తీసుకురావడం జరిగింది. ఈ సన్యాసి జీవితం కేవలం కతోలిక మతంలోనే కాదు ఇతర మతాలలో ముఖ్యంగా మనదేశంలో ప్రాచీన

కాలం నుండి సన్యాసులున్నారు. హిందువులకు సన్యాసుల పట్ల భక్తి ఉంటుంది. సన్యాసి అనే పదానికి వదలిపెట్టినవాడు అని అర్థం. కావున గురువులు అన్ని విడచిపెట్టి క్రీస్తును అనుసరిస్తూ, తమకు ఇచ్చిన ప్రజలను క్రీస్తు బాటలో నడిపించాలి.

## 4.6. గురువు - నాయకత్వం

గురువు ప్రధానంగా తన ప్రజలను నడిపించాలి. గురువు యాజమానుడు, దర్శకుడు కాదు. అతడు సేవకుడు, పర్యవేక్షకుడు. దేవుని అమృత సమాన నిగూఢ సత్యాలను, సంస్కారాలాను పర్యవేక్షిస్తూ, సేవకునిలా పరిచర్య చేయాలి. కొన్ని సార్లు నాయకత్వం, దర్శకత్వం వహించవలసి వచ్చినా, వినయంతో ప్రజలు పాదాలు కడుగుతూ, వారి కన్నీరు తుడుస్తూ, వారి పాపాలకై మన్నన వేడుతూ క్రీస్తులా సజీవ యాగమైపోవాలి. కాపరులుగా, నాయకులుగా,తమ కివ్వబడిన అధికారాన్ని మైత్రాణుల పేరిట దైవీక కుటుంబం, సౌభ్రాతృత్వంలో ఏకకుంటుంబంగా కూడేటట్లు చేసి క్రీస్తు ద్వారా పరిశుద్ధాత్మతో తండ్రి దేవుని వద్దకు వారిని నడిపించాలి. ఒక నాయకుడిగా ముందుండి విశ్వాసులను విశ్వాస పథంలో నడపాలి. ప్రజల ఆధ్యాత్మిక కార్యక్రమాలు విడిచిపెట్టి, వారిని నడిపించటానికి బదులు లోక వ్యామోహాలలో మునిగి తేలియాడకూడదు. ఏ సమయంలోనైనా ప్రజలకు అందుబాటులో ఉండగలగాలి. ప్రజలను తన వెనుక త్రిప్పికొనక తమ ప్రజలతో కలిసి తిరగాలి. గురువు నాయకత్వం చైతన్య వంతంగా ఉండాలి. ప్రజలు మానసిక, శారీరక ఇబ్బందుల నుండి బయటపడతాము అనెడి భరోసా వారికి కల్పించాలి. ఎందరో నాయకులు ప్రజల స్థాయికి వచ్చినట్లుగా ముఖ్యంగా సాక్షాత్తు క్రీస్తు ఒక నాయకుడుగా తన మందను, శిష్యులను ముందుకు నడిపి విజయపతాకం ఎగురవేసెను. ఆయన అనుచరులుగా, అపర క్రీస్తులుగా నిలిచే గురువులందరూ మంచి నాయకులుగా ఉండాలి.

## 4.7. ప్రవక్తగా మెలగాలి

ప్రభువు ఆత్మ నాపై ఉన్నది పేదలకు సువార్తను బొధించుటకై ఆయన నన్ను అభిషేకించెను (లూకా 4:18) క్రీస్తు నిజమైన ప్రవక్త అందుచేతనే అన్యాయాలను ధనికుల ఆగడాలను ఎదిరించాడు. యొరుషలేము దేవాలయము

మంచికి బదులు చెడు జరుగుతున్నప్పుడు వారిని ఖండించి పారద్రోలెను. ధర్మశాస్త్ర బోధకులను, పరిసయ్యులను ఎన్నో మార్లు ఖండించెను. క్రీస్తు ఓ ప్రవక్తగా, ఆదర్శవంతమైన ప్రవక్తగా ప్రజలకు బోధించెను. దేవుని బోధనలకు దూరమై జీవించే వారిని హెచ్చరించేవాడే ప్రవక్త. ప్రవక్త యొక్క ముఖ్య విధి దేవుని ప్రవచనాన్ని ప్రజలకు తెలియజేయడం. జరగబోయే విషయాలను ముందుగానే తెలియజేస్తూ ప్రజలను నడిపించడం. నేటి ప్రపంచంలో గురువు కూడా ఓ ప్రవక్త పాత్ర పోషించుచుండెను. మంచి ప్రవక్ర గురువు. నిరంతరం దైవ వాక్కును, పట్టుదలతో, దీక్షతో పారాయణం చేస్తూ స్వీకరించిన వాక్యం యొక్క మాధుర్యాన్ని ఫలవంతంగా విశ్వాసుల హృదయాల్ని కదిలించేలా పోరాడుతాడు గురువు.

## 4.8. స్త్రీల హక్కులను కాపాడాలి

స్త్రీల పట్ల కనీస గౌరవం కలిగి ఉండాలి. అలనాడు క్రీస్తు స్త్రీలకు సరైన గౌరవమర్యదలు ఇవ్వడం జరిగెను. తన తల్లిని విడనాడక సిలువ మరణం వరుకు ఆమెను ఆదరించెను. సమరియ స్త్రీతో సంభాషణ ఆమెకు గౌరవాన్ని కొనితెచ్చెను. వ్యభిచారంతో పట్టుబడిన స్త్రీని అవహేళన చేయక పాపమన్నింపు ఒసగెను. యెరూషలేము కుమార్తెలారా నా నిమత్తము ఏడువకండి అని క్రీసు పలికారు వారందురు ప్రభుని శ్రమలను చూచి విలపించడానికి గల కారణం క్రీస్తుకు వారందరితో ఉన్న మంచి అవినాభావ సంబంధమే. క్రీస్తు జీవితంలో స్త్రీలకు గౌరవ మర్యాదలు ఇస్తూ వారిని విడిచిపెట్టక వారికి తగిన స్థానం కల్పించడం జరిగింది. ప్రస్తుత సమాజంలో స్త్రీలు అనేక చోట్ల అణచివేతకు గురౌతున్నారు. వారి హక్కులకు చాలా భంగం కలుగుతుంది. పురుషులదే పైచేయి అన్నట్లుగా ప్రపంచం నడుస్తుంది. మన క్రైస్తవ సమాజంలో కూడా స్త్రీలకు సముచిత స్థానం, తగిన ప్రాతినిధ్యం కొంతవరుకు కొరవడుతుంది. క్రీస్తు మాదిరిగా గురువు కూడా స్త్రీలకు తగిన పాత్రను ఇవ్వాలి. వారి బాధ్యతను వారు నిర్వర్తించే విధంగా వారికి స్వేచ్ఛను కల్పించాలి. మాకు ఏ బాధ్యతా లేదు. మేము పనికిరాం అనే వారి ఆలోచనను పారద్రోలాలి. స్త్రీలకు ఏవిధమైన బాధ్యతలు అప్పగిస్తే తిరుసభ అభివృద్ధి సాధిస్తుందో ఆలోచించి ఆయా బాధ్యతలను అప్పగించాలి. విఫలమైతే సరిదిద్ది పోత్సహించాలి.

## 4.9. సేవా నాయకత్వం

క్రీస్తు తాను దేవుడైనప్పటికి మనుష్యరూపాన్ని ధరించి ఒక రాజుగా, రాజకీయవేత్తగా కాకుండా సాధారణ వ్యక్తిగా ఈ లోకంలో జన్మించెను. జన్మించిన క్రీస్తు " సేవింపడానికేగాని, సేవింపబడడానికి రాలేదు" (మత్తయి 20:28) అనెను. తగ్గింపు మనస్తత్వంలో శిష్యుల పాదాలు కడిగి వారిని స్నేహితులుగా పిలిచెను. ఆయన సేవకు అవధులు లేకుండాపోయెను. అందుచేతనే ఆయన అంటరానివారిగా పరిగణింపబడిన వారిని సహితం పలకరించి వారితో సౌఖ్యంగా ప్రవర్తించెను. జక్కయ్య ఇంటిలోనికి ప్రవేశించి ఆహారమును భుజించెను. సువార్తలో మనకు ఆయన నిరాడంబర జీవితానికి, సేవక రూపానికి ఎన్నో ఆధారాలు ఉన్నాయి. ఆయన జన్మ ఒక సేవ, ఉత్తమమైన సేవ, ఆయన జీవితం ఒక సేవ, ఆయన సిలువ మరణం అత్యుత్తమమైన సేవ. ఇటువంటి క్రీస్తుని స్థానంలో అపరక్రీస్తులుగా నిలుస్తున్న గురువులు సహితం సేవా జీవితాన్ని జీవించాలి. ప్రజల మధ్య ఉన్న తారతమ్యాలను నిర్మూలించడానికి బదులు తానే తారతమ్య నిర్మాతగా మారకూడదు. ప్రజలతో కలిసి మెలసి జీవించాలి. వారి జీవిత విధానాన్ని అర్థం చేసుకొని వారితో గర్వంగా ప్రవర్తించకుండా సాధుశీలతను కలిగి ఉండాలి. వారి స్థితిగతులు అర్థం చేసుకొని లేమియందు కలిమియందు వారిని ప్రోత్సహించాలి. ప్రజల పేదరికం, అసౌకార్యాలలో చిరాకు పడకుండా, వారిని మంచి స్వభావంతో అర్థంచేసుకొని వారి బాధలలో బాధపడుతూ, వారి సంతోషంలో సంతోషిస్తూ ముందుకు సాగాలి.

## 4.10. గృహస్థ క్రైస్తవులను భాగస్థులను చేయాలి

అంతా నాదే, నేనే సమస్తం పరిపాలిస్తాను అనే ధోరణి క్రీస్తుకు లేదు. ఆయన సేవారూపంతో జీవించెను. రక్షణ కార్యంలో తదితరులందరికి భాగస్థులను చేసెను. రక్షణ కార్యం క్రీస్తు ఒక్కడే నిర్వర్తించగలిగిన సామర్థ్యం ఉన్నప్పటికి, శిష్యులను ఎన్నుకొనెను. వారిని భాగస్థులను చేసెను. తల్లిని గౌరవించెను. ఏక పరిపాలన అన్న విధానం క్రీస్తు జీవితంలో కనిపించలేదు. ప్రతీకార్యంలో ఎంతో కొంత ఇరుగుపొరుగు వారికి భాగం కల్పించాలి. అలనాటి క్రైస్తవ సమాజంలో అపోస్తలులు కూడా ఏడుగురు పరిచారకులను ఎన్నుకొవడం జరిగింది. వారికి కొంత బాధ్యతలను అప్పగించడం జరిగింది. నేటి గురువులు సహితం తమ విచారణలలో తదితర దైవ కార్య నిర్వాహణలో గృహస్థులకు భాగమివ్వాలి.

గురువు ఒక్కడే తన విచారణను ఒంటి చేతితో నడపగలడనుకొనుట క్రైస్తవులకు విజ్ఞత కాదు. విచారణ బాధ్యతలలో అందురు పాలుపంచుకోవాలి. పెద్దల సంఘము, యువజన సంఘము, పాటల బృందము, మరియుదళము, వెన్సెంటే దె పౌల్, ప్రార్థనా వీరులు వంటి వివిధ సంఘములు ప్రాధాన్యత సంతరించుకొని ముందడుగు వేయవలెను. గురువు వీటిని ప్రోత్సహించి వారికి ఆధ్యాత్మిక నాయకత్వం వహింపవలెను. క్రైస్తవులు కూడా తమ గురువును ఆదరించి అన్ని విధముల తోడ్పడాలి. ఇలా ఉన్నప్పుడు శ్రీ సభ అభివృద్ధి పథంలో నడుస్తుంది.

**ముగింపు**

గురువు సమాజం నుండి ఎన్నుకొనబడి, ఈ ప్రపంచంలో గొప్ప కార్యములు చేయడానికి పిలువబడ్డాడు. గురువు ఈ లోకంలో జీవిస్తున్న, ఈ లోకానికి చెందినవాడు కాదు. "మీరు నావలె లోకమునకు చెందినవారు కారు" (యోహాను 17:16). ప్రతి గురువు క్రీస్తుకు సంబంధించినవాడు, దేవుని మనిషి, ప్రార్థనాపరుడు, సేవచేసేవాడు, రక్షణను ప్రసాదించువాడు. గురువు ఒక్కడే పాపములను మన్నించగలడు. క్రీస్తును గూర్చిగాని, శ్రీసభ సత్యములనుగూర్చిగాని చెప్పగలవాడు గురువు. కాని ప్రస్తుత సమాజంలొ గురువుల కొసం ప్రజలలో అనేక సందేహాలు వస్తున్నాయి. గురువు ఉపాధ్యాయుడు, సాంఘికపనివాడు, వివాహ సలహాదారుడు, పరిపాలించువాడు అసలు ఎవరు? ఎందుకనగ ప్రజలు ప్రస్తుత గురువులలో దైవత్వంగాని, ప్రార్థననుగాని, పవిత్రతనుగాని, శాంతపరుడుగాని, ప్రేమ ఆనందములను పంచువాడుగ చూడలేకపోతున్నారు. వారి ఆధ్యాత్మిక దాహమును తీర్చుకోడానికి గురువులను సమీపింపలేకపోతున్నారు. ముఖ్యముగ క్రీస్తును చూడలేకపోతున్నారు. గురువు కూడ మన వలె సధారణ మనిషిగ గుర్తిస్తున్నారు కారణం ధనము అధికారం, లోకవస్తువులు, తన ఆనందం కోసం జీవిస్తున్నారు కాబట్టి. గురువులు ఎల్లప్పుడు పవిత్రంగ ఉంటు, వారి ఆధ్యాత్మిక జీవితంలొ సహాయపడతారని ఆశిస్తున్నారు. దేవునితో వ్యక్తిగత సంబంధాన్ని ఎర్పడగలదని కొరుకొంటున్నారు.

గురువు తాను విశ్వసించిన దానిని బోధించడమే కాక బోధించిన దానిని ఆచరణలో పెడుతూ నిత్యగురువైన క్రీస్తుకు ప్రతిరూపముగా అపరక్రీస్తుగా, సువార్త

సేవలొ పాలుపంచుకొనుచు, క్రీస్తు వాక్యాను ప్రబోధించి ప్రజలను విశ్వాసములో నడపించాలి. తాము నిర్వర్తించవలసిన గురుధర్మాలను నిజాయితీగా, అవిశ్రాంతంగా నెరవేర్చుతూ ఉంటే– ఆ ధర్మాచరణమే సమస్యలకు పరిష్కారం చూపిస్తుంది. పవిత్రతా మార్గంలో పురోగమింపజేస్తుంది, శుద్ధీకరిస్తుంది. గురు ధర్మ నిర్వహణలో తాము ఒంటరివారు కారనీ దేవుని దివ్యశక్తి తమవెన్నంటే ఉందని గుర్తించాలి.

భౌతికంగా, సమృద్ధిగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రపంచంలో గురువు సేవాభావంతో జీవించాలి. తనకు అప్పగించిన మందను సక్రమమైన మార్గంలో నడపాలి. ప్రతిగురువు ఎల్లప్పుడు ప్రార్ధనాజీవితాన్ని అనుసరిస్తు, తన ప్రజలను కూడా ప్రార్ధన జీవితంలో నడిపించాలి. వారిలొని మంచిని గమనిస్తు, మంచి కార్యాలు చేయుటకు ప్రొత్సహించాలి. ప్రజలు కూడా వారి జీవితాంతం వరకు తమ గురువులకు బాసటగా నిలిచే వ్యక్తులుగా, తమ గురువుల కొరకు ప్రార్ధించే సంఘంగా, గురువుల కష్టాలలో, బాధలలో, ఒంటరితనంలో బాసటగా నిలిచే సంఘసభ్యులుగ తయారవాలి.

గురుత్వం కోసం వ్రాస్తునప్పుడు, ఎటువంటి ఆధ్యాత్మికత గురువు కలిగి ఉండాలి. ఎలా ఉంటే ప్రజలు ఇష్టపడతారు. క్రీస్తును ప్రజలకు అందించాలంటే తను ఎల్లప్పుడు పవిత్రుడుగ, ప్రార్ధనాపరుడుగ ఉండాలని, గురుత్వ జీవితానికి పిలువబడిన నేను ఎటువంటి ఆద్యాత్మిక జీవితమును జీవించాలి అనే అంశాలను నేర్చుకున్నాను. చివరిగ నన్ను ఎవరైన గురువు కోసం అడిగినప్పుడు గురువు దేవుని, ప్రజలను, ప్రేమించేవాడని, పవిత్రమనిషి, ఈ లొకంలొ దేవుని తరువాత చేసే గొప్పకార్యలు గురువు చేయగలడని చెప్పుతాను.

❊ ❊ ❊ ❊









## భక్త యోహాను ప్రచురణలు

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ : 040-27201427, 27200370
e-mail : stjohnshyd2@gmail.com
www.stjohnseminaryhyd.org

Holycrossprinters 9848145417